

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 12-10-2025 | పేజీలు: 14+28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 194 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి మ.2:17 తదుపరి సప్తమి, నక్షత్రం: మృగశిర మ.1:37 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: రా.9.36 -11.07, దుర్ముహూర్తం: సా.4:18-5.05, అమృతఘడియలు: శేషం ఉ. 6.55 వరకు. రా.2.56-4.27, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 5.51 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హైకోర్టు స్టేపై

అఖిలపక్ష భేటీ పెట్టాలి

రిజర్వేషన్లపై సర్కారు న్యాయ పోరాటానికి మద్దతు

ప్రధాని వద్దకు అఖిలపక్ష నేతలను తీసుకెళ్లాలి

బీసీ రిజర్వేషన్ల రక్షణకు బీజేపీ బాధ్యత తీసుకోవాలి

జాజుల, కోదండరాం, వీహెచ్ తదితర నేతల డిమాండ్

13

రేపు సుప్రీంకు!

బీసీ రిజర్వేషన్లపై పిటిషన్ వేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

జనరల్‌కు 50%తో ఎన్నికలు పెట్టాల్సిందేనన్న హైకోర్టు

శుక్రవారం అర్ధరాత్రి వెలువడ్డ తీర్పు ప్రతిలో వివరాలు

ముందుకు వెళ్లడం తప్ప మార్గంలేని పరిస్థితిలో ఈసీ

ఏం చేయాలో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ?

ఈ నేపథ్యంలోనే సుప్రీంకు వెళుతున్న కాంగ్రెస్ సర్కార్

అక్కడి పరిణామాలను బట్టి తర్వాతి కార్యాచరణ

బీసీ రిజర్వేషన్లే అజెండాగా 16న మంత్రివర్గ భేటీ





హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే జీవోను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తీర్పు గురువారం వచ్చినప్పటికీ శుక్రవారం అర్ధరాత్రి తీర్పుకాపీ అందుబాటులోకి వచ్చింది. అందులో సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేయాలని, జీవోలో యాభై శాతానికి మించి ఇచ్చిన రిజర్వేషన్‌ను జనరల్ సీట్లుగా పరిగణిస్తూ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుకు వెళ్లాలని హైకోర్టు స్పష్టం చేసింది. 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాల్సిందేనని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సంఘం స్వతంత్ర వ్యవస్థ అయినప్పటికీ ఈ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముడిపడిన అంశం కావడంతో హైకోర్టు ఆదేశంపై ఏం చేయాలో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. సోమవారం స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) లేదా అత్యవసర విచారణ కింద పిటిషన్ దాఖలు చేయనుంది. హైకోర్టు తీర్పు కాపీతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తాము చేసిన కార్యాచరణ వివరాలన్నింటినీ సమగ్రంగా పిటిషన్లో భాగంగా సుప్రీంకోర్టుకు అందజేయనుంది. జీవో నంబరు 9 మీద హైకోర్టులో పిటిషన్ వేసి స్టే సంపాదించిన బుట్టెంగారి మాధవరెడ్డి తదితరులు శుక్రవారమే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేస్తే తమ వాదనలు విన్న తరువాతే ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కేవియట్ పిటిషన్ వేశారు. రిజర్వేషన్లు యాభై శాతం మించకుండా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జీవో నంబర్ 9లో కల్పించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి అవకాశం లేదని స్పష్టమవుతోంది. ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూనే ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర మంత్రివర్గం, కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతున్న

మిగతా 13వ పేజీలో...



బీసీ రిజర్వేషన్లపై

రాజీ లేదు

42% కోటా ఇచ్చాకే స్థానిక ఎన్నికలు

అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కుట్ర

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

13

వైద్యానికి శస్త్రచికిత్స!

కొత్త పలుకు



సంక్షేమం పేరిట హద్దులు మీరి ఖర్చులు చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో అన్నీ ప్రభుత్వమే నడపాలనుకోవడంలో అర్థం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైద్య విద్యను కాపాడుకోవాలన్నా, పేదలకు వైద్యం దూరం కాకూడదు అనుకున్నా ప్రభుత్వంతో ప్రైవేటు వ్యక్తులు చేతులు కలపక తప్పనిసరి. కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఏపీలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పీపీపీ) వైద్య కళాశాలల ఏర్పాటు వ్యవహారాన్ని ప్రతిపక్షం అందిపుచ్చుకుంది.

పేదలకు ఉచిత వైద్యాన్ని నిరాకరించకుండా ప్రభుత్వ ధనంతో ఏర్పాటైన భవనాలు, సౌకర్యాలను ఉపయోగించి స్థోమత ఉన్న వారి వద్ద ఫీజులు వసూలు చేయడం తప్పిదం కాదు కదా? అంతిమంగా ప్రజలు కోరుకొనేది నాణ్యమైన విద్య. పేదలకు కావల్సింది ఉచిత వైద్యం. ఈ రెండూ ఏక కాలంలో లభించినప్పుడు ఎవరికైనా అభ్యంతరాలు ఎందుకుండాలి? కార్పొరేట్ ఆస్పత్రులను మినహాయిస్తే, మిగతా ప్రైవేటు ఆస్పత్రుల కంటే ప్రభుత్వ ఆస్పత్రులకు మెరుగైన భవనాలు, వసతులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. లేనిదల్లా వాటిపై ప్రజల్లో నమ్మకం. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం ఏర్పడాలంటే జవాబుదారీతనం తీసుకురావలసిందే.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటు వార్డులు, గదులు ఉంటే తప్పేమిటి? పీపీపీ విధానంలో పేరొందిన డాక్టర్లకు ఆ ఆస్పత్రుల నిర్వహణ అప్పగించవచ్చు. తమ స్వార్థం కోసమైనా వారు కష్టపడతారు. శస్త్రచికిత్సల్లో నిపుణులను రప్పించి డబ్బు చెల్లించిన వారితో పాటు పేదలకు కూడా వారి సేవలను అందించవచ్చు.

పోటీతత్వం పెరగడంతో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు బ్యాంకులను జాతీయం చేయగా, ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహించే పరిస్థితి!

నెహ్రూ హయాంలో హైదరాబాద్‌లోని బాలానగర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ సంస్థ (ఐడీపీఎల్) ఏర్పాటైంది. ప్రస్తుత ఫార్మా దిగ్గజాలైన మురళి, డాక్టర్ అంజిరెడ్డి, పార్థసారథి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి వంటి వారందరూ అందులో పనిచేసిన వారే. ఐడీపీఎల్‌లో తమ పరిస్థితి ఎదుగూ బొదుగూ లేకుండా ఉండటంతో అందులో పనిచేసిన పలువురు బయటకు వచ్చి సొంతంగా ఫార్మా కంపెనీలను ప్రారంభించి ఇవాళ కుబేరుల జాబితాలో చేరారు. ఐడీపీఎల్ మాత్రం చాలాకాలం క్రితమే మూతపడింది. ప్రభుత్వ రంగం అని పట్టుకొని వేలాడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ సంస్థే నిదర్శనం.

ఒకప్పుడు టెలిఫోన్ కనెక్షన్ కోసం నెలలు, సంవత్సరాలు వేచి చూడవలసి వచ్చేది. ఈ రంగంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించడంతో పరిస్థితిలో ఎంత వేగవంతమైన మార్పు వచ్చిందో చూస్తున్నాం. ఫోన్ కనెక్షన్ల కోసం మన చుట్టూ తిరుగుతున్నారు. ఏ రంగంలోనైనా మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు వ్యతిరేకత రావడం సహజం. మార్పు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తే అర్థం చేసుకుంటారు.

మెట్రో ఆస్తుల బదిలీ తర్వాతే

రెండో దశ డీపీఆర్

- నెలాఖరులోగా ఆస్తుల మదింపు పూర్తి
- ప్రత్యేక ఆడిటర్‌తో లెక్కలు తీస్తున్న ప్రభుత్వం
- త్వరలో కేంద్రానికి ఆస్తుల బదిలీ పత్రం
- ఎల్ అండ్ టీ వాడుకోని 39 ఎకరాలపైనా ఆరా

2

రోహ్‌తక్ ఎస్పీపై వేటు

బిజార్డియాను బదిలీ చేసిన హరియాణా ప్రభుత్వం

దళిత ఐపీఎస్ పూరన్ కుమార్ భార్యకు సోనియా లేఖ

న్యాయ పోరాటంలో అండగా ఉంటానని భరోసా

పోస్టుమార్టానికి ఇంకా సమ్మతించని కుటుంబసభ్యులు

దోషులుగా తేలిన వారిపై చర్యలు: సీఎం సైనీ

14

పశ్చిమ బెంగాల్‌లో

మరో ఘోరం

ఒడిసా వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

ప్రైవేటు వైద్య కళాశాల సమీపంలోనే ఘటన

స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లగా దారుణం

14

చైనాపై మరో 100%



సుంకాలు విధిస్తూ ట్రంప్ ప్రకటన

ఇప్పటికే ఉన్న 30 శాతానికి అదనం

చైనాకు సాఫ్ట్‌వేర్ల ఎగుమతిపైనా ఆంక్షలు

వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి..

అరుదైన ఖనిజాల సరఫరాపై చైనా నియంత్రణలు పెట్టడంతో ఆగ్రహం

14



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

ఐకానిక్‌గా టీస్క్వేర్

వచ్చే నెలాఖరు కల్లా భవన నిర్మాణ పనులు ప్రారంభం

అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించేలా..

అద్భుతమైన మాల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దాలి

ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

వి-హబ్, ఏఐ హబ్, టీస్క్వేర్‌లపై సీఎం సమీక్ష

ఏఐ స్టార్టప్‌లు, సెంటర్లు, ప్రాజెక్టులను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యమన్న రేవంత్‌రెడ్డి

12

రాష్ట్రాభివృద్ధికి

8 ప్రశ్నలు

ప్రజల నుంచి జవాబులకు సర్వే

తెలంగాణ రైజింగ్-2047

పేరుతో ఆన్‌లైన్‌లో నిర్వహణ

పాల్గొంటే పార్టిసిపేషన్ పత్రం

రైజింగ్ తెలంగాణ కోసం బోర్డు

రైతన్నకు ధనధాన్యం

రూ.35,440 కోట్లతో కేంద్రం 2 పథకాలు

ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

11,440 కోట్లతో పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్

24 వేల కోట్లతో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన

దేశ వ్యాప్తంగా సాగులో వెనుకబడిన 100 జిల్లాల్లో పథకం

రబీ సీజన్ నుంచి 2030-31 వరకు 2 పథకాల అమలు

అప్పటికి 350 లక్షల టన్నుల పప్పుధాన్యాల ఉత్పత్తి లక్ష్యం

ధనధాన్య కృషి యోజనలో నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్, జనగామ జిల్లాలు

2




న్యూఢిల్లీ, అక్టోబరు 11: దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి, వ్యవసాయ రంగంలో వెనుకబడిన వంద జిల్లాల్లో వృద్ధిని మెరుగుపరచడమే లక్ష్యంగా రూ.35,440 కోట్లతో రెండు భారీ వ్యవసాయ పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. శనివారం భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ) పూసా క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఇందుకు వేదికైంది. 'ప్రధానమంత్రి ధన ధాన్య కృషి

మిగతా 14వ పేజీలో...

12

'మద్దతు'లో 25% పరిమితిని రద్దు చేయండి

జొన్న, మక్కలను పథకంలో చేర్చండి.. కేంద్రానికి తుమ్మల లేఖ



కొండా వర్సెస్ పొంగులేటి!



దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యం!

అధిష్ఠానానికి కొండా దంపతుల ఫిర్యాదు?

ఎవరిపైనా మేం ఫిర్యాదు చేయలేదు: మురళి

13



బనకచర్లను అడ్డుకుంటాం

ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంపునూ ఒప్పుకోం

కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారే ఉన్నా రాజీపడబోం

పదేళ్లపాలనలో ఒక్క కాళేశ్వరం కట్టారు..అదీ కూలింది

హరీశ్‌రావు అసత్య ప్రచారాలను మానుకోవాలి: ఉత్తమ్

బనకచర్ల అనుమతుల ప్రక్రియలో పురోగతి!

నిమ్మకు నీరెత్తినట్టుగా ముఖ్యమంత్రి రేవంత్ తీరు: హరీశ్

3


మాట్లాడుతున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి

ఎస్సార్‌యూకు ప్రపంచ స్థాయి గుర్తింపు

- ది వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో చోటు
- వివరాలు వెల్లడించిన ఎస్సార్‌యూ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్ విశ్వవిద్యాలయం ప్రపంచ ప్రఖ్యాత టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో 801-1000 బ్యాండ్‌లో స్థానం సంపాదించిందని ఆ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి తెలిపారు. ఇది తెలంగాణకు గర్వకారణమన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. దేశంలోనే అనతికాలంలో గ్లోబల్ ర్యాంకింగ్‌లో చోటు దక్కిన ఏకైక విశ్వవిద్యాలయంగా ఎస్సార్‌యూ గుర్తింపు పొందిందన్నారు. ఇటీవల వెలువడిన ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లోనూ ఎస్సార్ వర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో 91వ స్థానం, విశ్వవిద్యాలయం విభాగంలో 101-105 బ్యాండ్‌లో నిలిచిందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఈ స్థిరమైన ప్రదర్శన, విద్యా ప్రామాణికత, పరిశోధన, నాణ్యమైన బోధన పట్ల ఎస్సార్‌యూ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) ర్యాంకింగ్స్ ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయ ప్రదర్శనను అంచనా వేయడానికి అత్యంత విశ్వసనీయమైన ప్రమాణాలుగా పరిగణించబడుతాయని చెప్పారు. ఎస్సార్ దేశంలో టాప్-28, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 10వ స్థానం, తెలంగాణలో టాప్ 100లో చోటు దక్కించుకుందని తెలిపారు. వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఈ ర్యాంకింగ్ ఎస్సార్‌యూ బలమైన విద్యాప్రాతిపదిక, అంతర్జాతీయ దృష్టి కోణానికి నిదర్శనమన్నారు.

'పర్యాటకం'లో రూ.3,500 కోట్ల పెట్టుబడులు

- ప్రతి యేటా అక్టోబరులో ట్రావెల్‌మార్ట్: మధ్యప్రదేశ్ సీఎం

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి ఆకాశమే హద్దుగా ముందుకెళ్తున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అన్నారు. శనివారం భోపాల్‌లోని కుషాభావు ఠాక్రే అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్-2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో రానున్న కాలంలో రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగాలకు చెందిన టూర్ ఆపరేటర్లు ముందుకొచ్చారన్నారు. అత్యధికంగా రిసార్టులు, హోటళ్ల నిర్మాణానికి ఆయా సంస్థలు ఆసక్తి కనబర్చాయని వివరించారు. సినీరంగం నుంచి వచ్చే ఐదేళ్లలో రూ.50 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బాలాజీ టెలీఫిల్మ్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సినీరంగ ప్రముఖులు ఏక్తా కపూర్, గజరాజ్‌రావు, రఘువీర్ యాదవ్‌లు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. పర్యాటకంతోపాటు ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టే వారికి 30 శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఇకపై ప్రతి ఏడాది అక్టోబరులో ట్రావెల్ మార్ట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హాజరవ్వగా.. 27 దేశాల నుంచి 80 మందికిపైగా విదేశీ టూర్ ఆపరేటర్లు, 150 మందికిపైగా దేశీయ టూర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ల సర్వీసు క్రమబద్ధీకరణకు లైన్ క్లియర్

హైదరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)లుగా పనిచేస్తూ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులైన 2500 మంది సర్వీసు క్రమబద్ధీకరణకు మార్గం సుగమం అయింది. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996లోని రూల్‌నెం.16(సీ)(2) ప్రకారం బదిలీ ద్వారా లేదా నియామక ప్రక్రియ ద్వారా నియమితులైన జూనియర్ అసిస్టెంట్‌లను ఏడాదిలోపే ప్రొబేషన్ ప్రకటించాలని సీసీఎల్‌ఏ కార్యదర్శి మంద మకరందు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

మెట్రో ఆస్తుల బదిలీ తర్వాతే రెండో దశ డీపీఆర్‌కు ఆమోదం

- నెలాఖరులోగా ఆస్తుల మదింపు పూర్తి
- ప్రత్యేక ఆడిటర్‌తో లెక్కలు తీస్తున్న ప్రభుత్వం
- త్వరలో కేంద్రానికి ఆస్తుల బదిలీ పత్రం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్ అండ్ టీ నుంచి మొదటి దశ మెట్రో నిర్వహణను పూర్తిగా తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఆస్తుల లెక్కలను తేల్చే పనిలో పడింది. ఇప్పటికే సదరు సంస్థతో టేకోవర్ ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం ఆస్తుల మదింపు చర్యలను వేగవంతం చేసింది. ఇటీవల ప్రత్యేక ఆడిటర్‌ను నియమించింది. ఈ నెలాఖరులోగా మొదటి దశ మెట్రో వివరాలన్నీ సమగ్రంగా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశ మెట్రో మొదలు పెట్టాలంటే మొదటి దశను సొంతం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 162.5 కిమీ పరిధిలో 8 కారిడార్లతో రెండో దశను నిర్మాణానికి సిద్ధమైన ప్రభుత్వం.. రూ.43,848 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. పార్ట్-ఏ కింద 5 కారిడార్లు, పార్ట్-బీ కింద 3 కారిడర్లను చేపట్టనుంది. వాటి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను(డీపీఆర్) అనుమతి కోసమే కొద్ది నెలల క్రితమే పంపినా మెట్రో మొదటి, రెండో దశ అనుసంధానంలో సమస్యతో ఇప్పటివరకు కేంద్రం డీపీఆర్‌ను పక్కనబెట్టింది. మొదటి దశను టేకోవర్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆస్తుల బదిలీకి చట్టబద్ధమైన పత్రాన్ని కేంద్రానికి అందించాకే డీపీఆర్‌కు అనుమతి లభిస్తుందంటున్నారు. డీపీఆర్‌కు ఆమో దం లభిస్తేనే మెట్రో రెండో దశ మొదలవుతుంది. అందుకే, ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అవసరమైన చర్యలు తీసుకుంటోంది.



వినియోగించుకోని భూములపై ఆరా

మొదటి దశ మెట్రోను నిర్మించిన ఎల్ అండ్ టీకి నాటి ప్రభు త్వం వివిధ ప్రాంతాల్లో 269 ఎకరాలిచ్చింది. డిపోల నిర్మాణానికి 212 ఎకరాలు వాడుకున్నారు. రవాణా ఆధారిత అభివృద్ధి(టీఓడీ) కోసం మిగిలిన 57 ఎకరాలు ఇచ్చారు. వాటిని వాణిజ్య అవసరాలకు వాడుకొని, వచ్చిన ఆదాయాన్ని మెట్రో నిర్వహణకు ఉపయోగించాలని సూచించారు. ఎల్ అండ్ టీ 18 ఎకరాలే ఇప్పటి దాకా వినియోగించుకుంది. మాదాపూర్, ఎర్రమంజిల్, పంజాగుట్ట, మూసారంబాగ్ దగ్గర మాల్స్ కట్టింది. మిగిలిన 39 ఎకరాలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఆ భూములు ఎక్కడున్నాయి? వాటి విలువ ఎంత? వాటిలో ఏ వాణిజ్య వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉంటుంది ? తదితర అంశాలపై అధ్యయనం చేస్తోంది. మెట్రోతో ఒప్పందంలో భాగంగా ఇప్పటికే సదరు సంస్థకు ఎంత మొత్తం ఇవ్వాలనే దానిపై స్పష్టత వచ్చింది. ఈ నేపథ్యంలో సంస్థ ఆస్తుల విలువను మదింపు చేస్తున్నారు. నెలాఖరులోగా మదింపు పూర్తి కావాలని, నివేదిక ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ఉత్తుత్తి ధాన్యం.. 1.86 కోట్ల కుంభకోణం!

సాగు చేయకుండానే ధాన్యం పండించినట్లు.. కొనుగోలు కేంద్రంలో విక్రయించినట్లు రికార్డులు

- 12 మంది రైతుల పేరుతో దొంగ లెక్కలు
- అధికారులతో కలిసి మిల్లర్ భారీ మోసం
- హనుమకొండ జిల్లాలో ఘటన
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెల్లడి
- 21 మందిపై పోలీసు కేసు నమోదు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆ రైతులు పంట సాగు చేసింది లేదు.. ధాన్యం పండించింది లేదు. కొనుగోలు కేంద్రానికి తెచ్చింది లేదు.. విక్రయించిందీ లేదు. కానీ, వారు పంట పండిచినట్లు, ధాన్యం తెచ్చి విక్రయించినట్లు రికార్డుల్లో నమోదైంది. ఆ ధాన్యానికి సంబంధించిన డబ్బు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. 12 మంది రైతులు ఏకంగా 278 ఎకరాల భూమిలో సాగు చేసినట్లు, 8,049 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించినట్లు పేర్కొంటూ వారి ఖాతాల్లో రూ.1,86,63,088 జమ అయ్యాయి. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో ఈ భారీ కుంభకోణం చోటుచేసుకుంది. దీనిపై ఇటీవల పత్రికల్లో వార్తలు రావడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ జరిపారు. ఓ రైస్‌మిల్లర్ ప్రధాన సూత్రధారిగా ఉండి ఈ కుంభకోణానికి పాల్పడినట్లు తేల్చారు. శనివారం చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శశిధర్ రాజు హనుమకొండ కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి కమలాపూర్‌లోని సాంబశివ మినీ మోడ్రన్ రైస్‌మిల్ యజమాని బెజ్జంకి శ్రీనివాస్.. పత్తిపాక గ్రామానికి చెందిన బండ లలిత, పలువురు వ్యవసాయ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి ఈ మోసానికి పాల్పడ్డారని తెలిపారు.

మోసానికి పాల్పడ్డారిలా..

తొలుత రైతులుగా కొంత భూమి కలిగిన 12 మందిని బెజ్జంకి శ్రీనివాస్ ఎంపిక చేసుకున్నాడు. వారికి మరింత భూమి ఉన్నట్లు చూపించాడు. వారు పండించినట్లుగా పేర్కొంటూ శాయంపేట, కాట్రపల్లిలో నిర్వహిస్తున్న ఐకేపీ సెంటర్లకు 8,049 క్వింటాళ్ల ధాన్యాన్ని సరఫరా చేసినట్లు రికార్డు చేశాడు. ఇందుకోసం వ్యవసాయ అధికారులతో కుమ్మక్కయి.. అధికారిక ఆన్‌లైన్ ధాన్యం సేకరణ నిర్వహణ వ్యవస్థ ఫోల్డర్‌ను ఉపయోగించాడు. నకిలీ లారీ చిట్టీలు, టోకెన్ పుస్తకాలు సృష్టించాడు. అంతా పూర్తయి 12 మంది ఖాతాల్లో రూ.1,86,63,088 జమ అయ్యేలా చేశాడు. ఈ రైతుల్లో వడ్లూరి నవతకు 34 ఎకరాలు చూపించి రూ.22,44,616, వడ్లూరి కల్యాణ్‌కు 15 ఎకరాలు అదనంగా కలిపి రూ.10,26,160, వడ్లూరి శ్రీచరణ్‌కు 33 ఎకరాలకు రూ.21,74,088, బెజ్జంకి శ్రీనివాస్ భార్య శోభారాణికి 33 ఎకరాలకు రూ.7,71,168, అతని కుమారుడు బెజ్జంకి చందుకు 22 ఎకరాల రూ.14,73,664, బెజ్జంకి శివకుమార్‌కు 33 ఎకరాలకు రూ.21,25,120, వడ్లూరి రాజేందర్‌కు 17ఎకరాల రూ.11,52,576, బెజ్జంకి పున్నంచారికి 26 ఎకరాలకు రూ.18,62,496, వేమునూరి శ్రీనవ్యకు 34 ఎకరాలకు రూ.22,65,968, వేమునూరి శ్రీనివాస్‌చారికి 11ఎకరాల రూ.7,57,248, వేమునూరి ఉదయ లక్ష్మికి 16ఎకరాలకు రూ.10,67,200, చిర్లనేహ సింధుకు 26ఎకరాల రూ.17,42,784 చొప్పున అక్రమంగా వీరి అకౌంట్లలోకి జమ చేయించినట్లు శశిధర్‌రాజు వివరించారు. నకిలీ రైతుల ఖాతాల్లో జమ అయిన నిధుల తక్షణమే రికవరీ చేస్తామన్నారు. ప్రధాన సూత్రధారి బెజ్జంకి శ్రీనివాస్, ప్రధాన పాత్రధారి బండ లలితతో పాటు 12 మంది నకిలీ రైతులు, శాయంపేట మండల ఏవో కె.గంగా జమున, క్లస్టర్ ఏఈవోలు బి.అర్చన, ఎం.సుప్రియ, పీపీ సెంటర్ ఇన్‌చార్జులు హైమావతి, అనిత, ప్రైవేట్ ల్యాబ్ ఆపరేటర్ వాంకుడోతు చరణ్, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ రాజేశ్వర్‌రావుపై శాయంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

లోకం తీరు

సమాచార హక్కు అమల్లోకి వచ్చి 20 ఏళ్లు ☰



నిబంధనల మేరకే కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ

జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (475)

నల్లగొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్ బోర్డు నియమ నిబంధనల మేరకే కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ జరిగిందని, రెగ్యులరైజేషన్‌లో తప్పుడు విధానాలు అవలంబించలేదని తెలంగాణ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (475) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 2014 ఎన్నికలప్పుడు రాష్ట్రం లో అన్ని రాజకీయ పార్టీలు కాంట్రాక్ట్ ఉద్యోగులు, లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తామనే హామీని తమ మేనిఫెస్టోల్లో పేర్కొన్నాయని, 2023లో బీఆర్ఎస్ ప్రభు త్వం కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరి స్తూ ఉత్తర్వులిచ్చిందని, తామెవరికీ డబ్బులిచ్చి ఉద్యోగాలు పొందలేదని తెలిపారు. రెగ్యులరైజ్‌కు అప్పటి ఇంట ర్ బోర్డు కమిషనర్ ఉన్నతవిద్యామండలి సూచన లు తీసుకున్నారన్నారు. జీవో నం16 ప్రకారం 2014 కు ముందు ఇతర రాష్ట్రాల్లో పీజీ చేసిన వారి సర్టిఫికెట్లు చెల్లుతాయన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఇష్టం లేని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ పొంది న వారెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

కూలి పని ఇస్తామని తీసుకెళ్లి హత్యాచారం

- మెదక్‌లో ఓ మహిళపై కిరాతకం
- నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి దాడి
- వివస్త్రను చేసి స్తంభానికి కట్టేసిన వైనం
- చికిత్స కోసం తరలిస్తుండగా మృతి

మెదక్/కొల్చారం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో ఓ మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు కిరాతకానికి తెగబడ్డారు. పొట్టకూటికి కూలి పని వెతుక్కుంటున్న మహిళకు పని ఇస్తామని చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెను చిత్రహింసలు పెట్టి తీవ్రంగా గాయపరిచారు. అత్యాచారానికి పాల్పడడమే కాక.. వివస్త్రను చేసి అక్కడి ఓ చిన్న స్తంభానికి కట్టేసి పరారయ్యారు. రాత్రంతా ఆ నిర్మానుష్య ప్రదేశంలోనే ఉన్న ఆ మహిళను ఉదయాన్నే అటుగా వచ్చిన వారు గుర్తించడంతో ఈ దారుణం వెలుగు చూసింది. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిపాలైన ఆమె చికిత్స పొందుతూ మరణించింది. బాధితురాలి కుటుంబసభ్యుల కథనం ప్రకారం జానకంపల్లి పంచాయతీలోని ఓ తండా వాసి మహిళ కూలి పనికి శుక్రవారం ఉదయం మెదక్ వచ్చింది. అక్కడి ఓ అడ్డాలో పని కోసం ఎదురు చూస్తుండగా పని ఉందని నమ్మబలికిన గుర్తు తెలియని వ్యక్తులు.. ఆమెను కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారు ఏడుపాయల వెళ్లే రోడ్డులోని ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి.. అక్కడ అత్యాచారం, ఆపై హత్యాయత్నం చేసి.. చివరకు వివస్త్రను చేసి ఆమె 2 చేతులను ఓ స్తంభానికి కట్టేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం అటు వచ్చిన వారు అపస్మారక స్థితిలో ఉన్న మహిళను చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బాధితురాలిని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి.. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు శనివారం రాత్రి ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణం విడిచింది.

రాజ్యాంగం పవిత్ర గ్రంథమేమి కాదు

- అయితే 106 సార్లు సవరణ ఎందుకు చేస్తారు
- సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం పవిత్ర గ్రంథమేమి కాదని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ పవిత్ర గ్రంథమైతే 106సార్లు ఎందుకు సవరిస్తారన్నారు. పవిత్ర గ్రంథాలుగా భావించే రామాయణం, భారతం, భగవద్గీత వంటి గ్రంథాలకు సవరణలు జరగలేదన్నారు. ఈమేరకు శనివారం ఫిలింనగర్ క్లబ్‌లో పాత్రికేయులతో, మేధావులతో "హిందువులకు సమాన హక్కుల నిరాకరణ, రాజ్యాంగ వివక్ష" అనే అంశంపై చర్చిస్తూ.. ఎక్కడైతే హిందువులు మెజారిటీగా ఉన్నారో అక్కడ అన్య మతస్థులు కూడా మనుగడ సాగించగలుగుతున్నారని, కానీ ఎక్కడైతే హిందువులు మైనారిటీలుగా ఉన్నారో అక్కడ వారి జీవనమే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు కొన్ని ఉదాహరణలు చెబుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కశ్మీర్‌లో 21 శాతంగా ఉన్న హిందువులు నేడు ఒక్క శాతం కూడా లేరన్నారు. లౌకికవాదం గురించి వివరించే రాజ్యాంగ వ్యవస్థ కశ్మీర్‌లో హిందువులపై జరిగిన ఈ మారణహోమాన్ని ఎందుకు ఆపలేకపోయిందని ప్రశ్నించారు. హిందువులకు విద్యా హక్కులోను వివక్ష ఉందని చెప్పారు. ప్రపంచంలోని ప్రజాస్వామ్యయుత రాజ్యాంగాల్లో ఎక్కడా మైనారిటీ, మెజారిటీ అనే భావన లేదన్నారు. భారత దేశానికి కూడా అధికార మతం లేనపుడు ఈ ప్రతిపాదన ఎందుకుందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 28, 29, 30లను పరిశీలిస్తే హిందువులకు విద్య ప్రాథమిక హక్కుగా లేదని, కేవలం పౌర హక్కుగానే ఉందన్నారు. క్రైస్తవులకు, ముస్లింలకు మాత్రమే విద్య ప్రాథమిక హక్కుగా కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. అందుకే వారి విద్యా హక్కుల పరిరక్షణకు ప్రత్యేకమైన చట్టాలు, కమిషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ కె.అరవింద రావు పాల్గొన్నారు.

ధనధాన్య కృషి యోజనలో రాష్ట్రం నుంచి 4 జిల్లాలకు చోటు

- నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూలు, జనగామ ఎంపిక

జనగామ, గద్వాల/నారాయణపేట రూరల్/నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకానికి రాష్ట్రంలోని నాలుగు జిల్లాలు ఎంపికయ్యాయి. వీటిలో జనగామ జిల్లాతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూలు జిల్లాలు ఉన్నాయి. ఈ పథకాన్ని ప్రధాని మోదీ శనివారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంపికైన నాలుగు జిల్లాలకు ఏడాదికి రూ.960 కోట్ల నిధులు వస్తాయని తెలిపారు. పథకంపై 15 రోజులకోసారి సమీక్ష ఉంటుందన్నారు. నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ తదితర అధికారులు హాజరయ్యారు. నాగర్‌కర్నూలు జిల్లా పాలెంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. జనగామలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరో 1000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకోనుంది. ఈమేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఇండెంటు పెట్టింది. 26 ఏళ్ల కాల పరిమితితో ఈ రుణాన్ని సేకరించనుంది. ఈ నెల 14న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా రుణాన్ని తీసుకోనుంది

బీజేపీ ఓట్‌చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

» 42% రిజర్వేషన్లతోనే త్వరలోనే స్థానిక ఎన్నికలు

» రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్లను చోరీ చేసి కేంద్రంలో అధికారంలోకి వస్తున్న బీజేపీ ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఉద్యమంలా సంతకాల సేకరణ చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. దేశ ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ఓట్‌చోరీకి వ్యతిరేకంగా సంతకాల ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారని చెప్పారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఆదివారం ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం వరకు ఒకేరోజు 350 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓట్ చోరీపై సంతకాలు సేకరించాలని శనివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో తుమ్మల అన్నారు. ఒకేరోజు చేపట్టే ఈ కార్యక్రమం రాష్ట్ర కాంగ్రెస్‌కు ఆదర్శంగా నిలవాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రాజ్యాంగ విరుద్ధంగా వికృత చేష్టలు సాగిస్తోందని, రాజ్యాంగబద్ధ సంస్థలను తన చేతుల్లోకి తీసుకుని ఓట్లను తొలగించడంతో అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. మరోవైపు, రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు రేవంత్ రెడ్డి సర్కారు ఎంతో కృషి చేసిందన్న మంత్రి తుమ్మల.. ఎదురైన ఆటంకాల తొలగింపునకు సుప్రీంకోర్టుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 42% రిజర్వేషన్లతోనే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు.

పాలిచ్చే గేదె వంటి ప్రజా ప్రభుత్వంతోనే సంక్షేమం

» బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో దోచుకుని దాచుకోవడమే

» రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

నేలకొండపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలిచ్చే పాడి గేదె వంటి ప్రజా ప్రభుత్వంతోనే సంక్షేమమని, తమ ప్రభుత్వాన్ని దీవించాలని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలను కోరారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం, పైనంపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించిన మంత్రి.. బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటైన 21 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామన్నారు. తొమ్మిది నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసినట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో దోచుకోవడం.. దాచుకోవడం తప్ప ఏమీ చేయలేదని పొంగులేటి ఎద్దేవా చేశారు. అనంతరం గ్రూపు-2లో ఎక్సైజ్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించిన నేలకొండపల్లి వాసి దగ్గుల నాగ అమృతను మంత్రి పొంగులేటి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఉసిరికాయల శ్రీనివాసరావు, యడవల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మత బోధనలు చేసిన పాఠశాలపై చర్యలకు డిమాండ్

» సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ లేఖ

» కేంద్ర మానవ వనరుల కార్యదర్శికి కూడా

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు క్రైస్తవ మత బోధనల ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని 'ఫుస్కోస్ స్కూల్' అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డికి, కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శికి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శికి ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా శనివారం లేఖలు పంపారు. వర్ధన్నపేటలోని ఫుస్కోస్ స్కూల్‌లోని ఓ తరగతి గదిలో చర్చి ఫాదర్ విద్యార్థులకు క్రైస్తవ మత బోధనలు చేస్తుండగా తీసిన వీడియో బయటకి రావడంతో తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కుందూరు మహేందర్ రెడ్డి వర్ధన్నపేటలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఫుస్కోస్ స్కూల్‌లో పసి మనసుల్లో మతాన్ని నూరి పోస్తారా ? అంటూ ధ్వజమెత్తారు. విద్యార్థులపై క్రైస్తవ మత సిద్ధాంతాలను బలవంతంగా రుద్దుతున్న విద్యా సంస్థలను గుర్తించి వాటి గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రితోపాటు విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఫుస్కోస్ స్కూల్‌పై అధికారులు చర్యలు తీసుకోకుంటే బీజేపీ తరఫున పోరాటాన్ని ఉధృతం చేస్తామని మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, ఫుస్కోస్ స్కూల్‌లో జరిగిన మత బోధనలో అంశంపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీసినట్లుగా తెలిసింది. ఇక, రెండో శనివారం, ఆదివారం రావడంతో ఫుస్కోస్ స్కూల్ ఘటనపై విద్యాశాఖకు సోమవారం పూర్తి నివేదిక అందే అవకాశం ఉంది. దీనిపై వరంగల్ జిల్లా డీఈవో రంగయ్య నాయుడును వివరణ కోరగా ఎంఈవో శ్రీధర్ నివేదిక అందించారని, హైస్కూల్స్‌పై ఆర్‌జేడీ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పాఠశాల ఆవరణలో మత బోధనలు జరిగినట్లు ఎంఈవో విచారణలో తేలిందని, దానిపై ఉన్నతాధికారులకు నివేదించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రాణహిత-చేవెళ్లకు కొత్త డీపీఆర్

నెలాఖరుకల్లా సిద్ధం చేయాలి: మంత్రి ఉత్తమ్

సాగునీటి ప్రాజెక్టుల భూముల్లో సోలార్ ప్లాంట్లు

హైదరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ కోసం సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీలో వేగం పెంచాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ నెలాఖరుకల్లా డీపీఆర్‌కు తుది రూపు ఇవ్వాలని నిర్దేశించారు. తుమ్మిడిహట్టి వద్ద 150మీటర్లతో బ్యారేజీ నిర్మాణం కోసం కసరత్తు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. శనివారం సచివాలయంలో ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో నిర్మించిన ప్రధాన కాలువ, ఇతర నిర్మాణాలు చాలావరకు చెక్కుచెదరకుండా ఉన్నాయని, స్వల్ప మరమ్మతులు చేసి ఉపయోగించుకోవచ్చని అధికారులు మంత్రికి నివేదించారు. 71.5 కి.మీ. విస్తరించి ఉన్న ప్రధాన కాలువ నెట్‌వర్క్ ఉపయోగించదగిన స్థితిలో ఉందని, రెండు ప్రధాన అక్విడక్ట్‌లు 70 శాతం పూర్తయ్యాయని నివేదించారు. సుందిళ్ల బ్యారేజీ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకి నీళ్లు లిఫ్ట్ చేసుకోవచ్చని మంత్రికి తెలియజేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పాత ప్రతిపాదనల ప్రకారం తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తరలించి చేవెళ్లకు తీసుకురావాల్సి ఉంది. మంచిర్యాల జిల్లా మైలారం గ్రామం వద్ద ఉన్న 71.5 కి.మీ. పాయింట్ వరకు నీళ్లు గ్రావిటీతో రానుండగా, అక్కడి నుంచి ఎల్లంపల్లికి తరలించడానికి రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు సూచించారు. పాత ప్రతిపాదనల ప్రకారం మైలారం వద్ద ఒక లిఫ్ట్ నిర్మించి 50 కి.మీ. దూరంలోని ఎల్లంపల్లి జలాశయానికి తరలించవచ్చని వివరించారు. లేకుంటే మైలారం నుంచి 35 కి.మీ. దూరంలోని సుందిళ్ల బ్యారేజీకి గ్రావిటీతో నీటిని తీసుకెళ్లవచ్చన్నారు. రెండో ప్రత్యామ్నాయం కింద సొరంగంతో పాటు కాల్వ నిర్మించాల్సి ఉంటుందని, దాంతో నిర్మాణ,నిర్వహణ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. రెండు ప్రత్యామ్నాయాలపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పిస్తే నెలాఖరులోగా తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వచ్చే వారం మళ్లీ సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన సాగు నీటి ప్రాజెక్టుల భూములను గుర్తించాలని ఆదేశించారు.

బనకచర్లను అడ్డుకుంటాం

ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంపునూ ఒప్పుకోం.. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారే ఉన్నా రాజీపడబోం

» కృష్ణా, గోదావరి జలాల్లో 70శాతం వాటా దక్కాల్సిందే

» 23వేల కోట్లతో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు

» హరీశ్‌రావు అసత్య ప్రచారాలను మానుకోవాలి: ఉత్తమ్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

హనుమకొండ సిటీ/ యాదాద్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని, ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్ర జల వనరులు, ప్రాజెక్టుల విషయమ్మీద కాంగ్రెస్ సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు అవాస్తవాలుగా కొట్టిపారేశారు. జల వనరుల్లో తెలంగాణ వాటాను దక్కించుకోవడంలో గానీ, సంరక్షణలో గానీ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంపు ప్రతిపాదనలనూ సహించేది లేదని, కర్ణాటకలో తమ పార్టీనే అధికారంలో ఉన్నా ఈ విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని.. తమకు రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అని స్పష్టం చేశారు. నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డికి ఇటీవల మాతృవియోగం కలగడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు ఉత్తమ్ శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చారు. యాదాద్రి జిల్లా కలెక్టరేట్‌లో పౌరసరఫరాలు, నీటిపారుదలశాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. బనకచర్ల విషయమ్మీద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తన అభ్యంతరాలను కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు లిఖితపూర్వకంగా తెలియజేసిందని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపును అంగీకరిస్తూ లిఖితపూర్వకంగా ఒప్పందం చేసుకుంది అప్పటి బీఆర్‌ఎస్ సర్కారేనని చెప్పారు. సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతుల సాధనలో ఉన్నట్లు చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు 65 టీఎంసీల నీటి కేటాయింపు ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. వాస్తవాలు కళ్లకు కట్టినట్లు ఉన్నా.. హరీశ్‌రావు రాజకీయ స్వార్థంతో కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. అసత్య ప్రచారాలను హరీశ్ మానుకోవాలని.. లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కృష్ణా, గోదావరి జలాశయాల నుంచి తెలంగాణకు దక్కాల్సిన 70 శాతం నీటి వాటను దక్కించుకుంటామని, ఈ మేరకు న్యాయబద్ధంగా పోరాడుతున్నట్లు చెప్పారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒకేఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే.. అదీ కుప్పకూలిందని.. మేడిగడ్డ కూలడం, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు బీటలు వారి నిరుపయోగంగా మారాయని విమర్శించారు. అయినా, ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో 148.5 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రూ.23వేల కోట్లు వెచ్చించి 80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని చెప్పారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభించినట్లు చెప్పారు. యాదాద్రి జిల్లాలోని బస్వాపూర్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం పునరావాసం మంజూరుకు కావాల్సిన నిధులపైనా సమీక్షించారు. గంధమల్ల రిజర్వాయర్, బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

నిమ్మకు నీరెత్తినట్టుగా సీఎం రేవంత్ తీరు: హరీశ్

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణకు పెనుప్రమాదంగా మారుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ పురోగతిలో ఉందని, పీఎఫ్ఆర్ టెక్నో ఎకనామికల్ అప్రైజల్ విషయమై గత నెలలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారని వెల్లడించారు. 20 రోజులైనా ముఖ్యమంత్రి వ్యతిరేకించకుండా ఏపీకి సహకరిస్తున్నారని విమర్శించారు. కమీషన్ల కోసం రాష్ట్రాన్ని సీఎం తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఏపీ గోదావరి నీళ్లు తీసుకెళ్తే తాము కృష్ణాలో 112 టీఎంసీల నీటిని వాడుకుంటామని కర్ణాటక, వరద జలాల ఆధారంగా తామూ ప్రాజెక్టులు కట్టి 74టీఎంసీలు వినియోగించుకుంటామని మహారాష్ట్ర కేంద్రానికి లేఖలు రాశాయని వెల్లడించారు. బనకచర్ల డీపీఆర్ తయారీ కోసం ఏపీ ప్రభుత్వం రూ.9కోట్లతో టెండర్లు పిలిచిందని తెలిపారు. ఇంత జరుగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని మండిపడ్డారు. తక్షణమే అప్రైజల్, డీపీఆర్ తయారీని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, సుప్రీం కోర్టులో పోరాడి రాష్ట్ర హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

పైన టమాటా ట్రేలు.. కింద గోవులు

» హైదరాబాద్‌కు అక్రమంగా తరలించే యత్నం

» భద్రాచలం వద్ద పట్టుకున్న పోలీసులు

భద్రాచలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వాహనంలో టమాటా ట్రేల కింద గోవులను అక్రమంగా తరలిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు అక్రమంగా తరలిస్తుండగా వాహనంలో 30 గోవులున్నట్లు పోలీసులు తనిఖీల్లో గుర్తించారు. వాటిలో ఒక గోవు మృతి చెందగా, మిగిలిన 29 ఆవులను పాల్వంచలోని గోశాలకు తరలించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశామని భద్రాచలం పోలీసులు తెలిపారు.

ఇంటర్ బోర్డును సందర్శించిన మంత్రి లక్ష్మణ్

» విద్యార్థులను డిజిటల్ విద్యలో ప్రోత్సహిస్తామని వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకులాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామని, డిజిటల్ విద్యలో ప్రోత్సహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయన ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని సందర్శించి అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలించారు. ఇంటర్ బోర్డు ఇప్పటికే డిజిటల్ విద్యలో అగ్రగామిగా నిలుస్తోందని ప్రశంసించారు. అన్ని కాలేజీల్లో విద్యార్థుల హాజరు, విద్యా సామర్థ్యం తెలుసుకోవడంతో పాటు కాలేజీల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ దోహదపడుతుందన్నారు. ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పూర్తిగా సీసీటీవీలతో అనుసంధానమైనట్టు తెలిపారు. పర్యవేక్షణను పెంచడానికి, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవడానికి, జిల్లా వ్యాప్తంగా కళాశాలలను పర్యవేక్షించేందుకు పది మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు.

పీజీ వైద్య ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని కన్వీనర్, యాజమాన్య కోటా పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును కాళోజీ హెల్త్ యూనివర్సిటీ పొడిగించింది. ఈ నెల 11తో ముగిసిన తుది గడువును 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. నీట్ పీజీ 2025లో కటాఫ్ స్కోర్ సాధించిన అభ్యర్థులు మేనేజ్‌మెంట్ కోటా, ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరింది.

ఇద్దరు రైతుల దుర్మరణం

» ఒకరు అప్పుల బాధతో ఆత్మహత్య

» మరొకరు కరెంటు షాక్‌తో మృతి

» కరీంనగర్, జనగామ జిల్లాల్లో విషాద ఘటనలు



పూదరి శ్రీనివాస్



కోట వాసు (ఫైల్)

సైదాపూర్/స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న విషాద సంఘటనల్లో ఇద్దరు రైతులు మృతిచెందారు. ఒకరు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, మరొకరు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి దుర్మరణం పాలయ్యారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్ (40) తనకున్న మూడెకరాలతో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. రెండు మూడేళ్లుగా వేసిన పత్తి, మక్క, వరి పంటల్లో సరైన దిగుబడులు రాకపోవడంతో రూ.10 లక్షల అప్పు అయ్యింది. అప్పుల బాధ తట్టుకోలేక శ్రీనివాస్ ఈనెల 9న తన వ్యవసాయ బావివద్ద పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి శ్రీనివాస్ మృతిచెందాడు. మరో ఘటనలో, జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు కోట వాసు (42) తనకున్న రెండెకరాలు సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే పొలంలో విద్యుత్ పోల్ నుంచి తెగిపడిన తీగలకు గమనించకుండా తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సమీప వ్యవసాయ బావి వద్దకు వచ్చిన ఓ మహిళా రైతు వాసు మృతదేహాన్ని గుర్తించింది. విద్యుత్ వైర్లపై భారీ చెట్టుకొమ్మలు పడడంతోనే వైర్లు తెగిపడినట్లు తెలుస్తోంది. వాసుకు భార్య కవిత, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

విశాఖ టు మహారాష్ట్ర వయా అశ్వారావుపేట

» రూ.1.10 కోట్ల విలువైన2.22 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

» ఇద్దరి అరెస్ట్.. మరో నలుగురి పరారీ

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని విశాఖ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మీదుగా మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాలకు జోరుగా రవాణా చేస్తున్నారు. తాజాగా అశ్వారావుపేట పోలీసులు శనివారం విశాఖ పట్నం నుంచి మహారాష్ట్రకు కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు ఆ వివరాలు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అశ్వారావుపేటలో శనివారం ఉదయం ఎస్ఐ రామ్మూర్తి, కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జంగారెడ్డిగూడెం రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఓ కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి రవాణా విషయం బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన ఉంగరాల సరిన్‌కుమార్, బెల్లంపల్లికి చెందిన బాబర్‌ఖాన్ విశాఖపట్నానికి చెందిన పంగి శ్రీను అనే వ్యక్తి వద్ద రాజమండ్రిలో గంజాయిని కొనుగోలు చేశారు. 111 ప్యాకెట్లలోని 2.22 క్వింటాళ్ల ఆ గంజాయిని మహారాష్ట్రకు చెందిన ఇంతియాజ్ అనే వ్యక్తికి అధిక ధరకు విక్రయించేందుకు కారులో తీసుకెళుతున్నారు. ఆ వాహనానికి సరిన్ కుమార్ స్నేహితులైన హైదరాబాద్‌కు చెందిన ఎండీ ఫిరోజ్, చిందిన సంతోష్ అనే వ్యక్తులు పైలెట్లుగా ఉన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.10 కోట్లు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసి సరిన్ కుమార్, బాబర్‌ఖాన్‌ను అరెస్ట్ చేశామని మిగిలిన నలుగురు పంగి శ్రీను, ఫిరోజ్, సంతోశ్, ఇంతియాజ్ పరారీలో ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు, రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ యయాతిరాజు, సిబ్బంది ఉన్నారు.

సీఎం సొంత మండల రైతులందరికీ సోలార్ పంపుసెట్లు

» 7,500 బోరుబావులకు ఏర్పాటు

» జీవో జారీ చేసిన ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలం వంగూరులోని రైతులందరికీ పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ పంపుసెట్లను పెట్టడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మండలంలో 7,500 బోరుబావులకు సోలార్ పంపుసెట్లను ప్రయోగాత్మకంగా పెట్టనున్నారు. ఇందుకు రూ.258 కోట్లు ఖర్చవుతుంది. ఈ పంపులను పీఎం కుసుమ్ పథకం కింద పెట్టినా వీటికి అయ్యే పూర్తి వ్యయం దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్) భరించనుంది. ఇందుకు నిధులను రుణం రూపంలో సమీకరించుకొని.. వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో రుణం కట్టుకోవాలని నిర్దేశించింది. ప్రభుత్వంపై ఎటువంటి అదనపు భారం వేయరాదని నిర్దేశించింది. ఈమేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం జీవో జారీ చేశారు. ఇక సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లి నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలంలోనే ఉంది. ఇప్పటికే కొండారెడ్డిపల్లిలో ప్రతీ ఇంటికి సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు పెట్టారు. దాంతో దేశంలోని సౌర విద్యుత్ ఆధారిత గ్రామాల్లో ఒకటిగా కొండారెడ్డిపల్లి గుర్తింపు పొందిన విషయం విదితమే.

149 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు

డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంచాలకుడు డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ (సీజీఆర్)తో కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా అన్ని కాలేజీలను ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌లుగా మారుస్తామని అధికారులు తెలిపారు. పర్యావరణ చైతన్యంపై విద్యార్థులకు అవగాహన పెంచడం, వర్షం నీటి సంరక్షణ, కంపోస్టింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

'బనకచర్ల'పై ఏకాభిప్రాయ సాధన!

» తెలంగాణ సీఎంకు పాటిల్ లేఖ

సహకరించాలని కోరిన కేంద్ర మంత్రి

అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు గేమ్ చేంజర్‌గా భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ గత నెల 21న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రాజెక్టు విషయంలో సహకరించాలని ఆయనను కోరినట్టు తెలిసింది. ఈ లేఖకు సంబంధించిన సమాచారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇదిలావుంటే.. ఈ ఏడాది జూన్‌లో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టును రాష్ట్ర జల వనరులశాఖ.. కేంద్ర జల సంఘానికి పంపింది. అయితే, ఇతర రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అసలు వరద జలాల లభ్యతపై గణాంకాలు ఇవ్వాలని కేంద్రం కోరింది. ఈ గణాంకాలను కూడా సిద్ధం చేసిన రాష్ట్ర జల వనరుల శాఖ.. సోమవారం తర్వాత కేంద్రానికి నివేదిక పంపేందుకు సిద్ధమవుతోంది. అదేవిధంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కూడా త్వరలోనే కేంద్రానికి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. డీపీఆర్ తయారు చేసేందుకు ఈ నెల 5న టెండర్లు పిలిచింది. టెండరు దక్కించుకున్న సంస్థ ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టును ఆధారం చేసుకుని.. ప్రజాభిప్రాయ సేకరణతో సహా ప్రాజెక్టు వ్యయాన్ని సాంకేతికంగా అంచనా వేస్తుంది. ఈ నివేదికను సాధ్యమైనంత త్వరగా కేంద్రానికి పంపాలని రాష్ట్రం నిర్ణయించింది. ఇదిలావుంటే, వివాదాల పరిష్కారానికి ఇబ్రహీంపట్నం ఎగువన దాములూరు వద్ద అక్విడెక్టు నిర్మించాలని నిపుణులు సూచిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో 190 మందికిపైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

» 110 మంది కొనసాగింపునకే అనుమతి

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆర్థిక శాఖ తొలగించింది. ఈ శాఖలో నెలకు రూ.15,600-19,500 వేతనాలు పొందే చిరుద్యోగుల్లో సగానికిపైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖలో సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీల కార్యాలయాల్లో దాదాపు 300 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏళ్లుగా పనిచేస్తున్నారు. వీరిని ఏటా పొడిగింపునకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి. శాఖలో పెరిగిన పని భారానికి అనుగుణంగా నియామకాలు లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఆధారంగా మారారు. దీంతో వీరందరినీ కొనసాగించాలని రిజిస్ట్రేషన్ల శాఖ పదేపదే విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా 110 మందిని మాత్రమే కొనసాగిస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో జారీ చేశారు. దీంతో 190 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డున పడ్డట్లయింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు
▪ఆర్కే RK

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

వైద్యానికి శస్త్రచికిత్స!

ప్రజలందరికీ ఉచిత వైద్య విద్య, వైద్యం అనే విధానాన్ని అమలుచేసే పరిస్థితిలో మన ప్రభుత్వాలు లేవు. అలాగని పేద ప్రజలను గాలికి వదిలేయలేం కదా? ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా ఏదో ఒక విధానాన్ని రూపొందించుకోవాలి కదా? దేశంతో పాటు తెలుగునాట కూడా వైద్యుల కొరత ఉంది. ఈ కొరతను అధిగమించాలంటే మంచి వైద్యులను తయారుచేసే వైద్య కళాశాలలను ఏర్పాటు చేయవలసిందే. అయితే అవసరం మేరకు వైద్య కళాశాలలు నెలకొల్పి వాటిని నిర్వహించే స్థోమత ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు లేదు. ఈ కారణంగానే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వపరంగా 17 కళాశాలలను ఏర్పాటు చేయడానికి అనుమతులు పొందినా ఆయా కళాశాలల నిర్మాణాలను కూడా పూర్తిచేయలేకపోయారు. కొన్ని కళాశాలల భవనాల నిర్మాణం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. ఒకవేళ నిర్మాణాలు పూర్తయినా వాటి నిర్వహణ భారాన్ని ప్రభుత్వాలు భరించగలవా?

కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలల వ్యవహారాన్ని ప్రతిపక్షం అందిపుచ్చుకుంది. తాము ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా హడావిడి చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో కొంత తొందరపాటు ప్రదర్శించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు కారణాలను సహేతుకంగా వివరించకుండా హడావిడిగా నిర్ణయం తీసుకోవడంతో ప్రతిపక్షం చేతికి అస్త్రం లభించింది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం సరైనదా? కాదా? అన్నది ఇప్పుడు పరిశీలిద్దాం. వైద్య కళాశాలల అవసరం ఏ మేరకు ఉంది? ఇబ్బడిముబ్బడిగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకుంటూ పోతే ఫ్యాకల్టీ పరిస్థితి ఏమిటి? వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయమా? సంక్షేమం పేరిట బడ్జెట్‌లో సింహభాగం ఖర్చు చేస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి, నిర్వహించడం సాధ్యమా? ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు కళాశాలలు ఉన్నప్పటికీ ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల్లోనే చేరడానికి విద్యార్థులు ఎందుకు పోటీ పడుతున్నారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఎందుకు ఆకర్షితులవుతున్నారన్నది కూడా కీలక ప్రశ్నగా ఉంది. కాలమాన పరిస్థితులను బట్టి ఆలోచనలు, విధానాలు మారుతుంటాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగమే దిక్కుగా ఉండేది. అందుబాటులో ఉన్న పరిమిత వనరులతోనే దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పలు ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశారు. విద్యాసంస్థలను నెలకొల్పారు. ప్రభుత్వం వద్ద ఉన్న నిధులతోనే నీటి ప్రాజెక్టులను కూడా దశలవారీగా నిర్మించారు. పంచవర్ష ప్రణాళికలను రచించుకొని అమలు చేశారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ కూడా దాదాపుగా ఇవే విధానాలను కొనసాగిస్తూ సంక్షేమంపై కూడా దృష్టి పెట్టారు. రాజభరణాలు రద్దు చేయడంతో పాటు ప్రైవేటు రంగంలో ఉన్న బ్యాంకులను జాతీయం చేశారు. ఇందిరాగాంధీ తదనంతరం ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మారాయి. రక్షిత ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ రంగం అన్న వాదనకు కాలం చెల్లింది. పోటీతత్వం పెరగడంతో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు బ్యాంకులను జాతీయం చేయగా, ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహించే పరిస్థితి! అదే సమయంలో ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించింది. నెహ్రూ హయాంలో హైదరాబాద్‌లోని బాలానగర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ సంస్థ (ఐడీపీఎల్) ఏర్పాటైంది. ప్రస్తుత ఫార్మా దిగ్గజాలైన మురళి, డాక్టర్ అంజిరెడ్డి, పార్థసారధి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి వంటి వారందరూ అందులో పనిచేసినవారే. ఐడీపీఎల్‌లో తమ పరిస్థితి ఎదుగూబొదుగూ లేకుండా ఉండటంతో అందులో పనిచేసిన పలువురు బయటకు వచ్చి సొంతంగా ఫార్మా కంపెనీలను ప్రారంభించి ఇవాళ కుబేరుల జాబితాలో చేరారు. ఐడీపీఎల్ మాత్రం చాలాకాలం క్రితమే మూతపడింది. ప్రభుత్వ రంగం అని పట్టుకొని వేళాడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ సంస్థే నిదర్శనం. టెలికమ్యూనికేషన్ రంగాన్నే తీసుకుందాం. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండేది. అప్పుడు టెలిఫోన్ కనెక్షన్ కోసం నెలలు, సంవత్సరాలు వేచి చూడవలసి వచ్చేది. ఈ రంగంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించడంతో పరిస్థితిలో ఎంత వేగవంతమైన మార్పు వచ్చిందో చూస్తున్నాం. ఫోన్ కనెక్షన్ల కోసం మన చుట్టూ తిరుగుతున్నారు. ఏ రంగంలోనైనా మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు వ్యతిరేకత రావడం సహజం. మార్పు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తే అర్థం చేసుకుంటారు. టెలికమ్యూనికేషన్ రంగాన్ని ప్రైవేటుపరం చేసినప్పుడు కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ రంగంలో బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండాలని పట్టుబట్టాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నాటి మార్పును వ్యతిరేకించిన కమ్యూనిస్టు పార్టీలే దేశంలో బలహీనపడ్డాయి. ప్రైవేటు రంగంలోని టెలికాం కంపెనీలు దూసుకుపోతున్నాయి. ప్రజలకు కూడా సౌకర్యాలు మెరుగయ్యాయి. గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పడానికే ప్రజలు ఉత్సుకత చూపిస్తున్నారు. ఇవాళ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉంటాయి. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. అయినా ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడానికి కారణం ఏమిటి? ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించడం ప్రధాన కారణం. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడమే సరైన నిర్ణయం. మారిన పరిస్థితులలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసి వచ్చింది. ఇప్పటి పరిస్థితులకు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యమే సరైనది. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ పేరిట నెహ్రూ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను విక్రయిస్తున్నది. దీన్ని విమర్శించే వారు ఉన్నప్పటికీ ప్రజలు పట్టించుకోవడం లేదు. ఈ నిర్ణయం ప్రభావం రాజకీయాలపై కూడా కనబడటం లేదు.

కాలంతో మారాల్సిందే!

మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం శక్తికి మించి అప్పులు చేసి అయినా ఖర్చు చేయడానికి ప్రజలు కూడా సిద్ధపడుతున్నారు. ప్రపంచీకరణ కారణంగా పోటీతత్వం పెరిగింది. ప్రభుత్వ రంగమైనా, ప్రైవేటు రంగమైనా పోటీ పడక తప్పని పరిస్థితి. పోటీ పడలేని ప్రైవేటు సంస్థలు కూడా కనుమరుగవుతున్నాయి. బూజు పట్టిన సిద్ధాంతాలు, కాలం చెల్లిన విధానాలకు ఇప్పుడు చోటు లేదు. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడాల్సిందే. విశ్వవిద్యాలయాలనే తీసుకుందాం. ఒకప్పుడు ఉస్మానియా, ఆంధ్రా యూనివర్సిటీలకు ఎంతో పేరుండేది. కాలక్రమేణా అవి తమ ప్రతిష్ఠను కోల్పోయాయి. ప్రైవేటు రంగంలో ఏర్పాటైన యూనివర్సిటీలతో పోటీ పడలేక సతమతమవుతున్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో పలు ప్రైవేటు ఆస్పత్రులను విజయవంతంగా నిర్వహిస్తున్న డాక్టర్లు ఒకప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్‌లో పనిచేసినవారే. అక్కడ తమకు ఎదుగూబొదుగూ ఉండదని భావించి బయటకు వెళ్లిపోయి సొంత ఆస్పత్రులు ఏర్పాటుచేసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పేరొందిన పలు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఒకప్పుడు ప్రజలకు అవే దిక్కుగా ఉండేవి. ప్రజలకు కూడా వాటిపై విశ్వాసం ఉండేది. కాలక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతూ వచ్చింది. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు..' అని సినిమా పాటలు కూడా వచ్చాయి అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పేదలు కూడా తమ శక్తికి మించినదైనా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. అలా అని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంచి వైద్యులు ఉండటం లేదా? సౌకర్యాలు సరిగా లేవా? అంటే అదేమీ కాదు. సిబ్బందిలో జవాబుదారీతనం లోపించడమే ప్రధాన కారణం. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం ఎందుకు కల్పించలేకపోతున్నాయో ఆత్మపరిశీలన అవసరం. వైద్య విద్య విషయమే తీసుకుందాం. తెలుగునాట ఇటీవలి కాలంలో ప్రైవేటు రంగంలో పలు వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ఇందులో కొన్ని గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటయ్యాయి. అయితే మిగతా రంగాలలో వలె కాకుండా వైద్య రంగంలో ప్రైవేటు వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోని కళాశాలలతో పోటీ పడలేకపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రైవేటు కళాశాలలలో చేరడానికి వైద్య విద్యార్థులు ఇష్టపడటం లేదు.

> **విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడమే సరైన నిర్ణయం. మారిన పరిస్థితులలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసి వచ్చింది. ఇప్పటి పరిస్థితులకు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యమే సరైనది.**

ఇందుకు ప్రధాన కారణం ఆయా కళాశాలల్లో ఫ్యాకల్టీ సరిగా లేకపోవడమే. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య కళాశాలలు అన్నీ ప్రధాన పట్టణాలు, నగరాలలోనే ఉన్నాయి. ఈ కారణంగా ఆ కళాశాలలకు ఫ్యాకల్టీ ఇబ్బంది రాలేదు. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. సరైన బోధనా సిబ్బంది లేనప్పుడు ప్రైవేటు కళాశాల అయినా పిల్లలు ఎందుకు చేరతారు? నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేలు, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. వైద్య విద్యలో నిష్ణాతులైన వారు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి బోధించడానికి ఇష్టపడటం లేదు. ఫలితంగా ప్రైవేటు వైద్య కళాశాలలు కూడా మూతపడే స్థితికి చేరుకుంటున్నాయి. నీట్ పరీక్షలో అర్హత పొందినవారు తమ ప్రథమ ప్రాధాన్యంగా ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలలనే ఎంచుకుంటున్నారు. మిగతా ప్రభుత్వ కళాశాలలను ఎందుకు ప్రాధాన్యంగా ఎంచుకోవడం లేదంటే కారణం ఉంది. ఏ వైద్య కళాశాలపైన అయినా విద్యార్థులకు నమ్మకం ఏర్పడాలంటే ఫ్యాకల్టీతో పాటు రోగుల తాకిడి కూడా ఉండాలి. రోగుల సంఖ్య అధికంగా ఉన్నప్పుడే కదా విద్యార్థులు నేర్చుకోగలిగేది. మిగతా రంగాలతో పోల్చితే వైద్య రంగం భిన్నమైనది. వైద్య రంగంలో ప్రైవేటు రంగమే సూపర్ అని చెప్పలేని పరిస్థితి. ప్రైవేటు వైద్య కళాశాలలు వెలవెలబోతుండటం తెలిసిందే. ప్రైవేటు ఆస్పత్రులలో రోగులను ఫీజుల పేరుతో వేధిస్తున్నారన్న అభిప్రాయం ఉండనే ఉంది. అలా అని అన్ని ప్రభుత్వ కళాశాలలు, ఆస్పత్రులు గొప్పగా ఉన్నాయా అంటే అదీ లేదు. ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవ పథకాల అమలుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. ఈ పథకం కింద వైద్యం చేయించుకుంటున్నవారు ప్రైవేటు ఆస్పత్రులకే వెళుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన సౌకర్యాలు, వైద్యం అందుబాటులో ఉన్నప్పటికీ రోగులు వెళ్లడం లేదు. ఈ కారణంగా ఈ నిధులు ప్రభుత్వ ఆస్పత్రులకు దక్కడం లేదు.

ఏ విధానం గొప్ప?

ప్రపంచ దేశాలలో మెరుగైన వైద్య విధానం ఏ దేశంలో ఉంది? అని ఒక సందర్భంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని నేను అడిగాను. "ఫలానా దేశం అనుసరిస్తున్న విధానం సరైనదని చెప్పలేం. ఒక్కో దేశంలో ఒక్కో లోపం ఉంది" అని ఆయన బదులిచ్చారు. ఈ నేపథ్యంలో మనం ఎటువంటి విధానాన్ని ఎంచుకోవాలి? అన్న దానిపై దృష్టి పెట్టాలి కదా! ప్రజలందరికీ ఉచిత వైద్య విద్య, వైద్యం అనే విధానాన్ని అమలుచేసే పరిస్థితిలో మన ప్రభుత్వాలు లేవు. అలాగని పేద ప్రజలను గాలికి వదిలేయలేం కదా? ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా ఏదో ఒక విధానాన్ని రూపొందించుకోవాలి కదా? దేశంతో పాటు తెలుగునాట కూడా వైద్యుల కొరత ఉంది. ఈ కొరతను అధిగమించాలంటే మంచి వైద్యులను తయారుచేసే వైద్య కళాశాలలను ఏర్పాటు చేయవలసిందే. అయితే అవసరం మేరకు వైద్య కళాశాలలు నెలకొల్పి వాటిని నిర్వహించే స్థోమత ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు లేదు. ఈ కారణంగానే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వపరంగా 17 కళాశాలలను ఏర్పాటు చేయడానికి అనుమతులు పొందినా ఆయా కళాశాలల నిర్మాణాలను కూడా పూర్తిచేయలేకపోయారు. కొన్ని కళాశాలల భవనాల నిర్మాణం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. ఒకవేళ నిర్మాణాలు పూర్తయినా వాటి నిర్వహణ భారాన్ని ప్రభుత్వాలు భరించగలవా? ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లను అరికట్టడానికి ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చారు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ మధ్యాహ్న భోజన ఖర్చును సకాలంలో చెల్లించడం లేదు. ఫలితంగా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందడం లేదు. వైద్య కళాశాలలను కూడా సరిగా నిర్వహించలేకపోతే అక్కడ విద్యను అభ్యసించే వైద్య విద్యార్థుల పరిస్థితి ఏమిటి? నాసిరకం వైద్యులను తయారు చేయడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే కదా? పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం అంటే వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే అని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విమర్శించవచ్చు గానీ అందులో వాస్తవం లేదు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆస్పత్రులలో ఎంత ఎక్కువ మంది రోగులకు వైద్యం చేస్తే అక్కడ చదువుకునే మెడికోలకు అంత మంచి విద్యను అందించడమే అవుతుంది. ఇకపై వైద్య కళాశాలల్లో పేదలకు చదువుకునే అవకాశం లభించదని విమర్శించడంలో కూడా హేతుబద్ధత లేదు. కన్వీనర్ కోటా కింద సీటు పొందినవారు నామమాత్రపు ఫీజులనే చెల్లిస్తారు. వైద్య విద్యపై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు లక్షలు ఖర్చు చేయాలి. ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కనుక ఇకపై కేవలం ప్రభుత్వమే కళాశాలలను ఏర్పాటు చేయాలి అని నినదించడంలో అర్థం లేదు. అదే సమయంలో డబ్బున్న వారి వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేసి నామమాత్రపు ఫీజుల భారాన్ని తగ్గించుకోవచ్చు. క్రాస్ సబ్సిడీ విధానం ఎల్లెడలా ఉన్నదే కదా! అందుకే ప్రభుత్వం వద్ద డబ్బు లేనప్పుడు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే తప్పేమిటి? అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ప్రశ్నించింది. సంక్షేమం పేరిట హద్దులు మీరి ఖర్చులు చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో అన్నీ ప్రభుత్వమే నడపాలనుకోవడంలో అర్థం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైద్య విద్యను కాపాడుకోవాలన్నా, పేదలకు వైద్యం దూరం కాకూడదు అనుకున్నా ప్రభుత్వంతో ప్రైవేటు వ్యక్తులు చేతులు కలపక తప్పని పరిస్థితి. అదే సమయంలో వైద్య కళాశాలలను ఎక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నది కూడా ముఖ్యం. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాడేరులో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఏజెన్సీ ఏరియాలోని ఆస్పత్రుల్లో పనిచేయడానికి వైద్యులు ఇష్టపడరు. అలాంటిది ఏజెన్సీ ఏరియాలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే అక్కడ వైద్య విద్యను ఎవరు బోధించాలి? తెలంగాణలో ఏర్పాటైన ప్రైవేటు వైద్య కళాశాలల్లో కూడా హైదరాబాద్‌లో ఏర్పాటైనవే బాగా నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటైన వాటిలో సరైన బోధనా సిబ్బంది ఉండటం లేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం రెండు అంశాలపై దృష్టి సారించాలి. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలి. అదే సమయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలలను రాజకీయ కోణంలో చూడకుండా ప్రధాన నగరాల్లోనే ఏర్పాటు చేయాలి. అలా చేసినప్పుడే బోధనా సిబ్బంది లభిస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే ప్రముఖ డాక్టర్లు కూడా విధిగా విద్యా బోధనకు కొంత సమయం కేటాయించాలన్న నిబంధనను కూడా అమలు చేయాలి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై కూడా ప్రభుత్వాలు దృష్టి సారించాలి. ఫలానా అధికారి భార్య ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించారు.. ఫలానా నాయకుడు ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స చేయించుకున్నారు అని అప్పుడప్పుడూ గొప్పలు చెప్పుకొనే విధానం పోవాలి. కార్పొరేట్ ఆస్పత్రులను మినహాయిస్తే, మిగతా ప్రైవేటు ఆస్పత్రుల కంటే ప్రభుత్వ ఆస్పత్రులకు మెరుగైన భవనాలు, వసతులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. లేనిదల్లా వాటిపై ప్రజల్లో నమ్మకం. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం ఏర్పడాలంటే జవాబుదారీతనం తీసుకురావలసిందే. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో యూజర్ చార్జీలు వసూలు చేయాలని సంకల్పించగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. క్రాస్ సబ్సిడీ విధానం అమలు చేయగలిగితే పేదలకు ఉచితంగా వైద్యం చేయడంతో పాటు డబ్బున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించవచ్చు. ఇందుకోసం ఎంపిక చేసుకున్న ప్రధాన ఆస్పత్రుల్లోనైనా పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్య విధానం ప్రవేశ పెట్టవచ్చు. ఈ విధానాన్ని కొంతకాలంపాటు గమనించి, ఫలితాలు బాగుంటే మరిన్ని ఆస్పత్రులకు విస్తరించవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటు వార్డులు, గదులు ఉంటే తప్పేమిటి? పీపీపీ విధానంలో పేరొందిన డాక్టర్లకు ఆ ఆస్పత్రుల నిర్వహణ అప్పగించవచ్చు. తమ స్వార్థం కోసమైనా వారు కష్టపడతారు. శస్త్రచికిత్సల్లో నిపుణులను రప్పించి డబ్బు చెల్లించిన వారితో పాటు పేదలకు కూడా వారి సేవలను అందించవచ్చు. ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న నిధులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకే దక్కుతాయి. ఫలితంగా వాటి ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుంది. నిపుణులైన వైద్యులకు ఫీజు చెల్లించి ప్రభుత్వ ఆస్పత్రులకు రప్పించవచ్చు. పలువురు వైద్య నిపుణులు ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. అలాంటి వారికి సొంత ఆస్పత్రులు లేవు. వారికి ప్రభుత్వ ఆస్పత్రులు వేదిక అవుతాయి. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారిస్తే పటిష్ఠమైన విధానం ఆవిష్కృతం కావచ్చు. పేదలకు ఉచిత వైద్యాన్ని నిరాకరించకుండా ప్రభుత్వ ధనంతో ఏర్పాటైన భవనాలు, సౌకర్యాలను ఉపయోగించి స్థోమత ఉన్న వారి వద్ద ఫీజులు వసూలు చేయడం తప్పిదం కాదు కదా? అంతిమంగా ప్రజలు కోరుకొనేది నాణ్యమైన విద్య. పేదలకు కావల్సింది ఉచిత వైద్యం. ఈ రెండూ ఏక కాలంలో లభించినప్పుడు ఎవరికైనా అభ్యంతరాలు ఎందుకుండాలి? వైద్య రంగంలో ప్రభుత్వం మాత్రమే ఉండాలనే విధానం ఫెయిల్ అయింది. ప్రైవేటు రంగం కూడా పేదలకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో మధ్యస్థంగా ఉండే పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యమే పరిష్కార మార్గం కావొచ్చు. దీన్ని ఒక ప్రయోగంగా అమలు చేయడంలో తప్పు లేదు. ఏ విధానంలో అయినా చెక్స్ అండ్ బేలెన్సెస్ ఉండాలి. ప్రైవేటు వైద్య రంగానికి చెక్ పెట్టడానికైనా ఈ పీపీపీ విధానం దోహదపడవచ్చు. రాజకీయ పార్టీలు హిపోక్రసీతో సతమతం అవుతున్నాయి. అందుకే అన్నీ ఉచితం అంటాయి. ప్రభుత్వాల వద్ద డబ్బు లేనప్పుడు ఉచితం ఎలా? పరిస్థితుల్లో మార్పు లేకపోతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకుండా పోతాయి. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే ప్రజలకు మేలు చేసినవారవుతారు. రోగులకు ఇచ్చే మందులు తియ్యగా ఉండవు కదా? అలాగే మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు ఎంతో కొంత వ్యతిరేకత వస్తుంది. విమర్శలు కూడా వస్తాయి. ప్రభుత్వ ఉద్దేశాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి నూతన విధానం ఫలితాలను వీలైనంత త్వరగా చూపించగలిగితే మార్పును ప్రజలు కూడా ఆహ్వానిస్తారు. అయితే ప్రభుత్వాలకు సంకల్ప బలం ఉండాలి!




> **పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం అంటే వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే అని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విమర్శించవచ్చు గానీ అందులో వాస్తవం లేదు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆస్పత్రులలో ఎంత ఎక్కువ మంది రోగులకు వైద్యం చేస్తే అక్కడ చదువుకునే మెడికోలకు అంత మంచి విద్యను అందించడమే అవుతుంది. ఇకపై వైద్య కళాశాలల్లో పేదలకు చదువుకునే అవకాశం లభించదని విమర్శించడంలో కూడా హేతుబద్ధత లేదు. కన్వీనర్ కోటా కింద సీటు పొందినవారు నామమాత్రపు ఫీజులనే చెల్లిస్తారు. వైద్య విద్యపై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు లక్షలు ఖర్చు చేయాలి. ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కనుక ఇకపై కేవలం ప్రభుత్వమే కళాశాలలను ఏర్పాటు చేయాలి అని నినదించడంలో అర్థం లేదు. అదే సమయంలో డబ్బున్న వారి వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేసి నామమాత్రపు ఫీజుల భారాన్ని తగ్గించుకోవచ్చు. క్రాస్ సబ్సిడీ విధానం ఎల్లెడలా ఉన్నదే కదా! అందుకే ప్రభుత్వం వద్ద డబ్బు లేనప్పుడు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే తప్పేమిటి? అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ప్రశ్నించింది.**

సమాచార స్వేచ్ఛతోనే నిజమైన ప్రజాస్వామ్యం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 2005 సంవత్సరం ఒక మైలురాయి. ఆ ఏడాది అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిన సమాచార హక్కు (సహ) చట్టం దేశ పాలనను 'పారదర్శకత' వైపు మళ్లించింది. ఆర్టీఐ కేవలం ఒక పరిపాలనా చట్టం కాదు. పారదర్శకత, బాధ్యతాయుత పాలన, ప్రజా భాగస్వామ్యం అనే ప్రజాస్వామ్య మూలాలను బలపరిచే ఉద్యమంగా నిలిచింది. ఈ చట్టం ప్రజాస్వామ్యానికి నూతన శ్వాసనిచ్చిన సంస్కరణ. అధికారాల తలుపులు తెరిచి ప్రజల చేతుల్లో పౌరాధికారం పెట్టిన మానవ హక్కుల విప్లవం. ఇప్పుడు ఈ చట్టం ఇరవై ఏళ్ల పూర్తవుతున్న వేళ... దీని ప్రయాణం ఎలా ఉందో, ప్రపంచంలోని అత్యంత పారదర్శక దేశాలతో పోలిస్తే మనం ఎక్కడ ఉన్నామో పరిశీలించడం అవసరం.

భారతదేశం ఆమోదించిన సహ చట్టం ప్రపంచంలో అత్యంత ప్రజానుకూలమైన చట్టాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది సమయపాలనతో సమాచారం ఇవ్వడం, ముందుగానే వివరాలు ప్రకటించడం, స్వతంత్ర సమాచార సంఘాలు ఏర్పాటు చేయడం వంటి ముఖ్య లక్షణాలను కలిగి ఉంది. ఇరవై ఏళ్లలో లక్షలాది పౌరులు ఈ చట్టం ద్వారా అవినీతిని వెలికితీశారు, సంక్షేమ పథకాలలో లోపాలను సరిచేశారు, ప్రభుత్వ బాధ్యతను పెంచారు. ప్రారంభ దశలో సహ చట్టం ప్రజల్లో ఆశను రగిలించింది. సాధారణ పౌరుడు కూడా ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించగలిగాడు. గ్రామ పంచాయతీ నుంచి కేంద్ర మంత్రిత్వ శాఖ వరకు, గ్రామ ప్రథమ పౌరుడు నుంచి దేశ ప్రధానమంత్రి వరకు 'ప్రజల సొత్తు' అనే అవగాహన వ్యాపించింది. కానీ రెండు దశాబ్దాల తర్వాత, ఆ కాంతి కొంత మందగించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార సంఘాల్లో నియామకాల ఆలస్యం, నిర్ణయాల తడబాటు, లక్షలాది కేసుల పెండింగ్ వంటివి చట్టం అమలుపై మబ్బుల్లా కమ్మాయి.

ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 4 లక్షలకు పైగా ఫిర్యాదులు పరిష్కారం కోసం రాష్ట్ర సమాచార కమిషన్ల వద్ద వేచి ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒక ఆర్టీఐ ఫిర్యాదు విచారణకు రావడానికి దశాబ్దాల సమయం పడుతోంది. తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే ఇప్పుడున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు దాదాపు 30 సంవత్సరాలు పడుతుందని 'సార్థక్ నాగరిక సంఘటన్' అనే స్వచ్ఛంద సంస్థ మూడు రోజుల క్రితం నివేదిక విడుదల చేసింది. సహ చట్టం అమలులో ప్రజలకు మద్దతుగా ఉండాల్సిన సమాచార కమిషన్ల బాధ్యతారాహిత్యానికి ఈ నివేదిక ఉదాహరణగా నిలుస్తోంది. చట్టం ఉన్నా, వ్యవస్థల్లో చలనం లేనట్లు సూచిస్తోంది. పౌరుడు అడిగే ప్రతి సమాచారానికి సమాధానమివ్వాలన్న బాధ్యత ప్రభుత్వానికి ఉన్నా, అది ఆచరణలోకి రాకపోవడం బాధాకరం.



సమాచార హక్కు ఉద్యమం.. ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగం. యునెస్కో 2024 నివేదిక ప్రకారం, 139 దేశాలు ఇప్పటికే తమ రాజ్యాంగం లేదా చట్టాల ద్వారా ప్రజలకు సమాచారం పొందే హక్కు కల్పించాయి. స్వీడన్ 1766లోనే 'ఫ్రీడమ్ ఆఫ్ ది ప్రెస్ యాక్ట్' ద్వారా ప్రజలకు ప్రభుత్వ పత్రాలు పరిశీలించే హక్కు ఇచ్చింది. అమెరికా 1966లో 'ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ యాక్ట్' ద్వారా సమాచార నిరాకరణపై న్యాయ సమీక్షకు వీలు కల్పించింది. బ్రిటన్ (2000లో), మెక్సికో, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా వంటి దేశాలు అవినీతి నిరోధం, ప్రజా భాగస్వామ్యాన్ని బలపరచేందుకు ఇలాంటి చట్టాలు తీసుకువచ్చాయి. ముఖ్యంగా డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు సంవత్సరాలుగా 'అవినీతి లేని పరిపాలన', 'పౌరాభిప్రాయ బలమైన వ్యవస్థల'తో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. డెన్మార్క్‌లో ప్రభుత్వ నిర్ణయాలు పూర్తిగా బహిరంగంగా, అత్యంత పారదర్శకంగా ఉంటాయి. ప్రతి మంత్రిత్వ శాఖ తమ డేటా, ఖర్చులు, విధాన నిర్ణయాలకు సంబంధించిన సమస్త సమాచారం ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతుంది. ఫిన్లాండ్‌లో సమాచార హక్కు చట్టం అమలును రాజ్యాంగ ప్రమాణంగా పరిగణిస్తారు. న్యూజిలాండ్, సింగపూర్‌లో ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతుంది; విచారణల్లో ఆలస్యం ఉండదు. పాలనలో దాపరికానికి చోటులేదు అన్న భావన ఈ దేశాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వీరి విజయాలతో ఒక విషయం మనం గుర్తించాలి. పారదర్శకత అనేది కేవలం చట్టంతో కాదు, నిబద్ధతతో వస్తుంది. సమాచార హక్కు అమలు చేసే అధికారులు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. ప్రజల అభ్యర్థనలను ఆలస్యం లేకుండా పరిష్కరించగలిగే వ్యవస్థ నిర్మించాలి.

భారతదేశం ఇప్పటికీ ప్రజాస్వామ్యంలో బలమైన మూలాలు కలిగిన దేశమే. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రధానమంత్రి నుంచి గ్రామ సర్పంచి వరకు ప్రజల ఎదుట బాధ్యత వహించే వ్యవస్థ ఏర్పడింది. అయితే ఈ వ్యవస్థ అమలులో కొన్ని లోపాలు ఉన్నాయి. సమాచార సంఘాల నియామకాలు ఆలస్యం; అప్పీలు, ఫిర్యాదులు సంవత్సరాల తరబడి పెండింగ్; కొన్ని విభాగాల్లో డేటా డిజిటల్‌గా అందుబాటులో లేకపోవడం; స్వచ్ఛందంగా ప్రకటించాల్సిన సమాచారాన్ని అందుబాటులో ఉంచకపోవడం; అధికారుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు లేకపోవడం వంటి లోటుపాట్లు.. ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంగా పేర్కొనబడే ఆర్టీఐ చట్టాన్ని బలహీనపరుస్తున్నాయి. ఈ బలహీనతలను అధిగమిస్తే.. పారదర్శకత, అవినీతి రహిత పాలనలో భారతదేశం ప్రపంచ అత్యుత్తమ దేశాలలో ఒకటిగా నిలుస్తుంది.

ఇరవై ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా, సమాచార హక్కు చట్టం భారత ప్రజాస్వామ్యంలో అత్యంత ధైర్యవంతమైన సంస్కరణగా నిలుస్తోంది. ప్రజాస్వామ్య భవిష్యత్తు కేవలం ఓటు హక్కులోనే కాదు, తెలుసుకునే హక్కులోనూ ఉంది. సమాచారం నిజంగా ప్రజలదైతే పాలన నిజమైన ప్రజాసేవగా మారుతుంది. అదే భారత ప్రజాస్వామ్యానికి శాశ్వత బలం. ఈ చట్టం భారత ప్రజాస్వామ్యానికి వెలుగు చూపిన దీపం. కానీ ఆ వెలుగును నిలబెట్టుకోవడం పౌరులుగా మన బాధ్యత. సమాచార స్వేచ్ఛ ఉన్న దేశమే నిజమైన ప్రజాస్వామ్యం కలిగిన దేశం. మన ప్రజాస్వామ్యం మరో రెండు దశాబ్దాలు మరింత బలంగా ఉండాలంటే 'సమాచారం ప్రజల హక్కు' అని ప్రతి పౌరుడూ భావించాలి.

▪ ఆచార్య బాలకిష్టారెడ్డి వుంధ్యాల
అధ్యక్షుడు, తెలంగాణ ఉన్నత విద్యామండలి

(నేటితో సమాచార హక్కు చట్టానికి 20 ఏళ్లు)

సండే స్పెషల్ SUNDAY SPECIAL

భీమునిపాదం.. పర్యాటక వినోదం..

ఆకాశంలో విరిసిన హరివిల్లు మేఘాలను మోసు కొస్తున్నట్లు.. రాళ్ల మీద నుంచి దూదిపిందెలు లోయలోకి దూకుతున్నట్లు 70 అడుగుల ఎత్తు నుంచి మంచుతెరలను తలపిస్తూ నీటిదారులు పడుతుంటే చూసే కన్నులకు ఎంతో హాయి. ఆకు పచ్చని ప్రకృతిలో గలగలపారే సెలయేరు. ఒక్క సారిగా మాయమై గుట్టల మీదునుంచి కిందికి జాలువారు తుంటే మనస్సు పులకరిస్తుంది. ప్రకృతి చెక్కిన కొండలు... వాటి మధ్య జలదారలు ప్రవహిస్తున్న తీరును చూసిన మది మైమరపించి పోయి పురివిప్పిన నెమలితీరు ఎగిరి గంతేయాలని పిస్తుంది. ఈ రమణీయ దృశ్యాలకు నెలవుగా అలరారేదే భీమునిపాదం. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం శివారు కొమ్ములవంచ పరిధి అటవీప్రాంతంలో ప్రకృతి ఒడిలో కొలువై ఉంది ఈ జలపాతం.

- ఆంధ్రజ్యోతి, గూడూరు

పచ్చని అడవిలో కొలువైన అందాల జలపాతం

- స్వచ్ఛమైన ప్రాకృతిక వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువైన ప్రదేశం
- ఏటేటా పెరుగుతున్న పర్యాటకులు
- ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధికి చర్యలు
- అడ్వెంచర్ టూరిజానికి సైతం అనుకూలం
- సౌకర్యాల కల్పనకు అటవీశాఖ చర్యలు

7



భీమునిపాదం ప్రాంతంలో గుట్టలను కప్పేసిన పచ్చదనం



భీమునిపాదం వద్ద నిర్మించిన పగోడ



భీమునిపాదం జలపాతం దృశ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

- బీఆర్ఎస్ పాలనలోనే కృష్ణా, గోదావరి వాటాల్లో నష్టం
- కాళేశ్వరం నిరుపయోగమైంది.. ఒక్కగానొక్క ప్రాజెక్టు కూలింది..
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చిత్తశుద్ధితో ఉన్నాం..
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హనుమకొండ సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జల వనరుల వాటాను దక్కించుకోవడం, సంరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ ఇటీవలే మృతిచెందారు. మాధవరెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని ఆయన నివాసానికి వచ్చారు. పరామర్శ అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నిర్మించిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం కుప్పకూలిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కూలడం, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు బీటలు వారి నిరుపయోగంగా మారాయన్నారు. తమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మిస్తామని బీరాలు పలికిన బీఆర్ఎస్ పాలకులు.. తట్టెడు మట్టి ఎత్తలేదని విమర్శించారు. లక్షకుపైగా వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం నిరుపయోగంగా మారినా.. 148.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు చెప్పారు. దేశ చరిత్రలోనే రికార్డుగా తెలిపారు. మూడు పంటల్లో అధిక ఉత్పత్తి సాధించామని వివరించారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చిత్తశుద్ధితో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రణాళిక, ప్రాధాన్యతల మేరకు నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతుల సాధనలో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. సీతారామ ప్రాజెక్టుకు 65 టీఎంసీల నీటి కేటాయింపు ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. వాస్తవాలు కళ్లకు కట్టినట్లు ఉన్నా..హరీశ్‌రావు రాజకీయ స్వార్థంతో కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఎల్ నాగరాజు, రాంచంద్రునాయక్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ పింగళి వెంకట్రాంరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు కట్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి మంత్రి ఉత్తమ్ పరామర్శ

15న పెద్దకర్మకు రానున్న సీఎం

హనుమకొండ సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మాధవరెడ్డి తల్లి కాంతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన సంగతి విదితమే. పరామర్శకుహనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని మాధవరెడ్డి నివాసానికి మంత్రి ఉత్తమ్‌వచ్చారు. మాధవరెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేశారు. అనంతరం జిల్లా నేతలతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముచ్చటించారు. ఇదిలా వుండగా, కాంతమ్మ పెద్దకర్మ ఈ నెల 15న జరుగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

మిల్లర్ మాయాజాలం

- శాయంపేటలో ధాన్యం సేకరణ ప్రక్రియలో భారీ మోసం
- రైస్‌మిల్ యజమాని బెజ్జంకి శ్రీనివాస్ ప్రధాన సూత్రధారి
- వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ప్లాన్
- రూ. కోటి 86 లక్షల నిజమైన రైతుల డబ్బు పక్కదారి
- 12 మంది నకిలీ రైతుల ఖాతాల్లో డబ్బు జమ
- 21మందిపై శాయంపేట పీఎస్‌లో కేసు నమోదు
- చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శశిధర్‌రాజు వెల్లడి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఓ మిల్లర్ మాయాజాలంతో ధాన్యం సేకరణ ప్రక్రియలో భారీ మోసం బయటపడింది. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శశిధర్‌రాజు శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి శాయంపేట మండల కేంద్రంతో పాటు, శాయంపేట మండలం కాట్రపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భారీ అవినీతి జరిగినట్లు గుర్తించి సివిల్ సప్లయిస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు విచారణ చేయగా భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని శశిధర్‌రాజు తెలిపారు.

కమలాపూర్‌లోని సాంబశివ మినీ మోడ్రన్ రైస్ మిల్ యజమాని బెజ్జంకి శ్రీనివాస్ ప్రధాన సూత్రదారి కాగా, పత్తిపాక గ్రామానికి చెందిన బండ లలిత ప్రధాన పాత్రధారురాలని అన్నారు. లలితతో శ్రీనివాస్ కాంటాక్ట్ అయి పలువురు వ్యవసాయ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి కుట్రచేసి 12 మంది నకిలీ రైతులను సృష్టించి కుంభకోణం చేశాడన్నారు. శ్రీనివాస్ పలువురు వ్యవసాయశాఖ అధికారులతో కుమ్మక్కై అధికారిక ఆన్‌లైన్ ధాన్యం సేకరణ నిర్వహణ వ్యవస్థ ఫోల్డర్‌ను ఉపయోగించి 12మంది నకిలీ రైతులను సృష్టించాడన్నారు. ఈ నకిలీ రైతులు 278 ఎకరాల భూమి సాగుచేసినట్లుగా చూపించి శాయంపేట, కాట్రపల్లిలో నిర్వహిస్తున్న ఐకేపీ సెంటర్లకు 8049క్వింటాళ్ల ధాన్యాన్ని సరఫరా చేసినట్లుగా చూపించి, రూ.1,86,63,088 మొత్తాన్ని అక్రమంగా 12మంది నకిలీ రైతుల అకౌంట్లలోకి మళ్లించేలా చేశాడని తెలిపారు.

ఈ మోసంలో నకిలీ లారీ చిట్టీలు ఉపయోగించి, టోకెన్ పుస్తకాలు సృష్టించి, రికార్డులను తారుమారు చేసి రవాణా జరిగినట్లు సృష్టించారని, వాస్తవానికి ఎలాంటి కొనుగోళ్లు జరగలేదని, ఇలా చేయడం వల్ల కార్పొరేషన్ నుంచి మోసపూరిత చెల్లింపులు జరిగాయన్నారు. నకిలీ రైతులైన వడ్లూరి నవతకు 34 ఎకరాలు ఉందని, రూ.22,44,616, వడ్లూరి కళ్యాణ్‌కు 15 ఎకరాలు అదనంగా కలిపి రూ.10,26,160, వడ్లూరి శ్రీచరణ్‌కు 33ఎకరాలు కలిపి రూ.21,74,088, బెజ్జంకి శోభారాణికి 33ఎకరాలు కలిపి రూ.7,71,168, బెజ్జంకి శివకుమార్‌కు 33ఎకరాలు కలిపి రూ.21,25,120, బెజ్జంకి చందుకు 22ఎకరాలు కలిపి రూ.14,73,664, వడ్లూరి రాజేదర్‌కు 17ఎకరాలు కలిపి రూ.11,52,576, బెజ్జంకి పున్నంచారికి 26ఎకరాలు కలిపి రూ.18,62,496, వేమునూరి శ్రీనవ్యకు 34ఎకరాలు కలిపి రూ.22,65,968, వేమునూరి శ్రీనివాస్‌చారికి 11ఎకరాలు కలిపి రూ.7,57,248, వేమునూరి ఉదయ లక్ష్మికి 16ఎకరాలు కలిపి రూ.10,67,200, చిర్లనేహ సింధుకు 26ఎకరాలు కలిపి రూ.17,42,784 అక్రమంగా వీరి అకౌంట్లలోకి జమ చేయించారన్నారు. ఈ 12మంది నకిలీ రైతులు మొత్తంగా 8049క్వింటాళ్ల ధాన్యం ఇచ్చినట్లు చూపించి రూ.1,86,63,088ల నిజమైన రైతుల సొమ్మును పక్కదారి పట్టించినట్లు గుర్తించామన్నారు. ఈ 12 మందిలో శ్రీనివాస్ భార్య శోభారాణి, కుమారుడు చందులు ఉన్నారన్నారు.

భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), ఇతర వర్తించే చట్టాల సంబంధిత నిబంధన ప్రకారం మోసంలో ప్రమేయం ఉన్న వ్యక్తులందరిపై చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేశామని, రూ.1,86,63,088 అక్రమంగా నకిలీ రైతులకు క్లైమ్ అయిన నిధులు తక్షణమే రికవరీ చేస్తామని, 12మంది రైతులకు సంబంధించి తదుపరి బోనస్ చెల్లింపులను నిలిపివేయనున్నట్లు తెలిపారు. సూత్రధారి బెజ్జంకి శ్రీనివాస్, ప్రధాన పాత్రధారి బండ లలితతో పాటు 12మంది నకిలీ రైతులు, శాయంపేట మండల ఏవో కె.గంగా జమున, శాయంపేట క్లస్టర్ ఏఈవో బి.అర్చన, నేరెడుపల్లి క్లస్టర్ ఏఈవో ఎం.సుప్రియ, పీపీ సెంటర్ ఇన్‌చార్జిలు హైమావతి, అనిత, ప్రైవేట్ ల్యాబ్ ఆపరేటర్ వాంకుడోతు చరణ్, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ రాజేశ్వర్‌రావుపై శాయంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇటువంటి అవినీతి ఎక్కడ జరిగినా కూడా కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఎం.ప్రభాకర్ ఇన్స్‌పెక్టర్‌లు సైదులు, వసంత్‌రావులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శశిధర్‌రాజు

డీసీసీ పదవులకు నేటి నుంచి దరఖాస్తులు

స్వీకరించనున్న ఏఐసీసీ అబ్జర్వర్ పట్నాయక్

హనుమకొండ సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఎన్నికల సందడి మొదలైంది. అధ్యక్షుల ఎంపిక దరఖాస్తుల స్వీకరణ ఆదివారం ఉదయం 11గంటల నుంచి హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరుగనుంది.ఈ మేరకు దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ నేరుగా ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ సమయంలో ఆయన దరఖాస్తుల స్వీకరణతో పాటు అధ్యక్ష అభ్యర్థుల విషయమై క్షేత్రస్థాయిలో కూడా అభిప్రాయాలను తెలుసుకోనున్నారు.

పట్నాయక్‌కు ఘన స్వాగతం

కాంగ్రెస్ నూతన జిల్లా అధ్యక్షుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ హనుమకొండకు వచ్చారు. శనివారం సాయంత్రం ఆయన నక్కలగుట్టలోని హరిత హోటల్‌కు చేరుకోగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్, వరద రాజేశ్వరరావు, బత్తిని శ్రీనివాస్ పూల మాలతో స్వాగతం పలికారు. అనంతరం గంట సేపు పట్నాయక్ జిల్లా నేతలతో సమావేశమయ్యారు.



నవజ్యోతి పట్నాయక్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు



రితిక్, జతిన్ మృతదేహాలు

తల్లడిల్లిన ఎంచగూడెం

- ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- మృతులిద్దరూ అన్నాచెల్లెళ్ల కుమారులు
- కన్నీరుమున్నీరైన రెండు కుటుంబాలు

6

బహుజనులే పాలకులుగా ఎదగాలి..

- మన ఓట్లు మన వాళ్లకే వేసుకుందాం..
- బీసీ చైతన్య వేదిక రాష్ట్ర చైర్మన్‌వెంకటనారాయణ

వడ్డేపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బహుజనుల ఓట్లు బహుజనులే వేసుకొని పాలకులుగా ఎదగాలని, ఐక్య ఉద్యమాలతోనే రిజర్వేషన్లు సాధ్యమని బీసీ చైతన్య వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ రిజర్వేషన్లు - ఉద్యమ కార్యాచరణతో కూడిన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వీరితో పాటు బీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్స సుధీర్ మాట్లాడారు.

ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు అవసరం లేదని, బహుజనుల ఓట్లు బహుజనులకే వేసుకుంటే జనరల్ సీట్లన్నింటిలో బీసీలు పోటీ చేసి గెలవవచ్చని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై ఇటీవల తెలంగాణ హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో బీసీ చైతన్య వేదిక, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఉపయుక్తమైందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమం వలే విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు, సబ్బండ వర్గాలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. తమ ఓట్లు వేసి అధికారం ఆధిపత్య కులాల వారికి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. హక్కులు, అధికారం కోసం ఆధిపత్య కులాల వారిని అడుక్కోవడం ఏంటని పేర్కొన్నారు. బహుజనుల ఓట్లు బహుజనులు వేసుకుంటే జనరల్ సీట్లల్లో సైతం బీసీలే గెలవవచ్చని, ఆ దిశగా బీసీ ఉద్యమ నాయకత్వం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లకు ఎస్సీ, ఎస్టీల మద్దతు ఉంటుందని, రిజర్వేషన్లను సాధించే వరకు వారు వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

బీసీ కులగణన జరిపి బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్ల కల్పన విషయంలో అన్ని పార్టీలు బీసీ సమాజాన్ని మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. గ్రామ గ్రామాన పర్యటించి బీసీలతో పాటు అన్ని సామాజిక వర్గాలను సంఘటితం చేసి ఫ్రంట్‌గా ఏర్పడి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమా రామమూర్తి, వివిధ సంఘాల నాయకులు తాడిశెట్టి క్రాంతికుమార్, చాపర్తి కుమార్ గాడ్గే, గొల్లపల్లి వీరస్వామి, సోమిడి అంజన్‌రావు, నలిగంటి చంద్రమౌళి, కేడల ప్రసాద్, చిల్లా రాజేంద్రప్రసాద్, అల్లం నాగరాజు, మధు పాక ఎల్లన్న, బక్కి యాదగిరి, వేణుమాధవ్, ధర్మపురి రామారావు, నూర సంపత్‌పటేల్, శ్రీధర్‌రాజు, సాయిబాబా, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రాచకొండ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ ప్రజా సంఘాల నేతలు



జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న మంత్రులు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు, కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కె-హబ్‌తో టి-హబ్ అవగాహన ఒప్పందాలు

● రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కేయూ క్యాంపస్ అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ కె-హబ్‌తో హైదరాబాద్‌లోని టి-హబ్ పరస్పర అవగాహన ఒప్పందాలు జరుగుతాయని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కేయూ ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు జరిగాయి. ఈ వేడుకలకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వరంగల్‌లో ఆవిష్కరణలు, ఇంక్యూబేషన్ స్టార్టప్‌లకు హబ్‌లుగా అభివృద్ధి చేయడానికి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. దేశంలో టాప్-10 కళాశాలల్లో కేయూ ఫార్మసీ కళాశాలలో ఒక్కటిగా నిలిచిందన్నారు. వర్సిటీ అభివృద్ధికి పూర్వ అధ్యాపకులు, విద్యార్థుల పాత్ర గొప్పదన్నారు.

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూ పేరు ప్రఖ్యాతులను, కీర్తిని ప్రశంసించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రూసాతో పాటు ఇతర సంస్థల సహకారంతో వర్సిటీ ఫార్మసీ కళాశాలలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. 600 మంది కేయూ ఫార్మసీలో పీహెచ్‌డీ డిగ్రీలు సాధించారని పేర్కొన్నారు. వర్సిటీ ఫార్మసీ కళాశాల స్కాలర్స్, అధ్యాపకులు స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలుగా, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నారని కొనియాడారు. డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి హ్యాకథాన్‌లను నిర్వహిస్తామన్నారు. గత సెప్టెంబరులో కేయూ ఫార్మసీ కళాశాలతో పాటు యూఎస్ఏలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించామన్నారు. డిసెంబరులో వర్సిటీలో మెగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగనుందన్నారు. అనంతరం కేయూ ఫార్మసీ పూర్వ విద్యార్థుల సావనీర్‌తోపాటు మరో రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణితో పాటు ఫార్మసీ అల్యూమినీ బాధ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డిపో సందర్శనకు ఎం.డి. నాగిరెడ్డి రాక

హనుమకొండ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఆదివారం హనుమకొండ ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సందర్శనకు వస్తున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను శనివారం తెలిపారు. ఇటీవలే ఆర్టీసీ ఎం.డి.గా బాధ్యతలు స్వీకరించిన వై.నాగిరెడ్డి.. తొలిసారిగా వరంగల్ రీజినల్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ సందర్శనలో బస్సుల నిర్వహణ, డిపో పరిసరాల పరిశుభ్రత, వాహనాల స్థితి, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది సమస్యలపై అధికారులతో సమీక్ష జరుపనున్నట్లు ఆర్ఎం తెలిపారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రవాణా సేవల మెరుగదల, ఆదాయం పెంపు, ప్రయాణికుల సౌకర్యాలపై చర్చిస్తారని ఆర్ఎం తెలిపారు. ఎం.డి. పర్యటన సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పసి మనసుల్లో మతాన్ని నూరిపోస్తారా..?

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి

పుస్కోస్ స్కూల్ పై ముఖ్యమంత్రికి లేఖ

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బడిలో క్రైస్తవ మత బోధనలు చేయడంపై బీజేపీ స్పందించింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రికి, కేంద్ర మానవవనరుల కార్యదర్శికి, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శికి మెయిల్ ద్వారా, వాట్సాప్ ద్వారా లేఖను పంపించినట్లుగా జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పుస్కోస్ స్కూల్‌లో పసి మనస్సుల్లో మతాన్ని నూరి పోస్తారా అంటూ ప్రశ్నించారు. మత ప్రచారం చేస్తూ విద్యార్థులపై క్రైస్తవ మత సిద్ధాంతాలను బలవంతంగా రుద్దుతున్న విద్యా సంస్థల గుర్తింపు రాష్ట్ర వ్యాప్తంగా వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో పాటు విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి తరగతి నుంచి కొంత మంది విద్యార్థులను ఎంచుకుని మత సిద్ధాంతాలను నేర్పే విధంగా ప్రయత్నం చేయడం, బాల్యం నుంచే వారిని ప్రేరేపించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, జిల్లా కార్యదర్శి జడ సతీష్, దళిత మోర్చా నాయకుడు పంజా వెంకటేశర్లు, మండల కార్యదర్శి సట్ల అనిల్, సోషల్ మీడియా కన్వీనర్ పోశాల సురేష్, యువ మోర్చా నాయకుడు వడ్లకొండ మణిదీప్, ఎలిషాల రాకేష్, మహంతి, గుడ్ల సుభాష్, వెంటకస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆరా..

పుస్కోస్ స్కూల్‌లో జరిగిన మత బోధనలో అంశంపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీసినట్లుగా తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే డీఈవోకు పూర్తి సమాచారం ఎంఈవో శ్రీధర్ అందించగా, పోలీసు శాఖ సైతం దృష్టి సారించింది. ఇంటలిజెన్స్, ఎస్బీ అధికారులు సైతం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. స్కూల్‌లో జరిగిన ఘటనపై సాక్ష్యాధారాలతో యాజమాన్యం పట్టుబడడంతో ప్రిన్సిపాల్ మేరి అధికారులకు వాస్తవాలను దాచేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. మొత్తానికి ఓ మతానికి సంబంధించిన వ్యక్తులు పాఠశాల ఆవరణలో, అందులోనూ తరగతి గదిలో ఉండడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సెలవులు కావడంతో నో రెస్పాన్స్..

మత బోధనలు చేసిన ఘటనపై సెలవులు కావడంతో విద్యాశాఖ చర్యల్లో ఆలస్యం జరిగినట్లుగా సమాచారం. రెండో శనివారం, ఆదివారం కావడంతో పాఠశాల అంశంపై సోమవారం పూర్తి నివేదిక అందనుంది. దీనిపై వరంగల్ జిల్లా డీఈవో రంగయ్య నాయుడును వివరణ కోరగా ఎంఈవో శ్రీధర్ నివేదిక అందించాడని, హైస్కూల్స్‌పై ఆర్‌జేడీ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న కుందూరు మహేందర్ రెడ్డి

కూర్చొని మాట్లాడుకుందాం..

మత బోధనలు చేసిన పాఠశాల యాజమాన్యం చర్చలు

పోలీసుల ద్వారా బీజేపీ నేతలపై ఒత్తిడి.?

వర్ధన్నపేట రూరల్ / వర్ధన్నపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల తరగతి గదిలో మత బోధన చేస్తూ అడ్డంగా దొరికిపోయిన స్కూల్ యాజమాన్యం బేరసారాలకు దిగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. చివరకు పోలీసులను సైతం మధ్యవర్తిత్వం వహించేలా చేస్తోంది. శనివారం బీజేపీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి స్కూల్‌పై ఫిర్యాదు చేయడాన్ని తెలుసుకున్న పోలీసులు.. బీజేపీ నేతలతో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా రాజీ పడాలని పోలీసులు బీజేపీ, హిందూ సంఘాల నేతలకు చెప్పినట్లుగా తెలిసింది. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం కూర్చొని స్కూల్ యాజమాన్యం, బీజేపీ నేతలు రాజీమార్గానికి రావాలని సూచన చేసినట్లు సమాచారం. అయితే బీజేపీ నాయకుల్లో సైతం భిన్నభిప్రాయాలతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయకుండా వచ్చినట్లు తెలిసింది. సెలవుల కారణంగా ఫిర్యాదులు ఇప్పుడు తీసుకోమని పోలీసులు చెప్పినట్లు నేతలు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా, స్కూల్ యాజమాన్యం సైతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రముఖులెవరో తెలుసుకుని ఫోన్లు చేసి తమ స్కూల్‌కు అనుకూలంగా మాట్లాడాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. పాఠశాలకు కొందరిని పిలిపించుకుని చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే స్కూల్‌ను మూసివేసి విద్యార్థుల భవిష్యత్తును ఇబ్బంది పెట్టాలనేది తమ ధ్యేయం కాదని కొందరు బీజేపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. మత బోధన చేసేందుకు వచ్చిన ఫాదర్, ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని చెపుతున్నారు. ఈ విద్యా సంవత్సరం ముగిసిన తర్వాతే పాఠశాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని చెప్పుకొస్తున్నారు.

నేడు పల్స్ పోలియో : డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ డే నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. అన్ని పీహెచ్‌సీలకు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పోలియో వ్యాక్సిన్, ఇతర లాజిస్టిక్స్ అన్ని అందజేశామన్నారు. జిల్లాలోని 472 పోలియో కేంద్రాలతో పాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో కూడా ప్రయాణంలో ఉన్న వారి కోసం పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎ.మహేందర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారన్నారు. రాష్ట్ర పరిశీలకుడు జేవీశ్రీనివాసరావు శనివారం వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు సందర్శించి సూచనలు చేసినట్లు తెలిపారు.

నేడు క్రెడాయ్ రక్తదాన శిబిరం

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ ఎంజీఎం ఆధ్వర్యంలో క్రెడాయ్ నేతృత్వంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమర్ తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

ఖోఖో క్రీడలో ప్రథమ స్థానంలో నిలవాలి

ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్ జంగా రాఘవరెడ్డి

జోరుగా సీనియర్ సౌత్‌జోన్ ఖోఖో ఎంపిక పోటీలు



ఖోఖో ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో జంగా రాఘవరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఖోఖో క్రీడలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్ జంగా రాఘవరెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని ఖోఖో కోర్టులో ఏర్పాటు చేసిన సౌత్ జోన్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఖోఖో ఎంపిక పోటీలను జంగా రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖోఖో క్రీడాభివృద్ధికి 15ఏళ్లుగా అహర్నిశలు పాటు పడుతున్నామన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా రానున్న 2026 జనవరిలో ఓరుగల్లు వేదికగా జాతీయ స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించ బోతున్నామని రాఘవరెడ్డి తెలిపారు.

ఖోఖో అసోసియేషన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ.. ఇక్కడ ఏర్పాటుచేసిన సౌత్ జోన్ ఎంపిక పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 120మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో కర్ణాటక రాష్ట్రం ధావనగిరిలో నిర్వహించనున్న జాతీయస్థాయి సౌత్ జోన్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి) ఆధ్వర్యంలో 2025-2026 సంవత్సరానికి గాను గుజరాత్ నిర్వహిస్తున్న అండర్-18 బాలికల ఖోఖో శిబిరంలో శిక్షణ పొందుతున్న వరంగల్ కరీమాబాద్‌కు చెందిన ఖోఖో క్రీడాకారిణి నవ్యశ్రీని జంగా రాఘవరెడ్డి, అసోసియేషన్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ఖోఖో అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన ఎంచగూడెం

ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

మృతులిద్దరూ అన్నాచెల్లెళ్ల కుమారులు

కన్నీరుమున్నీరైన రెండు కుటుంబాలు

కొత్తగూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఇంట్లోని అన్నాచెల్లెళ్ల కుమారులు ప్రమాదవశాత్తు ఊరి బయట బావిలో పడి మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విషాదకరమైన ఘటన ఎంచగూడెంలో శనివారం జరిగింది. బంధువులు, ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలంలోని ఎంచగూడెంకు చెందిన ఇటికాల సతీష్-స్వాతి దంపతలకు కుమారుడు ఇటికాల రితిక్ (8), కూతురు ఉన్నారు. సతీష్ నర్సంపేటలోని ఓ కంగన్‌హాల్ షాపును నడుపుతున్నాడు. రితిక్ నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. ములుగు మండలం పులిగుండం గ్రామానికి పరణందుల అనిత-శ్రీనివాస్ దంపతులకు కుమారుడు జతిన్ (12), కూతురు ఉన్నారు. జతిన్ తొర్రూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువున్నాడు. ఇటికాల సతీష్, పరణందుల అనిత సొంత అన్నాచెల్లెళ్లు. రితిక్, జతిన్ తల్లిదండ్రులతో కలిసి దసరా పండుగకు ఎంచగూడెంకు వచ్చారు.

తల్లిదండ్రులు పండుగ తరువాత తిరిగి వెళ్లగా శనివారం రితిక్, జతిన్‌లను గ్రామంలోనే ఉన్నారు. సతీష్, అనితల తల్లి నర్సమ్మ రితిక్, జతిన్‌లను ఇంటివద్ద ఉంచి అశోక్‌నగర్‌కు పనిమీద వెళ్లింది. తిరిగి ఎంచగూడెం వచ్చిన ఆమె ఇంటివద్ద రితిక్, జతిన్‌లు కనిపించకపోవడంతో గ్రామస్తులతో కలిసి వెతకగా గ్రామ శివారులోని ఓ బావి వద్ద వారి దుస్తులు, చెప్పులు కనిపించాయి. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొత్తగూడ, గంగారం ఎస్సైలు రాజ్‌కుమార్, రవికుమార్ సంఘటనా స్థలంకు చేరుకుని ఈతగాళ్లతో బావిలో గాలించారు. రితిక్, జతిన్ మృతదేహాలను బయటికి తీశారు. బహిర్భూమికి వెళ్లి చిన్నారులు ప్రమాద వశాత్తు బావిలోపడి మృతి చెందినట్టు భావిస్తున్నారు. ఇద్దరు చిన్నారులు మృతిచెందటంతో కుటుంబసభ్యుల రోధనలు మిన్నంటాయి.



ఎంచగూడెంలో చిన్నారుల మృతదేహాల వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీల ఎన్నిక

వరంగల్, హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శుల ఏకగ్రీవం



కృష్ణ



ప్రకాశ్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కొత్తవాడలోని ఇన్నర్‌వీల్ క్లబ్ లో మొదటి వరంగల్ జిల్లా మహాసభ అనంతరం జిల్లా కమిటీని ప్రకటించారు. సీపీఎం జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగారపు బాబురావు అధ్యక్షతన కమిటీని ప్రకటించారు. వరంగల్ అధ్యక్షుడిగా సింగారపు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జన్ను ప్రకాశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓరుగంటి జీవన్‌కుమార్, కోశాధికారిగా పత్తిపాక వినయ్, ఉపాధ్యక్షులుగా ఆర్.సాంబయ్య, బొజ్జ రాజు, మైదం అశోక్, సహాయ కార్యదర్శులుగా జక్కిడి రామకృష్ణ, వి.కోమల, సునంద, శ్యాంతోపాటు మరో 36మందితో కూడిన కమిటీని నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు.



కోటి



మహేష్

అలాగే హనుమకొండ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ సంఘం ఎన్నికలు రాంనగర్ లోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. శనివారం సీఐటీయూ జిల్లా రెండో మహాసభ అనంతరం హనుమకొండ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు.

అధ్యక్షుడిగా రొండాల కోటి, ప్రధాన కార్యదర్శిగా బరుపట్ల మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉప్పలయ్య, కోశాధికారిగా యాస బాబు, గౌరవ సలహాదారులుగా పుల్ల అశోక్‌తోపాటు మరో 42 మందిని ఎంపిక చేశారు. ఈ కమిటీలు మునిసిపల్ సిబ్బంది హక్కుల కోసం పని చేయాలని రాష్ట్ర, జిల్లా నాయకులు నూతన కమిటీలను ఆదేశించారు.

సుమతిరెడ్డిలో ప్రాంగణ నియామకాలు

హసన్‌పర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సిగ్నోవాక్స్ టెక్నాలజీస్ సంస్థ వారు ఆఫ్ క్యాంపస్ ఉద్యోగ నియామక డ్రైవ్‌ను ఈనెల 10వ తేదీన విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజ్యశ్రీరెడ్డి తెలిపారు. 2025లో ఉత్తీర్ణత పొందిన బీఈ/బీటెక్, ఎంసీఏ, బీసీఏ విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల, కిట్స్ వరంగల్, బిట్స్ నర్సంపేట, వాగ్దేవి వర్ధమాన్, మల్లారెడ్డి, జాహ్నవి డిగ్రీ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకొని ప్రముఖ ఐటీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ టాస్క్ జిల్లా మేనేజర్ ఎం.రామక్రిష్ణన్, కళాశాల టీపీవో ఎం.మహేష్, ఎస్పీవోసీ జి.ప్రశాంత్, విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ ఇ.కుమారస్వామి, డాక్టర్ ఎస్.శ్రీవాణి, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ కె.శ్రీనివాస్, ఏవో వేణుగోపాలస్వామి అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రముఖ ఫొటోగ్రాఫర్ రామరాజు మృతి

శంభునిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రఫీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును పొందిన వరంగల్ శంభునిపేటకు చెందిన వనం రామరాజు (54) శనివారం కన్నుమూశారు. రెండేళ్ల క్రితం అనారోగ్యానికి గురైన రామరాజు.. అప్పటి నుంచి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందారు. రచయిత, అధ్యాపకుడు వనం మధుసూదన్-గంగమ్మ దంపతుల కుమారుడైన రామరాజు చిన్నతనం నుంచే పేయింటింగ్స్ చిత్రకళపై మక్కువ చూపేవారు. 35 ఏళ్ల క్రితం శంభునిపేటలో అజంతా పేరుతో స్టూడియో ఏర్పాటు చేసి అనేక మందికి శిక్షణ ఇచ్చి ఫొటోగ్రాఫర్‌లుగా తీర్చిదిద్దారు. సీరియల్స్‌తో పాటు పలు సినిమాలకు సైతం కెమెరామెన్‌గా పనిచేశారు. స్థానికుడు ఆడెపు రవిందర్ రూపొందించిన సీతాశ్రీరామ్ సినిమాకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించారు. ఫొటోగ్రఫీలో ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయనకు భార్య అరుణ, కూతురు దుర్గాప్రియ, కుమారుడు సాయిగుణ ఉన్నారు.



రామరాజు (ఫైల్)

రామరాజు భౌతికకాయానికి కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, శంభునిపేట పరపతి సంఘం, హనుమాన్ సేవాసమితి, పద్మశాలి పరపతి సంఘం బాధ్యులు, నివాళి అర్పించారు. ఆస్తులన్నీ అమ్ముకున్నా ప్రాణాలు దక్కించుకోలేకపోయామని కుటుంబసభ్యులు రోదించారు. శనివారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

ఆస్తులన్నీ అమ్ముకున్నారు..

రెండేళ్ళ క్రితం రామరాజుకు మెదడులో రక్తం గడ్డ కట్టిందని హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ వైద్యులు గొంతు నుంచి పైపు వేసి సరిచేశారు. అయితే చికిత్సలో తల, గొంతు అంతర్భాగంలో రెండు రంధ్రాలు పడ్డాయని, వాటిని గుర్తించకుండా వైద్యులు చికిత్స ముగించి పంపించారని కుటుంబసభ్యులు తెలిపారు. కొన్ని రోజుల్లోనే మళ్లీ అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రికి తీసుకెళ్తే వైద్యుల నిర్లక్ష్యం బయటపడిందన్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగామని, అయినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. కాగా, రామరాజు భార్య అరుణ ఏఎస్ఎమ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసేవారు. భర్త చికిత్స కోసం ఆమె ఉద్యోగాన్ని సైతం వదిలేశారు. ఆస్తులన్నీ అమ్మి భర్తను కాపాడుకునేందుకు ప్రయత్నించారు.



భీముని పాదం.. పర్యాటక వినోదం

» పచ్చని అడవిలో కొలువైన అందాల జలపాతం
» ఏటేటా పెరుగుతున్న పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి, గూడూరు)

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగారం శివారు కొమ్ములవంచ పరిధిలోని దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం రెండు దశాబ్దాల కాలంలో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. సందర్శకుల తాకిడి క్రమంగా పెరిగింది. అక్కడ సౌకర్యాలు ఏర్పాటు దిశగా అటవీశాఖ దృష్టిసారించింది. సెలవు దినాల్లో.. వర్షాకాలంలో ఉధృతంగా జలపాతం దూకి పడే సమయంలో పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడం, పొద్దంతా అక్కడ ఆనందంగా గడుపుతారు.

గూడూరు అభయారణ్యంలోని వన్యప్రాణి విభాగం పరిధిలో ఉన్న ఈ భీమునిపాదం కోసం అటవీశాఖ పలు అభివృద్ధి పనులు చేపట్టింది.. పదేళ్ల క్రితమే భీమునిపాదం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అప్పటి ప్రభుత్వంలో లోటస్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల ఏర్పాటు కోసం సర్వే నిర్వహించారు. ఆ తర్వాత స్థానిక అటవీ అధికారులు రూ.2.80 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించారు. ఈ క్రమంలో గత సంవత్సరం గూడూరు అటవీశాఖ ఆధ్వర్యంలో పలు నిర్మాణ పనులు చేపట్టారు. భీమునిపాదం జలపాతం వద్దకు వెళ్లే దారిలో ఆకర్షనీయంగా ఆర్చి ఏర్పాటు చేశారు. జలపాతం సమీపంలో సందర్శకుల సౌకర్యం కోసం మూడు షెడ్లు, టాయిలెట్స్ నిర్మించారు. కనువిందు చేసే జలపాతంను సందర్శకులు కనులారా తిలకించేందుకు ఒక పగోడ (వాచ్‌టవర్) కూడ నిర్మించారు. తాగునీటి సౌకర్యం కోసం నల్లాలు ఏర్పాటు చేసినప్పటికి వాటిని వినియోగంలోకి తెచ్చే దశలో కొన్ని పనులు మిగిలిపోయినట్లు తెలిసింది. ఇప్పటి వరకు రూ.54 లక్షలు ఈ పనుల కోసం వెచ్చించిన అధికారులు భవిష్యత్‌లో మరెన్నో పనులు చేపట్టే దిశగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ముందుగా అందజేసిన ప్రణాళిక ప్రకారం.. జలపాతం ప్రాంతంలో సందర్శకుల వినోదం కోసం ఒక బటర్‌ఫ్లై పార్కు, చిన్న పిల్లల కోసం స్విమ్మింగ్ పూల్, జలపాతం పైభాగంలో కూడ ఒక వాచ్‌టవర్ నిర్మాణం, సందర్శకులు కూర్చుని సేద తీరేందుకు కుర్చీలు, బెంచీలు ఏర్పాటు దిశగా దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. అయితే చేసిన పనుల బిల్లుల చెల్లింపులో చోటు చేసుకుంటున్న జాప్యం కారణంగా ఈ పనులు చేపట్టేందుకు స్థానిక అటవీ అధికారులు కొంతమేర వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. మరోపక్క స్వచ్ఛ్ భీమునిపాదం పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా అవగాహన కల్పిస్తున్నారు.


భీమునిపాదం గుట్టలను కమ్మేసిన మేఘాలు

ఎకో డెవలప్‌మెంట్ కమిటీ

భీమునిపాదం జలపాతం వద్ద సందర్శకుల సౌకర్యం కొరకు పెద్దమొత్తంలో వెచ్చించిన అటవీశాఖ నిర్వహణ దిశగా అడుగులు వేసింది. ఈ మేరకు ఎకో డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను వారికి అప్పగించింది. ఇందులో అదే గ్రామానికి చెందిన వ్యక్తులు చైర్మన్, వైస్ చైర్మన్‌గా బీట్ అధికారి పర్యవేక్షకుడిగా నియమించారు. జలపాతం వద్దకు వచ్చే సందర్శకుల నుంచి రుసుము రూపంలో వసూలు చేసే మొత్తాన్ని నిర్వహణ వ్యయం కొరకు ఏడీసీ ఆధ్వర్యంలో వెచ్చిస్తున్నారు. అక్కడ పనుల నిర్వహణ కొరకు ఆరుగురు వాచ్‌మెన్‌లను నియమించి ఏడీసీ ద్వారానే వారికి వేతనాలు చెల్లిస్తున్నారు.

వర్షాకాలం ఆరంభం తర్వాత నాలుగు నెలల పాటు సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతున్నట్లు తెలిసింది. సందర్శకులకు ఒక్కొక్కరికి రూ.40 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారు. ఆర్చి లోపలికి.. జలపాతం సమీపం వద్దకు వాహనాలను అనుమతించేందుకు రుసుము వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనంకు రూ.20, త్రీ వీలర్‌కు రూ.50, ఫోర్ వీలర్స్‌కు రూ.100, సిక్స్ వీలర్స్‌కు రూ.200 చొప్పున నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న ఈ ప్రాంతానికి రెండు వైపుల నుంచి వచ్చే రోడ్డుమార్గం మాత్రం గుంతలమయంతో అధ్వానంగా ఉండడంతో పర్యాటకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్చి నుంచి జలపాతం వరకు కూడ కంకర రోడ్డును బీటీరోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు భీముని పాదం వద్దకు వెళ్లే రెండు వైపుల ఉన్న రోడ్లను మరమ్మతులు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

భీముని పాదంకు అరుదైన గుర్తింపు
బి.సురేష్, రేంజ్ అధికారి, గూడూరు



తెలంగాణ రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లాలోని భీమునిపాదం జలపాతానికి అరుదైన గుర్తింపు ఉంది. జీవవైవిధ్యానికి నెలువుగా బాసిల్లుతుంది. అటవీశాఖ ఉన్నతాధికారులు సైతం సందర్శించి వెరీగుడ్ అని కితాబునిచ్చారు. స్వచ్ఛ్ భీమునిపాదం పేరుతో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. నిధుల కోసం నివేదికలను అధికారులకు సమర్పించాం. నిధులు రాగానే అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం.

చేరుకునేది ఇలా..

భీముని పాదం జలపాతంకు వెళ్లేందుకు వరంగల్ నగరానికి 52 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గూడూరు నుంచి 9 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి చేరుకోవడానికి మూడు మార్గాలు ఉన్నాయి. నర్సంపేట నుంచి భూపతిపేట బస్టాండ్.... సీతానాగారం... కొమ్ములవంచ మీదుగా వెళ్లవచ్చు. గూడూరు నుంచి చంద్రుగూడెం... లైన్‌తండ... వంపుతండ... మీదుగా భీమునిపాదంకు చేరుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వెళ్లాలనుకునే వారు ఇల్లందు... కొత్తగూడ మండలం బత్తులపల్లి... గోపాలపురం నుంచి భీముని పాదంకు చేరుకోవచ్చు.



భీమునిపాదానికి వెళ్లే ప్రధాన ద్వారం


భీమునిపాదం వద్ద నిర్మించిన కాటేజ్‌లు

బాక్సింగ్ రింగు అందించడానికి కృషి

» 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి
» సందడిగా రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ బాక్సింగ్ పోటీలు
» రెండు రోజుల పాటు క్రీడలు, హాజరైన 180 బాక్సర్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాక్సర్లకు అనువుగా ఉండే అధునాతన సౌకర్యాలు కలిగిన బాక్సింగ్ రింగు అందించడానికి కృషి చేస్తానని కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-17 ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్ పోటీలను కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. అంతర్జాతీస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు స్వతహాగా ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహిస్తానని వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి వి.ప్రశాంత్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న అండర్-17 బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 80మంది బాలికలు, 100మంది బాలురు, 30మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు, కోచ్‌లకు, మేనేజర్లకు భోజన వసతితో పాటు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలు, నగరంలోని పలు హోటల్‌ల్లో బస సౌకర్యం కల్పించామన్నారు.


రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 ఆధ్వర్యంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ఆర్మీ జవాన్ రాజీని కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డితో పాటు నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీవైఎస్‌వో రఘు, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్, సీఐ కాశీరాం, ఇండియా బాక్సింగ్ కోచ్ ఆనంది భాస్కర్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి మంచాల స్వామి చరణ్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్‌ఏపీఈ)లు ఎస్.పార్థసారధి, కె.మల్లారెడ్డి, వివిధ జిల్లాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పంట రక్షణకు ఎలుగుబంటి వేషధారణ

తొర్రూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కోతుల బారి నుండి తన పంటను రక్షించుకోవడానికి వినూత్నమార్గం ఎంచుకున్నాడు ఓ రైతు. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన సిరబోయిన శ్రీను అనే రైతుకు చెందిన 8 ఎకరాల పత్తి, 2 ఎకరాల వరి పంటలో కోతులు పడి ధ్వంసం చేస్తున్నాయి. వాటిని రోజు గుల్లేరు, వడిసెలతో తరివేస్తుండగా మనుషుల మీదకి వచ్చి గాయపరుస్తున్నాయి. దీంతో కోతులను తరిమేసి పంటను రక్షించుకోవడానికి రూ.2వేలతో ఎలుగుబంటి దుస్తులను ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకున్నాడు. ఎలుగుబంటి డ్రెస్ వేసుకొని తొర్రూరు-మహబూబాబాద్ రహదారి వెంట సంచరిస్తుండటంతో కోతులు పారిపోతున్నాయని శ్రీను తెలిపాడు. రహదారి వెంట వెళ్లే వాహనదారులు, గ్రామస్థులు శ్రీను ప్రయత్నాన్ని ఆసక్తిగా చూస్తూ అభినందిస్తున్నారు.


ఎలుగుబంటి వేషధారణలో రైతు శ్రీను

అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థగా ఎస్సార్‌యూకు గుర్తింపు

• ది వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో చోటు
• అమెరికా తర్వాత భారత్‌కు రెండో స్థానం
• గ్లోబల్ జాబితాలో ఎస్సార్‌యూ భారతదేశంలో టాప్-28
• ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 10వ స్థానం
• ఎస్సార్‌యూ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థగా ఎస్సార్ విశ్వవిద్యాలయం గుర్తింపు పొందినట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్‌లో గల ఎస్సార్ విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా ఎస్సార్ విశ్వవిద్యాలయానికి ప్రపంచ ప్రఖ్యాత టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026లో 801-1000 బ్యాండ్లో స్థానం సంపాదించిందని తెలిపారు. భారతదేశంలోనే అనతి కాలంలో తొలి అంతర్జాతీయ ర్యాంకింగ్ విజయంగా ఎస్సార్‌యూ నిలిచిందన్నారు. ఈ గ్లోబల్ ర్యాంకింగ్‌లో చోటు దక్కిన ఏకైక విశ్వవిద్యాలయంగా ఎస్సార్‌యూ గుర్తింపు పొందడం హర్షనీయమన్నారు. దేశంలోనే అతి తక్కువ వ్యవధిలో న్యాక్ అక్రిడిటేషన్ పొందిన విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందన్నారు. ది ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ ర్యాంకింగ్స్ 2025లో ప్రపంచ స్థాయిలో 401-500 బ్యాండ్, భారతదేశంలో 65 యూనివర్సిటీలలో ఒకటన్నారు. ఇటీవల వెలువడిన ఎన్‌ఐఆర్‌ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లో కూడా ఎస్సార్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో 91వ స్థానం, విశ్వవిద్యాలయం విభాగంలో 101-105 బ్యాండ్‌లో నిలిచిందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఈ స్థిరమైన ప్రదర్శన, విద్యా ప్రామాణికత, పరిశోధనా నూతనత, నాణ్యమైన బోధన పట్ల ఎస్సార్‌యూ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) ర్యాంకింగ్స్ ప్రపంచ వ్యాప్తంగా విశ్వవిద్యాలయ ప్రదర్శనను అంచనా వేయడానికి అత్యంత విశ్వసనీయమైన ప్రమాణాలుగా పరిగణించబడుతాయని తెలిపారు. బోధన, పరిశోధన, సైటేషన్స్, అంతర్జాతీయ దృష్టి కోణం, ఇండస్ట్రీ ఇన్‌కం వంటి ఐదు ప్రధాన విభాగాల ఆధారంగా 17 సూచికల ద్వారా ఈ ర్యాంకింగ్స్ ప్రకటించబడుతాయన్నారు. 2026 ఎడిషన్ జెడ్డా, సౌదీ అరేబియాలో జరిగిన వరల్డ్ అకడమిక్ సమ్మిట్‌లో విడుదలైందని ఎ.వరదారెడ్డి తెలిపారు. అమెరికా తర్వాత అత్యధిక విశ్వవిద్యాలయాలు ర్యాంక్ పొందిన దేశంగా భారత్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈ జాబితాలో ఎస్సార్ యూనివర్సిటీ భారతదేశంలో టాప్-28, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 10వ స్థానం, తెలంగాణలో టాప్ 100లో చోటు దక్కిన ఏకైక ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్‌యూ నిలిచిందన్నారు. ఎస్సార్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ ఈ ర్యాంకి ంగ్ ఎస్సార్‌యూ యొక్క బలమైన విద్యా ప్రాతిపదిక, అంతర్జాతీయ దృష్టి కోణానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో ఎస్సార్‌యూ ప్రో వైస్ చాన్సలర్ వి.మహేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి.రమణరావు, గ్రోత్ ఆపరేషన్స్ డీన్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వరదారెడ్డి

నేడు సాహిత్య ఆవిష్కరణల సందడి

- 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకం..

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు నాగబెల్లి జితేందర్ రచించిన 'ఆరెపల్లి మట్టిబిడ్డలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని కన్వీనర్ రాకేష్‌ఖాను, కోకన్వీనర్ రఘువీర్ తెలిపారు. హనుమకొండ ఆరెపల్లి గ్రామంలోని సరళి అభ్యసన కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పుస్తకాన్ని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్-సుధ దంపతులకు అంకితమిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సాహితీ, కళాభిమానులు, జర్నలిస్టులు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జితేందర్, దినేష్, గోపాల్, రవీందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌కో సమగ్ర సాహిత్యం..

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కడవెండి ముద్దుబిడ్డ, ఉద్యమ చరిత్రలో చెరిగిపోని ముద్ర వేసిన గుముడవెల్లి రేణుక (మిడ్ కో) సమగ్ర సాహిత్యం ఆవిష్కరణోత్సవ సభ హనుమకొండలోని హరిత కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ పక్షాన ఆస్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, గోరటి అరుణ, రమక్క, ఆస్నాల విమల, శాకమూరి రవి, డాక్టర్ ఏరుకొండ నర్సింహుడు తదితర ప్రముఖులు పాల్గొంటారు.

పుంజుతోక కవితా సంకలనం..

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియం వేదికగా విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రాసిన పుంజుతోక కవితా సంకలన ఆవిష్కరణ ఆదివారం ఉదయం జరగనుంది. ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆవిష్కరిస్తారు. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్య దర్శి వీఆర్.విద్యార్థి, ఆచార్య బన్న అయిలయ్య, మల్యాల మనోహర్‌రావు తదితర సాహితీ ప్రముఖులు పాల్గొంటారు.

ఈ నెల 14 నుంచి పలు రైళ్లు రద్దు

- మరికొన్ని దారి మళ్లింపు

డోర్నకల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ జంక్షన్-పాపటపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య ఉన్న మూడోలైన్ అనుసంధానిస్తూ ఉన్న డోర్నకల్ బైపాస్‌లైన్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనులు ప్రారంభం కానున్ననేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 18 వరకు ఆ సెక్షన్‌లో డోర్నకల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రైలు నెంబర్ 67765 కాజీపేట -డోర్నకల్, (67766) డోర్నకల్- కాజీపేట ప్యాసింజర్ రైలు, (67767) డోర్నకల్-విజయవాడ, (67768) విజయవాడ-డోర్నకల్ ప్యాసింజర్, (67216) భద్రాచలంరోడ్-విజయవాడ, (67215) విజయవాడ-భద్రాచలం రోడ్, (12705) గుంటూరు-సికింద్రాబాద్, (12706) సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, (12713) విజయవాడ-సికింద్రాబాద్, (12714) శాతవాహనలను రద్దు చేశారు. గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201/02)ను కాజీపేట-గుంటూరు స్టేషన్‌ల మధ్య పాక్షికంగా రద్దు చేశారు. (17406) ఆదిలాబాద్-తిరుపతి కృష్ణఎక్స్‌ప్రెస్, 13, 16, 17 తేదీల్లో గంటన్నర పాటు ఆలస్యంగా, (20833) విశాఖపట్టణం- సికింద్రాబాద్, (20834) సికింద్రాబాద్-విశాఖపట్టణం 15,16,18 తేదీల్లో 75 నిమిషాల పాటు ఆలస్యంగా బయలుదేరుతుంది. అదే విధంగా (22849) షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను, (17205) సాయినగర్ షిర్డీ-కాకినాడ పోర్టు రైలును 16న విజయవాడ-గుంటూరు, పగిడపల్లి మీదుగా, కాకినాడ పోర్టు -సాయినగర్ ఎక్స్‌ప్రెస్(17206)ను పోర్టులను విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి స్టేషన్‌ల మీదుగా దారి మళ్లించారు. (11019) సీఎస్‌టీ ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను 16, 17 తేదీల్లో సికింద్రాబాద్ పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా(11020) భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను 17, 18 తేదీల్లో సికింద్రాబాద్, పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా దారి మళ్లింపు, (18045) షాలిమార్-చర్లపల్లి 16,17 తేదీల్లో సికింద్రాబాద్ పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా, (18046) చర్లపల్లి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌ను 17, 18 తేదీల్లో పెగిడపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు రైల్వే శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

నల్లబెల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపురం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శోభన్‌బాబును సస్పెండ్ చేసినట్లు నర్సంపేట ఎఫ్ఆర్వో రవి కిరణ్ తెలిపారు. శోభన్‌బాబు పోడు రైతులతో కుమ్మక్కై వారి వద్ద డబ్బులు తీసుకొని అడవిలోని చెట్లను నరికించారని ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో గోవిందాపురం బీట్ పరిధిలోని ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పోడు రైతులతో మాట్లాడామని తెలిపారు. బీట్ అధికారికి డబ్బులు ఇచ్చినట్టు పోడు రైతులు వాంగ్మూలం ఇచ్చారని వివరించారు. ఈ విషయమై జిల్లా ఫారెస్ట్ అధికారి డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్‌కు నివేదికను సమర్పించగా, ఆయన బీట్ అధికారి శోభన్‌బాబును సస్పెండ్ చేస్తూ జారీ చేశారని రవికిరణ్ తెలిపారు.

పనులు ఫుల్.. అలవెన్సులు నిల్..

» అదనపు ఖర్చుతో సతమతం అవుతున్న జిల్లా సైన్స్ అధికారులు
» పాఠాలు చెబుతూనే సైన్స్ కార్యక్రమాలు
» ప్రభుత్వం తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆవేదన
» రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి

భూపాలపల్లి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పాఠాలు బోధించాలి.. మరోవైపు సైన్స్ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలి.. దీంతో అధికారం లేని జిల్లా సైన్స్ అధికారులకు అధిక పనిభారం పడుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. వారు నిర్వహిస్తున్న అదనపు బాధ్యతలకు అదనపు వేతనాలు కానీ, అలవెన్సులు కానీ లేవు. ఏదైనా అత్యవసర కార్యక్రమం చేయాల్సి వస్తే తామే ఖర్చులు భరించుకోవాల్సి వస్తోందనే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అదే దుస్థితి దాపురించిందని చెబుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ఎంతో మంది ఉద్యోగులు, నిరుద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులైతే తమకు ప్రమోషన్లు వస్తాయని ఎంతో సంబురపడ్డారు. కానీ, అది ఎంతోకాలం నిలవలేదు. జిల్లా సైన్స్ అధికారుల పరిస్థితే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 33 మందిని జిల్లా సైన్స్ అధికా రులుగా అప్పటి ప్రభుత్వం సైన్స్ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ ప్రక్రియ రాష్ట్ర విభజన జరిగి జిల్లాలుగా ఏర్పడ్డ 2016 అక్టోబరు 11 నుంచి కొనసాగుతోంది. అయితే.. నాటి నుంచి వారి గురించి పట్టించుకున్న నాథులే లేకుండా పోయారు. 2017లో ఒకసారి సమగ్రశిక్షా ఆధ్వర్యంలో వీరికి రాత పరీక్ష కూడా నిర్వహించారు. కానీ ఎంపిక విధానంలో వారిపై సవతి ప్రేమే చూపించారు అప్పటి పాలకులు. దీంతో అప్పటి నుంచి వారికి ప్రమోషన్లు కానీ, పూర్తి బాధ్యతలు కానీ అప్పగించిన దాఖలాలు లేవు.


భూపాలపల్లిలో సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

విధులు.. విధానాలు..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతీ సైన్స్ కార్యక్రమాన్ని తూచా తప్పకుండా జిల్లా సైన్స్ అధికారులు చేయాల్సిందే. కానీ వారికి పూర్తి బాధ్యతలు అప్పగించలేదు. అయితే ఈ సైన్స్ అధికారులు జిల్లాల్లో నిర్వహించే సెమినార్లకు, డ్రామా కండక్ట్, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాలు, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్, ఇన్స్‌పెయిర్‌మనక్, ఎగ్జిబిషన్లు తదితర వాటితో పాటు నేషనల్ గ్రీన్ కోర్‌కు సంబంధించిన కార్యక్రమాలు కూడా చేయాల్సి ఉంటుంది. ఇవి సంవత్సరం పొడవునా కొనసాగుతాయని తెలిపారు. అయినా తమపై కనికరం లేదని చెబుతున్నారు.

అదనపు బాధ్యతలు

తాము ప్రతి సంవత్సరం కనీసం 50 నుంచి 60 సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అయినా తమపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని అంటున్నారు సైన్స్ అధికారులు. పైగా ఒకవైపు పాఠాలు బోధించుకుంటూనే మరోవైపు సైన్స్‌ఫెయిర్‌లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశిస్తోందని అంటున్నారు. కానీ తమకు ఎంత పనిభారం పడుతుందో అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతలు అదనంగా ఉన్నా వేతనం మాత్రం అదనంగా ఇవ్వడం లేదని అంటున్నారు. పైగా ఏదైనా అత్యవసర సమయాల్లో సైన్స్ కార్యక్రమాలు చేయాల్సి వస్తే దానికి తామే సొంత ఖర్చులు భరించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.


అంతా ఇన్‌చార్జిలే..

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పనిచేసే జిల్లా సైన్స్ అధికారులంతా ఇన్‌చార్జిలే కావడం గమనార్హం. పైగా కొంతమంది వారు పనిచేస్తున్న పాఠశాల్లో పాఠాలు బోధిస్తూనే మరోవైపు సైన్స్ కార్యక్రమాలు నిర్వహించే దుస్థితి దాపురించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర శిక్షలో ఒక్కో జిల్లాలో ఐదుగురు నుంచి ఆరుగురు చొప్పున సెక్టోరియల్ అధికారులను పూర్తిస్థాయిలో నియమించుకున్న ఉన్నతాధికారులు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు జాబ్ క్యాలెండర్ లేదని, సైన్స్ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన ఫండ్ ఏమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా అటల్ టింకరింగ్ ల్యాబరేటరీస్‌పై కూడా పర్యవేక్షించాలనే ఆదేశాలు కూడా జారీ అయ్యాయని తెలుపుతున్నారు.

పూర్తి బాధ్యతలు అప్పగించాలి
- బర్ల స్వామి, ఇన్‌చార్జి జిల్లా సైన్స్ అధికారి



సైన్స్ రంగంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు వంద శాతం పని చేస్తున్నాం. మా శ్రమకు తగిన గుర్తింపు దక్కాలని కోరుతున్నాం. మాకు పూర్తి అధికారాలు అప్పగించాలి. ఒకవైపు పాఠాలు, మరోవైపు కార్యక్రమాలు నిర్వహిం చడం వల్ల అసంతృప్తికి గురవుతున్నాం. అదనపు బాధ్యతలతో అదనపు వేదనకు లోనవుతున్నాం. మా ఈ సమస్యపై దృష్టిసారించాలి.



కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజుయాదవ్

మడికొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మడికొండకు చెందిన తొట్ల రాజు యాదవ్‌ను నియమించినట్లు ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం రాజు యాదవ్‌కు నియామక పత్రం అందజేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజు యాదవ్ చేసిన సేవలకు గుర్తింపుగా ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు శ్రీకాంత్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాసులకు రాజు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీకాంత్‌గౌడ్‌కు బొకే ఇస్తున్న రాజు యాదవ్



షేక్ మహమూద్‌ను అభినందిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్ కుమార్

షేక్ మహమూద్‌కు జాతీయ స్థాయి అవార్డు

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఫర్ ఆర్టిస్టు అండ్ యాక్టివిటిస్టు(నీఫా) వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ మహమూద్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. తన సంస్థ నీఫాతో దశాబ్ద కాలంగా వివిధ సాంఘిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురి మన్నన, ఆదరాభిమానాలను అందుకున్నారు. ఇందుకు గాను న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన నీఫా 25ఏళ్ల సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా యంగ్ కమ్యూనిటీ చాంపియన్‌షిప్ అవార్డును షేక్ మహమూద్ ప్రముఖుల చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, నీఫా స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కన్నమనేని యాదవరాజు, ప్రధాన కార్యదర్శి కోలగాని శ్రీనివాసరావు తదితరులు షేక్ మహమూద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.

గ్రూప్-1 అధికారి మేఘకు సన్మానం



మేఘను సన్మానిస్తున్న మాజీ సైనిక అధికారులు

హసన్‌పర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రూప్-1 ఉద్యోగం సాధించిన భీమారానికి చెందిన శీలం మేఘను మాజీ సైనికాధికారులు శనివారం ఘనంగా సన్మానించి అభినందించారు. భీమారంలోని మేఘ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేఘ తండ్రి మిలిటరీ అధికారి రఘువీర్, మాజీ మిలిటరీ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ప్రభాకర్, ఆదిశేషులు, స్వామి, నారాయణ్, కృష్ణమూర్తి, రవికుమార్, మహేందర్, జితేంద్రకుమార్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు భగవాన్‌దాస్ 22వ వర్ధంతి

హనుమకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దళిత, బహుజనులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు చేసిన దివంగత బీఆర్ భగవాన్‌దాస్ 22వ వర్ధంతి నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు జరగనుంది. పలువురు నేతలు హనుమకొండ అశోక జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమానికి సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షత వహిస్తారు.

తూర్పు చెరువును కబ్జా నుంచి కాపాడాలి

ఆక్రమణ స్థలాన్ని పరిశీలించిన గ్రామస్థులు

హసన్‌పర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి దేవన్నపేట తూర్పు చెరువును కబ్జా నుంచి కాపాడాలని గ్రామస్థులు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. శనివారం దేవన్నపేటలోని తూర్పు చెరువు మత్తడి ప్రాంతంలో కబ్జాకు గురైన స్థలాన్ని గ్రామస్థులు పరిశీలించారు. గ్రామ శివారులోని తూర్పు చెరువును కొంత మంది వ్యక్తులు జేసీబీతో మత్తడిని తొలగించి చదును చేసినట్లు తెలిపారు. దీంతో చెరువు కుంచించుకు పోవడమే కాకుండా చెరువు వృథాగా పోయి నీటిమట్టం తగ్గి భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల విలువ చేసే చెరువు శిఖం భూములను అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా తాగునీటి నిల్వలు లేకుండా, వేసవి కాలంలో పశువులకు తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. కబ్జాకు పాల్పడుతున్న వారితో పాటు వారి వెనక ఉన్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా చెరువు విస్తీర్ణం తెలిపే హద్దురాళ్లను ఏర్పాటు చేసి చెరువు మత్తడి పునరుద్ధరణకు సత్వర చర్యలు తీసుకొని కబ్జా స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కుందూరు గోపాల్‌రెడ్డి

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, అన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. పీఆర్సీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఖాజానయీముద్దీన్, కోశాధికారి పి.విద్యాసాగర్, హనుమకొండ యూనిట్ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుల సంజీవరెడ్డి, జిల్లా నాయకులు సుభాష్ చంద్రబోస్, పి.సరళ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మడికొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మడికొండ ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన మిర్యాల రమేష్-యశోద దంపతుల కుమారుడు లక్కీ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల నగదుతో పాటు క్వింటాల్ బియ్యాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పులి దేవేందర్ ముదిరాజ్, టీపీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ బాధ్యులు బోనాల రమేష్, నీరటి రాజు, రావులకారు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రజల సొమ్ము.. పాలకుల పాలు



హనుమకొండ సుభాష్‌కాలనీలో స్తంభాన్ని వదిలివేసి డ్రెయినేజీ నిర్మాణం

- **నగరంలో నాణ్యతాలోపంతో అభివృద్ధి పనులు**
- ఒక్కో డివిజన్‌కు కేటాయించిన రూ.50 లక్షలు స్వాహా
- రోడ్డు వెడల్పు పేరుతో నిధుల దుర్వినియోగం
- విద్యుత్ స్తంభాలను తొలగించకముందే సీసీ రోడ్ల పనులు
- కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారుల ఇష్టారాజ్యం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్‌లలో యుద్ధప్రాతిపదికన జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తోంది. 66 డివిజన్‌లలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం అస్తవ్యస్తంగా జరుగుతోంది. కొన్ని చోట్ల రోడ్ల వెడల్పు పేరుతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. అడ్డదారిలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. అధికారుల అండదండలతో జేబులు నింపుకుంటున్నారు.

మూడు నెలల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతీ డివిజన్‌కు రూ.50లక్షల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లు.. నిధులను ఎవరికి వారే ఇష్టం వచ్చినట్టు ఖర్చు చేస్తూ బల్దియా ఆదాయానికి గండికొడుతున్నారు. దీంతో రూ.33కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్టు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, నగరంలోని కొన్ని కాలనీల్లో రోడ్లు వేయాల్సిన ప్రదేశాల్లో వేయకుండా ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లకు కావలసిన వారి ఇళ్ల పరిసర ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

స్తంభాలను వదిలేస్తూ...

డివిజన్‌లలో 69 చోట్ల రోడ్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు, 28 చోట్ల రోడ్ల మధ్యలో చేతిపంపులు (బోరింగులు) వదిలేసి పనులు చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు వేసే ముందు ఆయా ప్రాంతాల్లో రోడ్ల మధ్యలో ఉన్న స్తంభాలు, బోరింగులు, అక్రమ కట్టడాలను తొలగించిన తర్వాత పనులు చేపట్టాలి. కానీ చాలామంది కాంట్రాక్టర్లు అందుకు విరుద్ధంగా పనులు జరుపుతుండడంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. ఇక రాత్రి వేళలో వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అంతా గప్‌చుప్..

ప్రస్తుతం డివిజన్‌ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లకు, ఇంజనీరింగ్ అధికారులకు మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. దీంతోనే సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులవైపు ఎవ్వరూ కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏఈల వద్ద ఉండే అసిస్టెంట్లు, కాంట్రాక్టర్ల వద్ద పనిచేసే సూపర్‌వైజర్లు మాత్రమే ఈ పనులకు అన్నీ తామై ముందుండి జరిపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక ఈ పనులను పర్యవేక్షించాల్సిన కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంతోపాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పనులపై పాలకవర్గం పెద్దలు సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కార్పొరేటర్లు, బల్దియా అధికారులు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ పర్యటన తర్వాత అందరూ ఒక్కటిగా కాంప్రమైజ్ పనులు చేస్తున్నట్టు తెలిసింది. కొందరు కార్పొరేటర్లకు టూర్‌లోనే దసరా కానుకలు ముట్టజెప్పడంతో పనులపై కిక్కురుమనకుండా ఉన్నట్టు సమాచారం. అయితే ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులతో డివిజన్‌లలో చేస్తున్న పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పోచమ్మకుంటలో రోడ్డు మధ్యలో వదిలేసిన కరెంటు పోల్



శాకరాసికుంటలో రోడ్డు మధ్యలో వదిలేసిన చేతిపంపు

రాష్ట్రంలో దోపిడీ పాలన

సీఐటీయూ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలన కరువై దోపిడీ పాలన కొనసాగుతోందని సీఐటీయూ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎండబ్ల్యూఈయూ) మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీ రాష్ట్రంలో మునిసిపల్ కార్మికులకు నెలకు వేతనం రూ.24,500 అందిస్తుండగా రాష్ట్రంలో మాత్రం రూ.16600 అందిస్తూ కార్మికుల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆటలాడుకుంటున్నాడని సుధాకర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే మునిసిపల్ కార్మికులకు రూ.26వేల వేతనం అందించడంతో పాటు దినసరి వేతనాలు చేసే కార్మికులను పర్మినెంట్ చేస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా నేటికీ అది అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మునిసిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించక తప్పదని ఆయన హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిసిపల్ కార్మికులకు అన్యాయం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, కోటేశ్వర్, బరుపట్ల మహేష్, మల్లయ్య, పుల్లా అశోక్, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకుడు ప్రశాంత్

సమాచార హక్కు చట్టానికి జీవం పోయాలి

లోక్‌సత్తా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్

హనుమకొండ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సమాచార హక్కు చట్టం అమలు నీరుగారిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సమాచార హక్కు చట్టానికి జీవం పోయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ కోరారు. శనివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు హాల్‌లో సమాచారహక్కు చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టం అమలు కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, సమాచార కమిషనర్ల కృషిపై పలువురు మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ఆర్‌టీఐ కరీంనగర్ జిల్లా నాయకుడు గూడూరు స్వామిరెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర నాయకుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సామల శశిధర్‌రెడ్డి సమాచార హక్కు చట్టం ముసుగులో జరుగుతున్న అవినీతి అధికారుల అరాచకాలు, అక్రమాలపై వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోదండరామారావు, ప్రకాష్, చంద్రశేఖర్, చైతన్యరెడ్డి, కృష్ణమూర్తి, అమ్మ సురేందర్, ఎర్రం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో శనివారం 327కు అనుబంధ సంఘంగా కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్‌లకు రావాల్సిన గ్రేట్ పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌ను ఆర్టిజన్‌లకు వర్తింపజేయాలన్నారు. ఆర్టిజన్ సమస్యలపై ఇటీవలే హైదరాబాద్‌లో విద్యుత్ సంస్థల్లోని అన్ని యూనియన్‌లతో కలిసి జాక్ ఏర్పాటు చేశామని, దానిలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు డిస్కంలకు చైర్మన్‌లను ఎన్నుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో 327 కంపెనీ సెక్రెటరీ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జెన్కో యూనిట్ ప్రెసిడెంట్ మాధవరావు, స్టేట్ మహిళా కార్యదర్శి తులసిరెడ్డి, ధరావత్ సికిందర్, ఆర్టిజన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ సుంకు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

'ధన్ ధాన్య' ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ
జనగామ నుంచి పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే పల్లా



కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షిస్తున్న అధికారులు

జనగామ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధన్, ధాన్య కృషి యోజన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు, పాడి రైతులు, రైతు సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

ముగిసిన టీటీడీ ఆధ్యాత్మిక కార్యక్రమాలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో లష్కర్‌బజార్‌లోని ఆనంద ఆశ్రమంలో వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వ హించినట్లు టీటీడీ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం నుంచి తెన్నేటి వసుంధర లలితా సహస్ర నామాలపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులతో భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి కృష్ణమూర్తి, సీహెచ్. లక్ష్మీనారాయణ, కె.పద్మావతి, ఎన్.నాగమణి, ఎం. రాధిక, టి. భాస్కరాచార్య, భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ

జూలైవాడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తడి చెత్త, పొడి చెత్తను వేరే చేయడం ద్వారా రీసైకిల్ ప్రక్రియ ద్వారా జీవ దార ఎరువులు, గ్యాస్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని అలీపుర కాలనీలో ఇంటింటికి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులు దరిచేరవని కాలనీ వాసులకు కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జవాన్ సతీష్ కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వసంత మహేందర్‌రెడ్డి

బతుకమ్మ బండ భూమి వడ్డెపల్లి వాసులదే..

మహిళా సంఘాల డిమాండ్

వడ్డెపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ బండ భూమి వడ్డెపల్లి వాసులకే చెందాలని వడ్డెపల్లి మహిళా సంఘాల ప్రతినిధులు రమ, రమ్య, జ్యోతి, ఉమారాణి, కవిత డిమాండ్ చేశారు. హనుమకొండ వడ్డెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 690లో గల 33 గుంటల ప్రభుత్వ భూమి(బతుకమ్మ బండ) ఉంది. దీనిపై రియల్టర్లు కన్ను వేసి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ఉపక్రమించారు. వడ్డెపల్లి ప్రజల విజ్ఞప్తి మేరకు హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, మండల గిర్దావర్ దశరథ రామిరెడ్డి సర్వేయర్‌తో సర్వే చేయించి శుక్రవారం ప్రభుత్వ భూమి అనే బోర్డును ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని రియల్టర్లు పాతిన బోర్డును తొలగించారు. ఈ నేపథ్యంలో శనివారం వడ్డెపల్లి మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు బతుకమ్మ బండ భూమి వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని బతుకమ్మ బండ భూమి కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. తహసీల్దార్ ఏర్పాటు చేసిన బోర్డునే నామరూపాల్లేకుండా తొలగించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఈ ధర్నాలో వడ్డెపల్లి రైతులు కె.ప్రసాద్, రామకృష్ణ, సురేష్, యాకూబ్, రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ బండ వద్ద ధర్నా చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ఆదివారం



'నెయిల్ రింగ్స్'తో నైస్‌గా...



మహిళలు గోళ్లమీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు. గోళ్లను పొడవుగా పెంచి వాటిని చక్కగా షేప్ చేసి నెయిల్ పాలిష్ వేసుకుని మురిసిపోతుంటారు. ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అమితంగా ఇష్టపడే అమ్మాయిలు మాత్రం నెయిల్ ఆర్ట్‌తో సందడి చేస్తుంటారు. గోళ్లమీద రంగు రంగుల డిజైన్లు సృష్టిస్తూ వాటిమీద చిన్న చిన్న రాళ్లు, పూసలు అతికిస్తూ సరికొత్త పోకడలను అనుసరిస్తున్నారు యువతులు. ఈ క్రమంలోనే 'నెయిల్ రింగ్స్' ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. నెయిల్ ఆర్ట్ కంటే సౌలభ్యంగా ఉండడంతో మహిళలు



నేరుగా వీటిపై దృష్టి సారించడం మొదలుపెట్టారు. అన్ని వయసులవారిని అమితంగా ఆకర్షిస్తున్న ఈ 'నెయిల్ రింగ్స్' పై ఓ లుక్కేద్దామా...

ఇలా మొదలైంది...

నెయిల్ రింగ్ అనేది ఇప్పటికిప్పుడు కొత్తగా వచ్చిన ట్రెండ్ కాదంటున్నారు ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ ఈనా అహ్లువాలియా. పదిహేనేళ్ల క్రితం బ్రిటిష్ జ్యువెలరీ డిజైనర్ జాస్మిన్ అలెగ్జాండర్ వేలికి ఇలాంటి ఆభరణాన్ని చూశానన్నారు ఆమె. అసలు విషయం ఏమిటంటే... ఆభరణాలను రూపొందించే క్రమంలో ప్రమాదవశాత్తు తన వేలి గోరు భాగాన్ని కోల్పోయారు జాస్మిన్. ఆ లోటును భర్తీ చేసేందుకు ఆమె ప్రొస్థటిక్ మెటల్‌తో కృత్రిమ గోరును తయారుచేసుకుని ధరించారు. అప్పట్లో అది ఆమె ప్రత్యేక స్టయిల్‌గా పలువురిని ఆకట్టుకుంది. క్రమంగా దాన్నే కొంతమంది యాక్ససరీలా అనుసరించడం ప్రారంభించారు అంటూ చెప్పుకొచ్చారు ఈనా.

నెయిల్ రింగ్స్ అంటే..?

చేతి వేళ్లకు పెట్టుకున్నట్లే గోళ్లకూ పెట్టుకునే ఉంగరాలే 'నెయిల్ రింగ్స్'. గోరు మొత్తాన్ని కవర్ చేసేవి, గోరు మొదట్లో లేదా చివర్లో పెట్టుకునేవి, గోరు మధ్యలో అమర్చుకునేవి ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. బంగారం, వెండి, బ్లాక్ మెటల్‌తో తయారుచేసిన నెయిల్ రింగ్స్‌ను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పువ్వులు, ఆకులు, లతలు, నెమళ్లు, సీతాకోక చిలుకలు, హార్ట్, జ్యామెట్రీ ఆకారాలతోపాటు ఎన్నో విభిన్నమైన డిజైన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటి మీద చిన్న చిన్న నక్షత్రాలు, రంగురంగుల్లో మెరిసే రాళ్లు, స్వరోస్కి క్రిస్టల్స్ పొదిగి అందంగా రూపొందిస్తున్నారు. నెయిల్ రింగ్స్‌ను చేతి వేళ్లన్నింటికీ పెట్టుకోవచ్చు. లేదంటే ఒకటి లేదా రెండు వేళ్లకు అమర్చుకున్నా మంచి లుక్ వస్తుంది. అందుకే స్టయిలిష్ యాక్ససరీస్‌లో అగ్రస్థానంలో నిలుస్తున్నాయి 'నెయిల్ రింగ్స్'.

సెలబ్రిటీలు సైతం...

ప్రముఖ హీరోయిన్లతో సహా మోడల్స్, ఫ్యాషన్ మీద ఆసక్తి ఉన్న యువతులు ఈ



ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. సొనాలి బింద్రే, కృతి సనన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, హీనా ఖాన్, కరిష్మా తన్నాలు పలు ఈవెంట్లలో నెయిల్ రింగ్స్ ధరించి అందంగా మెరిశారు. చెవి దిద్దులు, జుంకాలు; వేళ్ల ఉంగరాలు; మెడలో నెక్లెస్ లేదా చోకర్‌కు మ్యాచ్ అయ్యేలా నెయిల్ రింగ్స్ ధరించి ఫొటోలకు ఫోజు లిచ్చారు. దీంతో యువతులంతా రకరకాల నెయిల్ రింగ్స్ కోసం నెట్టింట వెదకడం ప్రారంభించారు. అమామా, భవ్య రమేష్, మదిహా జైపూర్, యురుమ్మే, రిచా బైసా, ఆయేషా, ఓంత్, రాతెల్ అండ్ ఓల్ఫ్, యెప్రెమ్, హగో క్రైట్ లాంటి బ్రాండ్‌ల నుంచి నెయిల్ రింగ్స్ కొనుక్కోవచ్చు.



ఎంపిక ఎలా..?

విభిన్నమైన ఆధునిక స్టయిల్స్‌కి కొత్త బాష్యం చెబుతున్నాయి నెయిల్ రింగ్స్. డిజైనర్ వేర్, భారీ లెహంగాలతోపాటు అన్ని రకాల మోడరన్ డ్రెస్‌లమీద ఇవి చక్కగా సూటవుతాయి. కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లేటప్పుడు రోజువారీ ధరించడానికి సింపుల్ డిజైన్లలో; వివాహాది శుభ కార్యాలు, పార్టీల్లో ధరించడానికి భారీ డిజైన్లలో నెయిల్ రింగ్స్ లభ్యమవుతున్నాయి. నెయిల్ రింగ్స్ ధరించేటప్పుడు గోళ్లకు వేసుకోవాల్సిన నెయిల్ పాలిష్ రంగులను జాగ్రత్తగా ఎంచుకోవాలంటున్నారు ఫ్యాషన్ నిపుణులు. మెరిసే డిజైన్లతో గోల్డ్ షేడెడ్ నెయిల్ రింగ్స్ ధరించేటప్పుడు ముదురు రంగు నెయిల్ పాలిష్ వేసుకోవాలి. అదే సిల్వర్ షేడెడ్ నెయిల్ రింగ్స్ పెట్టుకునేటట్లయితే లేత రంగుల్లో మెరిసే నెయిల్ పాలిష్ వేసుకుంటే బాగుంటుంది.



సోషల్ మీడియాలో రీల్స్ చూసే వారందరికి 'నిహారిక ఎం' గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆమె అనేక మంది సెలబ్రిటీలతో చేసిన రీల్స్‌ను లక్షల మంది చూస్తూ ఉంటారు. ఇటీవల ఆమె సోషల్ మీడియా నుంచి సినిమాలలోకి కూడా ప్రవేశించింది. తాజాగా ఆమె నటించిన 'మిత్ర మండలి' అనే సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.



సండే సెలబ్రిటీ

కాలంతో మనం కూడా మారాలి!

'మిత్రమండలి' సినిమా షూటింగ్ అనుభవమేమిటి?

చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. డబ్బింగ్ కూడా పూర్తి చేసేశాను. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం నాకుంది. ప్రేక్షకులు నా నమ్మకాన్ని వమ్ము చేయరని ఆశిస్తున్నాను. నాత్మకంగా మన పాత్ర తక్కువగా ఉంటుంది. డైరక్టర్‌కు ఉన్న విజన్ ఆధారంగా సినిమా తీస్తారు. అంతే కాదు. నేను విధిని నమ్ముతాను. మనకు ఎంతో టాలెంట్ ఉండచ్చు. కానీ సరైన సమయానికి.. సరైన ప్రదేశంలో లేకపోతే ఫలితం ఉండదు.

అసలు మీ సోషల్ మీడియా ప్రయాణం ఎలా ప్రారంభమయింది?

నాకు 16 ఏళ్ల వయస్సులో యూట్యూబ్‌లో వీడియోలు పెట్టడం ప్రారంభించా. ఆ సమయంలో నేను కాలేజీలో చదివేదాన్ని. కాలేజీలో చదువు పూర్తయిన తర్వాత సరదాగా ఒక హాబీగా వీడియోలు చేసేదాన్ని. మొదటి నాలుగేళ్లు చాలా కష్టపడ్డా. ఆ సమయంలో యూట్యూబ్ నుంచి క్రియేటర్స్‌కు ఆదాయం వచ్చేది కాదు. అందువల్ల నాకు డబ్బులు వచ్చేవి కాదు. ఆ తర్వాత కోవిడ్ వచ్చింది. ఆ రెండేళ్లు వీడియోలు ఎక్కువగా చేయలేదు. ఆ తర్వాత మాస్టర్స్ చేయటానికి లాస్ఏంజలిస్ వెళ్లాను. ఆ సమయంలో వీడియోలు చేసేదాన్ని. ఆ తర్వాత ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్.. సినిమాలో హీరోయిన్- ఈ రెండు పాత్రల మధ్య తేడా ఏమిటి?

సోషల్ మీడియాలో ఒక పోస్ట్ వైరల్ కాకపోతే వేరే పోస్ట్ పెట్టుకుంటాం. కానీ సినిమా అలా కాదు. మనని నమ్మి సమయం, డబ్బు, శ్రమ అన్నీ పెడతారు. అనేక అంచనాలు ఉంటాయి. వీటన్నింటి వల్ల విపరీతైన ఒత్తిడి ఉంటుంది. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఉన్నప్పుడు అంతా ఒంటరి పోరాటమని చెప్పవచ్చు. కానీ సినిమా అనేది సామూహిక శ్రమ. అందువల్ల ఒత్తిడి ఎక్కువ.



ఈ రెండింటిలో ఏది ఎక్కువ శ్రమతో కూడుకున్నది?

రెండింటిలోను కష్టం ఉంది. సోషల్ మీడియాలో నా ప్లాట్‌ఫాంను నేనే స్వయంగా పైకి తీసుకువచ్చా. అక్కడ సృజనాత్మకంగా నేనే ఆలోచించేదాన్ని. నాకు నచ్చింది ప్రేక్షకులకు కూడా నచ్చేది. అదొక జర్నీ. అయితే సినిమాలో సృజ

సినిమాల్లోకి ఎందుకు వచ్చారు?

మార్పు అనేది అవసరం. కాలంతో పాటుగా మనం కూడా మారాలి. సోషల్ మీడియాలో ట్రెండ్స్ ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. మ్యాజిక్ ఒక సారి జరుగుతుంది. రెండు మూడు సార్లు ప్రయత్నిస్తే జరగవచ్చు. కానీ ప్రతి సారి మ్యాజిక్‌ను క్రియేట్ చేయలేం. అంతే కాకుండా నేను ఎంత కాలం ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఉంటాను? నాకు నటన అంటే ఇష్టం. అందుకే సినిమాల్లోకి వచ్చాను.

ఎన్ని ఆడిషన్స్‌కు వెళ్లారు? మీ అనుభవమేమిటి?

నేను చాలా ఆడిషన్స్‌కు వెళ్లాను. లుక్‌టెస్ట్‌లు చేయించుకున్నాను. నా ఉద్దేశంలో ఒక సినిమాకి ఇవి చాలా ముఖ్యం. ఎందుకంటే రకరకాల పాత్రల మధ్య కెమిస్ట్రీ కుదురుతోందా? టైమింగ్ ఎలా ఉంటోంది? ఒక ఫ్రేమ్‌లో అందరూ ఎలా ఉన్నారు? అనే విషయాలు ఆడిషన్లు, లుక్ టెస్ట్‌ల ద్వారానే తెలుస్తాయి. నేను నటిస్తున్న సినిమాలన్నింటి కోసం ఆడిషన్స్ ఇచ్చాను. చాలా మందికి తెలియదు. ఇదంతా చాలా శ్రమతో, ఓర్పుతో కూడిన వ్యవహారం. నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది.

ఇప్పుడు రీల్స్ చేయటం మానేసారా?

లేదు. నా మనసుకు నచ్చిన టాపిక్ దొరికినప్పుడు చేస్తున్నాను. అయితే అది నా ప్రధాన వృత్తి కాదు కాబట్టి స్లో అయింది. అయినా ఇప్పటికీ నా రీల్సే నా ఐడెంటిటీ.

ఒక రోజు ఎయిర్‌పోర్టులో ఒక ఆవిడ నన్ను కలిసారు. వాళ్ల అమ్మాయి చావు చివరి అంచుల్లో ఉందని.. తనతో ఒక సారి మాట్లాడమని రిక్వెస్ట్ చేశారు. అక్కడ నుంచి ఆమెకు వీడియో కాల్ చేశాం. ఆ అమ్మాయి- "నేను మీ రీల్స్ రోజూ చూస్తాను. వాటిని చూస్తుంటే మొత్తం బాధలన్నీ మర్చిపోతాను" అంది. నా జీవితంలో అంత కన్నా పెద్ద కాంప్లిమెంట్ ఎప్పుడూ రాలేదు. అందరినీ నవ్వించటం.. ఆనందంగా ఉంచటం కన్నా గొప్ప విషయమేమి ఉంటుంది? ఇప్పటి దాకా నాతో పనిచేసిన సహచర నటీనటులందరూ నా రీల్స్ గురించి చెబుతూ ఉంటారు. అప్పుడు నాకు చాలా ఆనందంగా, గర్వంగా అనిపిస్తూ ఉంటుంది.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

లైబ్రరీ.. చాలా మందికి ఒక అందమైన జ్ఞాపకం.. పుస్తకాల వాసన.. గంభీరమైన నిశబ్దాలను చాలా మంది మరచిపోరు. ఒకప్పుడు వేసవి సెలవులలో లైబ్రరీకి వెళ్లటం పిల్లలకు ఒక దినచర్య. కానీ కాలంతో పాటుగా సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రజలలో పుస్తకాలను చదివే అలవాటు తగ్గింది. దీనితో పాటుగా లైబ్రరీల సంఖ్య తగ్గుతూ వచ్చింది. మళ్లీ ప్రజలలో పుస్తకాలను చదివే అలవాటును పెంచటానికి కోఫోర్జ్ అనే సంస్థ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ప్రయత్నాల్లో భాగంగా ఢిల్లీ, నోయిడాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసింది. తాజాగా 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌లో కూడా ఒక లైబ్రరీని ప్రారంభించింది. ఈ లైబ్రరీలను ప్రారంభించటానికి వెనకున్న ఉద్దేశాలను ఆ కంపెనీ చీఫ్ బ్రాండ్ ఆఫీసర్ అనురాధ సేహగల్ 'నవ్య'కి వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..


అందరి కోసం ఓ లైబ్రరీ!



"పిల్లలు కొత్త కొత్త విషయాలు తెలుసుకోవటానికి ఇష్టపడతారు. ముఖ్యంగా బొమ్మల పుస్తకాలు.. రకరకాల రంగు రంగుల ఆట వస్తువులు వారిని ఆకర్షిస్తాయి. ఇదే విధంగా యుక్త వయస్సులో ఉన్నవారికి పుస్తకాలు మంచి స్నేహితులు. అయితే మొబైల్స్, ఐపాడ్స్ వంటి సాంకేతిక సాధనాలు అందుబాటులోకి రావటంతో ప్రజలలో కాగితపు పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోతోంది. ఈ ఒరవడికి తగ్గట్టుగానే ప్రభుత్వాలు నిర్వహించే లైబ్రరీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని- మా కంపెనీ సీఈఓ సింగ్ మా వద్ద ఉన్న సీఎస్ఆర్ నిధులతో పబ్లిక్ లైబ్రరీలను స్థాపించాలని పూనుకున్నారు. ఆయన ఉద్దేశం వెనక ఒక నేపథ్యముంది. వారి తండ్రి ఆర్మీ అధికారి. అందువల్ల దేశంలోని అనేక ప్రాంతాలలో ఆయన పెరిగారు. ఆయన ఎక్కడికి వెళ్లినా- అక్కడ లైబ్రరీలు ఉండేవి. ఆయన అక్కడికి వెళ్లి పుస్తకాలు చదువుకొనేవారు. ఆ తర్వాతి కాలంలో ఆయన అమెరికా వెళ్లిపోయారు. అక్కడ స్థిరపడ్డారు. అమెరికాలో ఆయన పిల్లలు చదువుకొనేందుకు పెద్ద పెద్ద లైబ్రరీలు ఉండేవి. ఆయన మన దేశానికి తిరిగి వచ్చిన తర్వాత పబ్లిక్ లైబ్రరీలు తక్కువగా ఉండటం గమనించారు. సమాజానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ లైబ్రరీలను ప్రారంభించాం.

నోయిడా లైబ్రరీ పెద్ద హిట్..

ఒక సాధారణ వ్యక్తి కాసేపు ఎక్కడికైనా వెళ్లి తనకు నచ్చిన పుస్తకం చదువుకోవటానికి వీలైన పరిస్థితులు కల్పించాలనేది మా ఉద్దేశం. దీనితో పాటుగా ఈ మధ్యకాలంలో తల్లితండ్రులు తమ పిల్లలను మాల్స్‌కు మాత్రమే తీసుకువెళ్తున్నారు. పార్కులకు, లైబ్రరీలకు తీసుకువెళ్లటం లేదు. దీనికి కారణం సరైన మౌలిక సదుపాయాలు లేకపోవటం. అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అందరూ వచ్చి గడపటానికి వీలైన లైబ్రరీలను నిర్మించాలనేదే మా ఉద్దేశం. దీనిలో భాగంగా గత ఏడాది ఫిబ్రవరిలో నోయిడాలో ఒక లైబ్రరీ ప్రారంభించాం. ఈ ఏడాది జూన్‌లో ఢిల్లీలో మరో లైబ్రరీ నిర్మించాం. ఈ రెండింటికి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. వేల మంది ప్రజలు ఈ లైబ్రరీలకు రావటం మొదలుపెట్టారు. వారి దగ్గర నుంచి వచ్చిన రెస్పాన్స్ ఆధారంగా ఈ



వారం హైదరాబాద్‌లో లైబ్రరీని ప్రారంభించాం. సుమారు 15 వేల చదరపు అడుగులలో ఈ లైబ్రరీ ఉంది. దీనిలో సుమారు 15 వేల పుస్తకాలు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో అన్ని విభాగాల్లో అందరి ప్రశంసలు పొందిన పుస్తకాలను దీనిలో ఉంచాం. ముఖ్యంగా పిల్లల కోసం ఒక ప్రత్యేకమైన విభాగాన్ని ప్రారంభించాం. తమ ఖాళీ సమయాల్లో తల్లితండ్రులు- పిల్లలను మాల్స్‌కు మాత్రమే కాకుండా ఇక్కడికి కూడా తీసుకురావచ్చు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ఈ లైబ్రరీ ప్రజలందరూ తమ ఖాళీ సమయంలో వచ్చి మనసుకు నచ్చిన పుస్తకాలను చదువుకోవటానికి మాత్రమే! సాధారణంగా లైబ్రరీలలో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. కానీ ఇక్కడ ఆ తరహా కార్యక్రమాలను ఇంకా అనుమతించటం లేదు. ఈ లైబ్రరీకి తొలి రోజు నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది.


ఒత్తయిన శిరోజాల కోసం...


కొంతమందికి విపరీతంగా జుట్టు రాలడాన్ని చూస్తూ ఉంటాం. అందుకు పోషకాహార లోపం, వాతావరణ కాలుష్యం, ఒత్తిడి, ఆందోళనలు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాకాకుండా కుదుళ్ల బలోపేతమై శిరోజాలు ఒత్తుగా పెరగడానికి పాటించాల్సిన చిట్కాల గురించి తెలుసుకుందాం...

- ఒక గిన్నెలో అర కప్పు మెంతులు వేసి నిండా నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ మెంతులను మెత్తగా గ్రైండ్ చేసి ఆ పేస్టుని తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి ఆపై తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే.. శిరోజాలు రాలడం తగ్గి నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.
- ఎర్ర ఉల్లిపాయ రసాన్ని తలకు పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.
- రాత్రి పడుకునే ముందు తలకు ఉసిరి నూనె లేదా కొబ్బరినూనెతో మర్దన చేసుకుని ఉదయాన్నే తలస్నానం చేస్తే శిరోజాల కుదుళ్ల బలపడతాయి.



- రెండు రోజులకోసారి తలకి కలబంద గుజ్జు పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తుంటే జుట్టు నల్లగా పొడవుగా పెరుగుతుంది. తగినంత తేమ అంది శిరోజాలు చక్కగా మెరుస్తుంటాయి.
- కోడిగుడ్డులోని తెల్ల సొనకు కొద్దిగా పెరుగు కలిపి తలకు పట్టించి పది నిమిషాల తరువాత తలస్నానం చేసినా జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.
- ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఐరన్ ఎక్కువగా ఉండే పోషకాహారాన్ని తరచూ తీసుకుంటూ ఉంటే శిరోజాలు బలంగా పెరుగుతాయి. గ్రీన్ టీని తాగినా, తలకు పట్టించినా మంచి ఫలితం కనిపిస్తుంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది డిప్లొమాట్3	వెబ్‌సిరీస్	అక్టోబర్ 16
బ్యాడ్ షబ్బోస్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 16
గుడ్‌న్యూస్	కొరియన్ చిత్రం	అక్టోబర్ 17
అమెజాన్ ప్రైమ్		
జెర్ ఫాల్ట్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 16
జీ 5		
కిష్కింధపురి	తెలుగు చిత్రం	అక్టోబర్ 17
భగ్‌వత్ 1	హిందీ చిత్రం	అక్టోబర్ 17
ఆహా...		
ఆనందలహరి	తెలుగు సిరీస్	అక్టోబర్ 17

ఇలా బ్రష్ చేసుకోవాలి...

మనం రోజూ ఉదయం నిద్ర లేవగానే టూత్‌బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకుంటూ ఉంటాం. సరైన రీతిలో బ్రష్ చేసుకోకుంటే దంత సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దంతాలు పటిష్టంగా ఉండాలంటే ఏవిధంగా బ్రష్ చేసుకోవాలో తెలుసుకుందాం...

- రోజూ ఉదయం లేవగానే.. రాత్రి పడుకునే ముందు.. తప్పనిసరిగా దంతాలను బ్రష్ చేసుకోవాలి. అప్పుడే పళ్ల మధ్య ఇరుక్కున్న ఆహారపదా



ర్థాలు, పళ్లమీద పేరుకున్న బ్యాక్టీరియాలు తొలగిపోయి దంతాలు సురక్షితంగా ఉంటాయి.

- దంతాలను కనీసం రెండు నిమిషాలపాటు సున్నితంగా వృత్తాకారంలో బ్రష్ చేయాలి. దంతాలు, చిగుళ్ల కలిసి ఉన్న ప్రాంతంలో బ్రష్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలి.
- దంతాలను బ్రష్ చేయడానికి ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టును వాడడం మంచిది. ఇది దంతాల మీద ఉండే ఎనామిల్ పొరను కాపాడడంతోపాటు అకాల దంతక్షయాన్ని నివారిస్తుంది. బ్రష్ మీద బఠానీ గింజంత పేస్టు మాత్రమే వేసుకుని పళ్లు తోముకోవాలి.

నీలోఫర్ నుంచి 2 యూనిట్లు కింగ్ కోఠికి!

- రోగుల రద్దీతోనే.. కింగ్ కోఠి ఆస్పత్రిలో ఓ ఫ్లోర్ ఖాళీ
- అక్కడ 100 బెడ్లతో ఏర్పాటు.. అధికారుల పరిశీలన
- నిలోఫర్‌కు రోజుకు సగటున 1200 ఓపీ నమోదు
- యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ప్రత్యేక కమిటీ
- నివేదిక రాగానే నిధులు.. ఆ వెంటనేవైద్య సేవలు

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నీలోఫర్ ఆస్పత్రిలో రోగుల తాకిడి పెరగడంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీలోఫర్‌లోని రెండు యూనిట్లను కింగ్‌కోఠి మాతాశిశు సంరక్షణ కేంద్రం ఆస్పత్రికి తరలించాలని నిర్ణయించింది. కింగ్‌కోఠి ఆస్పత్రిలో ఒక అంతస్తు మొత్తం ఖాళీగా ఉండటంతో అక్కడ 100 పడకలతో 2 పిడియాట్రిక్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులోనే నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు శనివారం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల బృందం కింగ్‌కోఠి ఆస్పత్రిని సందర్శించింది. వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేంద్రకుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రారెడ్డి కింగ్‌కోఠి దవాఖానాను సందర్శించారు. కాగా నీలోఫర్ నుంచి రెండు యూనిట్లను కింగ్‌కోఠి ఆస్పత్రికి తరలించడానికి సంబంధించి ఐదుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో నీలోఫర్, కింగ్‌కోఠి ఆస్పత్రుల నుంచి ఇద్దరు చొప్పున సీనియర్ పిడియాట్రిషియన్స్, తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ)కి చెందిన ఓ ఇంజనీర్ ఉన్నారు. ఈ కమిటీ పిడియాట్రిక్ యూనిట్ల ఏర్పాటు చేయడానికి వైద్య పరికరాలు, యంత్రాలు ఏమేం కావాలి? కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు.. వాటి కోసం ఎంత ఖర్చు అవుతుంది? అనే అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తుంది. అనంతరం పిడియాట్రిక్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రస్తుతం నీలోఫర్ ఆస్పత్రిలో రోజుకు సగటున 1200 ఓపీ నమోదు అవుతోంది. సీజనల్ వ్యాధుల సమయంలో అది ఇంకా ఎక్కువగా ఉంటోంది. అరోగ్యపరమైన ఇబ్బందులతో వచ్చే చిన్నారులకు కొన్నిసార్లు పడకలు కూడా దొరకడం లేదు. ఒకరిని డిశ్చార్జి చేస్తేనే మరొకరిని చేర్చుకునే పరిస్థితి నెలకొంది. దీంతో నీలోఫర్‌లో రోగుల తాకిడి కొంతమేరకు మళ్లించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో కింగ్‌కోఠి ఆస్పత్రిని వైద్యశాఖ పిడియాట్రిక్ యూనిట్ల ఏర్పాటుకు అనువైన ఆస్పత్రిగా గుర్తించింది.

డీఎంఈ కార్యాలయానికి బ్రాండింగ్

కోఠిలోని వైద్యవిద్యా సంచాలకుల కార్యాలయాన్ని బ్రాండింగ్ చేయాలని వైద్యశాఖ యోచిస్తోంది. నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో కోఠిలోని డీఎంఈ క్యాంపస్‌కు వస్తుంటారు. ఆ క్యాంపస్‌లోనే డీఎంఈ, టీవీవీపీ, డీహెచ్, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, పారామెడికల్ బోర్డ్, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉన్నాయి. డీఎంఈ బిల్డింగ్‌లోనే కీలకమైన విభాగాధిపతులున్నారు. డీఎంఈ, టీవీవీపీ కమిషనర్, పారామెడికల్ బోర్డు కార్యదర్శి, వైద్య నియామకాల కార్యదర్శి ఆఫీసులున్నాయి. పురాతన భవనం కావడం, వర్షాలకు చెమ్మ దిగడంతో భవనమంతా ఒకరకమైన దుర్గంధం వస్తోంది. ఎక్కడా కూడా సరైన మరుగుదొడ్లు లేవు. వాటిలో నీళ్లు ఉండటం లేదు. వచ్చే సందర్శకులు కూర్చునేందుకు సరైన స్థలం, కుర్చీలు లేవు. ముఖ్యంగా ఒక్క విభాగాధిపతి కార్యాలయంలోనూ కనీసం మంచినీటి సదుపాయం లేదు. ఈ నేపథ్యంలో డీఎంఈ కార్యాలయాన్ని కూడా బ్రాండింగ్ పరిధిలోకి తీసుకురానున్నారు. ప్రతి విభాగాధిపతి కార్యాలయంలో సందర్శకుల కోసం స్థలం కేటాయించడం, కుర్చీలు, తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురాన్నారు. అలాగే భవనానికి ఎప్పుడో వేసిన రంగు పాలిపోయి భూత్ బంగ్లాగా మారింది. సరికొత్తగా రంగులు కూడా బ్రాండింగ్‌లో భాగంగా వేయనున్నారు.

ఘరానా మోసగాడు బాలాజీ నాయక్ అరెస్టు

- 240% వరకు వడ్డీ ఇస్తానంటూ 50 కోట్లకు పైగా వసూలు
- ప్రామిసరీ నోట్లు, లగ్జరీ కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర

నల్లగొండ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశ చూపి అమాయకుల నుంచి కోట్లాది రూపాయలు అప్పులు తీసుకుని మోసగించిన రమావత్ బాలాజీ నాయక్‌ని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.80 లక్షల విలువైన ఫార్చ్యూనర్, స్కార్పియో కార్లు, పలు ప్రదేశాల్లోని ఆస్తుల డాక్యుమెంట్లు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకులో డబ్బు దాచుకుంటే ఏడాదికి 8 శాతం వరకు వడ్డీ వస్తుందని, తాను 110 నుంచి 240 శాతం వరకు వడ్డీ ఇస్తానని బాలాజీ నాయక్ బాధితులను నమ్మించాడని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఇలా సుమారు రూ.50 కోట్ల పైచిలుకు వసూలు చేశాడని, అతనిపై గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో అందిన ఫిర్యాదుల మేరకు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. శనివారం నల్లగొండలో విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ వివరాలను వెల్లడించారు. 'అప్పులిచ్చే వారిని నమ్మించేందుకు బాలాజీ నాయక్ తన విలాసవంతమైన కార్లలో ఎక్కించుకొని నల్లగొండలోని ఐటీ టవర్ వద్దకు తీసుకొచ్చి అది తన బంగ్లాయేనని చెప్పేవాడు. ఖరీదైన విల్లాలు, వెంచర్ల వద్దకు తీసుకెళ్లి అవి తన ఆస్తులేనని నమ్మబలికేవాడు. భారీ మొత్తంలో అప్పులు చేసి.. ఆ డబ్బును మద్యం వ్యాపారం, స్టాక్ మార్కెట్‌లో ఇంట్రాడే ట్రేడింగ్, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయాడు. విలాసవంతమైన జీవితం గడపడానికి అలవాటు పడ్డాడు. జల్సాలు, దావత్‌లు చేస్తూ జనాల్ని నమ్మించడం కోసం మరిన్ని అప్పులు చేశాడు. బాధితులు ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి డబ్బులివ్వనని అతను బెదిరించడంతో చాలామంది ముందుకురాలేద'ని ఎస్పీ తెలిపారు. బాలాజీ నాయక్‌కు అప్పులివ్వడంతో పాటు మధ్యవర్తిగా ఉండి అప్పులు ఇప్పించిన సరియానాయక్.. తీవ్ర ఒత్తిడికి గురై మరణించడంతో పలువురు బాధితులు ధైర్యం చేసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వాటి ఆధారంగా తాము విచారణ చేసి బాలాజీ నాయక్‌ని అరెస్టు చేశామన్నారు. 'ఒక వైపు ఏజెంట్ల ద్వారా, మరోవైపు నేరుగా కోట్లాది రూపాయలు అప్పులు తీసుకుని.. ప్రాంసరీ నోట్లు రాసి నెలనెలా వడ్డీలిస్తూ వచ్చాడు. ఈ డబ్బుతో అతనితో పాటు బంధువులు, స్నేహితులు, ఇతర బినామీల పేర్లపై వ్యవసాయ భూములు, ఇళ్లు, ఖరీదైన ప్లాట్లు, కార్లు, బైక్‌లు కొన్నాడు. జల్సాలు చేశాడు. బాధితులకు వడ్డీలు ఇచ్చి, ఆ విషయాన్ని ప్రాంసరీ నోట్ల వెనక రాసేవాడు. వాటిని తీసుకుని కొత్త ప్రాంసరీ నోటు మీద అసలు అమౌంట్ రాసి ఇచ్చి నమ్మించేవాడ'ని ఎస్పీ తెలిపారు. 111 మద్యం దుకాణాలకు టెండర్లు వేయగా.. ఒక దుకాణం వచ్చిందని, ఆ తర్వాత సిండికేట్‌లో కలిసి మద్యం వ్యాపారం చేయగా రూ.2.30 కోట్లు నష్టపోయాడని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్‌లో ఇంట్రా ట్రేడింగ్ చేసి రూ.12.15 కోట్లు, ఆర్‌బీఎన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడని ఎస్పీ వివరించారు. బాధితులందరూ గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని తెలిపారు. బాలాజీ నాయక్ ఏజెంట్లు, బినామీలను సైతం గుర్తించి వారి ఆస్తులను కూడా అటాచ్ చేస్తామన్నారు. కాగా, అతని నుంచి మిర్యాలగూడ, హయత్‌నగర్, నేరేడుచర్ల, పలుగుతండాల్లోని ఇళ్లు, దామరచర్ల, వద్దిపట్లలోని వ్యవసాయ భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితులకు రాసిచ్చిన 36 ప్రాంసరీ నోట్లు, మరో 77 ఖాళీవి సేకరించారు. ఒక రిజిస్టర్ బుక్, అతని ఫోన్‌లో లావాదేవీలు రాసుకునే ఎక్సెల్ షీట్‌ను గుర్తించారు. వాటిని విశ్లేషిస్తున్నారు.



న్యూఢిల్లీలో అనిల్ కామినేని సారథ్యంలో నిర్వహించిన తొలి ప్రపంచ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ విజయవంతమైన సందర్భంగా హీరో రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన ప్రధాని నరేంద్ర మోదీని శనివారం కలిశారు. లీగ్‌కు సంబంధించిన వివరాలను చరణ్, ఉపాసన, అనిల్ కామినేనిలు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా వారు ఆర్చరీ విల్లు, శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను ప్రధానికి బహూకరించారు. 'ప్రధాన మంత్రిని కలవడం ఎంతో గర్వంగా అనిపించింది' అని రామ్‌చరణ్ ట్వీట్ చేశారు.

న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి)

ఘనంగా నార్నె నితిన్ వివాహం



జూనియర్ ఎన్టీఆర్ బావమరిది, 'మ్యాడ్' సిరీస్ ఫేమ్ నార్నె నితిన్ ఓ ఇంటివాడయ్యాడు. తాళ్లూరి కృష్ణప్రసాద్, స్వరూప దంపతుల కుమార్తె లక్ష్మీ శివానితో ఆయన వివాహం హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు జూనియర్ ఎన్టీఆర్, ఆయన సతీమణి లక్ష్మీ ప్రణతి, హీరోలు వెంకటేశ్, కల్యాణ్‌రామ్, నిర్మాత సురేశ్‌బాబుతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన జంటను ఆశీర్వదించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సెట్స్ పైకి కొత్త చిత్రం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రం శనివారం సెట్స్‌పైకి వెళ్లింది. ముహూర్తపు షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. నిరంజన్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. 'రాజావారు రాణిగారు' చిత్రంతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న రవికిరణ్ కోలా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ బేనర్‌లో రూపొందుతున్న 59వ చిత్రమిది. ఇందులో విజయ్ సరసన కీర్తిసురేశ్ కథానాయికగా నటిస్తున్నారు. 'రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది, ఈ నెల 16 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం, వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని యూనిట్ తెలిపింది.

వాటన్నింటికీ భిన్నంగా తెలుసు కదా

రాశీ ఖన్నా



'ఇప్పటివరకూ వెండితెరపై వచ్చిన ప్రేమకథలకు భిన్నంగా 'తెలుసు కదా' చిత్రాన్ని దర్శకురాలు నీరజ కోన తీర్చిదిద్దారు. ముక్కోణపు ప్రేమకథలో ఓ కొత్త కోణాన్ని హృదయాలకు హత్తుకునేలా ఆవిష్కరించారు.కథ విన్నప్పుడు నేను సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. సినిమా చూసిన ప్రేక్షకులు కూడా అదే అనుభూతికి లోనవుతారు' అని కథానాయిక రాశీ ఖన్నా అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశీఖన్నా ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రమిది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశీఖన్నా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఇప్పటివరకూ నేను చాలా ప్రేమకథా చిత్రాలు చేశాను. కానీ 'తెలుసుకదా' మాత్రం వాటన్నింటికీ భిన్నంగా ఉంటుంది. ఇందులో అంజలి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను.
- సిద్ధూకి అన్ని విభాగాల మీద అవగాహన ఉంది. సెట్స్‌లో అన్నింటినీ సమన్వయం చేసుకుంటాడు.శ్రీనిధిశెట్టి ఈ చిత్రం షూటింగ్‌లో మంచి స్నేహితురాలయ్యారు. మా కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలను ప్రేక్షకులను కదిలిస్తాయి. ఈ బేనర్‌లో నాకు ఇది రెండో చిత్రం. విశ్వప్రసాద్ మంచి అభిరుచి ఉన్న నిర్మాత. ప్రస్తుతం పవన్ కల్యాణ్ గారితో 'ఉస్తాద్ భగత్‌సింగ్' చేస్తున్నాను. హిందీలో నాలుగు చిత్రాలు చేస్తున్నాను.




నా అభిమానుల కోసమే కె ర్యాంప్

కిరణ్ అబ్బవరం

'కొత్త స్క్రిప్ట్ చేద్దామనే ఉద్దేశంతో 'క' అనే సినిమా చేశాను. 'కె-ర్యాంప్'ని మాత్రం ప్రత్యేకంగా నా అభిమానుల కోసమే చేశాను. ఈ చిత్రంలో నేటి తరం యువతకు దగ్గరగా ఉండే పాత్ర నాది. సందర్భాన్ని బట్టి యువత అసహనంతో ప్రవర్తించే తీరులోనే నా సంభాషణలు ఉంటాయి. అయితే ఈ డైలాగ్స్‌లో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగదని మాత్రం చెప్పగలను. గతేడాది దీపావళి కంటే ఈసారి ఈ దీపావళి బాగా ఉంటుంది. నన్ను నమ్మండి' అని అన్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన 'కె ర్యాంప్' చిత్రం ఈనెల 18న విడుదల కానుంది. యుక్తి తరేజా కథానాయిక. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మించారు. శనివారం ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ లాంచ్ వేడుకను నిర్వహించారు. చిత్ర దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ఎనర్జీకి సినిమా ఏ మాత్రం తగ్గదు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ దీపావళికి వస్తున్న నాలుగు సినిమాలు హిట్ కావాలి. అందులో కె ర్యాంప్' ఒక మెట్టు పైనే ఉండాలి' అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ 'దీపావళి పండక్కి మీరు కొనే టపాసు రెండు నిమిషాలే ఉంటుంది. కానీ మీరు కొనే టిక్కెట్లుతో మా సినిమా రెండు గంటలు వినోదం పంచుతుంది' అని అన్నారు.

నా చిన్నప్పటి కోరిక తీరింది

రిషబ్ శెట్టి



'మా ఊళ్లో సినిమా షూటింగ్ చేయాలనేది నా చిన్నప్పటి కోరిక. అది 'కాంతార: చాప్టర్ 1'తో తీరింది. ఇప్పుడు ఆ సినిమా సక్సెస్ అవ్వడం ఆ ఆనందాన్ని రెండింతలు చేసింది' అని రిషబ్‌శెట్టి అన్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమిది. ఇటీవలే విడుదలై పాన్ ఇండియా స్థాయిలో చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

- ఈ సినిమా చిత్రీకరణలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నాం. ముఖ్యంగా కాంతార ప్రపంచాన్ని సృష్టించడం కోసం చాలా శ్రమించాం. అన్ని విభాగాలు కూడా చాలా లోతైన పరిశోధన చేశాయి. సంగీత దర్శకుడు అజనీశ్ గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడి ఒరిజినల్ స్కోర్‌ని రికార్డ్ చేశారు. హోంబలే లాంటి నిర్మాణ సంస్థ వెనుక ఉండడం వల్లే ఎన్నో అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాగలిగాం.
- నటుడిగా కన్నా నాలోని దర్శకుడు సక్సెస్ కొడితే వచ్చే ఆనందాన్ని నేను ఎక్కువగా ఆస్వాదిస్తాను. ప్రస్తుతం తెలుగులో 'జై హనుమాన్' చిత్రం చేస్తున్నాను.

'మిత్ర మండలి' సెన్సార్ పూర్తి



ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎమ్ జంటగా విజయేందర్ తెరకెక్కించిన చిత్రం 'మిత్రమండలి'. వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్, రాగ్ మయూర్, విష్ణు ఓయ్ కీలక పాత్రల్లో నటించారు. బీవీ వర్క్స్ బ్యానర్, బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతిన, భానుప్రతాప, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. ఈ నెల 16న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తైంది. యూ/ఏ సర్టిఫికేట్ వచ్చింది. ఈ చిత్రం ఆద్యంతం వినోదభరితంగా ఉందని, సమాజంలోని కులవ్యవస్థపై వ్యంగ్యంగా విమర్శనాస్త్రాలు సంధించిందని సెన్సార్ సభ్యులు అభినందించినట్లు చిత్రబృందం తెలిపింది.

అటు బ్యాట్‌తో.. ఇటు బంతితో

- తొలి ఇన్నింగ్స్ 518/5 డిక్లేర్
- కెప్టెన్ గిల్ అజేయ శతకం
- విండీస్ తొలి ఇన్నింగ్స్ 140/4
- జడేజాకు మూడు వికెట్లు

భారత్ ఆల్‌రౌండ్ షో | 2 | రెండో టెస్టు


గిల్ (129 నాటౌట్)


జడేజా (3/37)

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో టీమిండియా ఆల్ రౌండ్‌షోతో అదరగొడుతోంది. బ్యాటర్లు విజృంభించిన చోట.. భారత స్పిన్నర్లు సైతం పర్యాటక విండీస్‌ను కట్టడి చేస్తున్నారు. యశస్వీ జైస్వాల్ (175) డబుల్ సెంచరీ కోల్పోయినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్) తన చివరి ఏడు టెస్టుల్లో ఐదో శతకంతో సూపర్ ఫామ్‌ను చాటుకున్నాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 518/5 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది. ధ్రువ్ జురెల్ (44), నితీశ్ కుమార్ (43) పర్వాలేదనిపించారు. స్పిన్నర్ వారికన్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో సెషన్ మధ్యలో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ ఫ్లాట్ పిచ్‌పైనా పట్టు తప్పింది. స్పిన్నర్ జడేజా (3/37) ధాటికి రెండో రోజు శనివారం ఆట ముగిసేసరికి 43 ఓవర్లలో 140/4 స్కోరుతో విండీస్ కష్టాల్లో పడింది. అథనజె (41), చందర్‌పాల్ (34) కాస్త పోరాడడంతో రెండో వికెట్‌కు 66 రన్స్ చేరాయి. క్రీజులో షాయ్ హోప్ (31), ఇమ్లాచ్ (14) ఉన్నారు. కుల్దీప్‌నకు ఓ వికెట్ దక్కింది. ప్రస్తుతం 378 పరుగులు వెనుకబడిన విండీస్ ఫాలోఆన్ ప్రమాదంలో పడింది.

గిల్ జోరు: ఓవర్‌నైట్ స్కోరు 318/2తో రెండోరోజు ఆట ఆరంభించిన భారత్ తమ సెషన్నర ఆటలో మరో 200 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అయితే తొలి సెషన్ రెండో ఓవర్‌లోనే గట్టి ఝలక్ తగిలింది. డబుల్ సెంచరీ ఖాయమనిపించిన జైస్వాల్ సమన్వయలోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. మిడాఫ్ దిశగా డ్రైవ్ ఆడిన అతను సింగిల్ కోసం పరుగుతీశాడు. అయితే నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో గిల్ కాస్త ముందుకు వచ్చినా మళ్లీ వెనక్కి మళ్లాడు. అప్పటికే యశస్వీ సగం క్రీజు దాటేశాడు. అటు చందర్‌పాల్ నుంచి అందుకున్న త్రోతో కీపర్ ఇమ్లాచ్ రనౌట్ చేయడంతో జైస్వాల్ పెవిలియన్‌కు చేరాడు. వీరిద్దరి మధ్య మూడో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. తొలిరోజు చివర్లో నిదానంగా ఆడిన గిల్ శనివారం మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. అతడికి నితీశ్ సహకరించాడు. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో ఆకట్టుకున్న నితీశ్.. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 91 పరుగులు జోడించాక వారికన్‌కు చిక్కాడు. లంచ్ బ్రేక్ తర్వాత గిల్-జురెల్ ఆధిపత్యం చూపారు. కెరీర్‌లో పదో శతకం పూర్తి చేశాక గిల్ ఎదురుదాడి ఆరంభించాడు. చేజ్ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే పియర్ ఓవర్‌లో మూడు ఫోర్లతో 12 రన్స్ రాబట్టాడు. అయితే ఐదో వికెట్‌కు 102 పరుగులు జోడించాక జురెల్ అవుట్ కాగా.. ఆ వెంటనే భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

ఒకే ఏడాదిలో ఐదు శతకాలు బాదిన రెండో భారత కెప్టెన్‌గా గిల్. కోహ్లీ (2017, 2018) రెండు సార్లు ఈ ఫీట్ సాధించాడు. అలాగే అలిస్టర్ కుక్ (9), గవాస్కర్ (10) తర్వాత తక్కువ ఇన్నింగ్స్ (12)లోనే ఐదు సెంచరీలు సాధించిన సారథిగా గిల్ నిలిచాడు.

64 ఏళ్ల తర్వాత విండీస్‌పై తొలి ఐదుగురు బ్యాటర్ల మధ్య 50+ భాగస్వామ్యాలు నమోదయ్యాయి. 1960లో చివరిసారి ఆసీస్ జట్టు ఈ రికార్డు నెలకొల్పింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 175, రాహుల్ (స్టంప్) ఇమ్లాచ్ (బి) వారికన్ 38, సాయి సుదర్శన్ (ఎల్బీ) వారికన్ 87, గిల్ (నాటౌట్) 129, నితీశ్ (సి) సీల్స్ (బి) వారికన్ 43, జురెల్ (బి) చేజ్ 44; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 134.2 ఓవర్లలో 518/5 డిక్లేర్. వికెట్ల పతనం:** 1-58, 2-251, 3-325, 4-416, 5-518. **బౌలింగ్:** సీల్స్ 22-2-88-0; ఫిలిప్ 17-2-71-0; గ్రీవ్స్ 14-1-58-0; పియర్ 30-2-120-0; వారికన్ 34-6-98-3; చేజ్ 17.2-0-83-1.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: కాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 10, చందర్‌పాల్ (సి) రాహుల్ (బి) జడేజా 34, అథనజె (సి) జడేజా (బి) కుల్దీప్ 41, హోప్ (బ్యాటింగ్) 31, చేజ్ (సి అండ్ బి) జడేజా 0; ఇమ్లాచ్ (బ్యాటింగ్) 14; **ఎక్స్‌ట్రాలు 10; మొత్తం: 43 ఓవర్లలో 140/4. వికెట్ల పతనం:** 1-21, 2-87, 3-106, 4-107. **బౌలింగ్:** బుమ్రా 6-3-18-0; సిరాజ్ 4-0-9-0; జడేజా 14-3-37-3; కుల్దీప్ 12-3-45-1; సుందర్ 7-1-23-0.

కంగారూలతో కఠిన పరీక్షే!

నేడు ఆస్ట్రేలియాతో భారత్ పోరు
మహిళల వన్డే ప్రపంచ కప్



మ. 3 గం. నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..


ప్రాక్టీస్‌లో ఆసీస్ క్రికెటర్లు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కప్‌లో రెండ్రోజుల క్రితం దక్షిణాఫ్రికా చేతిలో కంగుతిన్న భారత మహిళల జట్టు మరో కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. ఆదివారం జరిగే కీలక మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాతో హర్మన్‌సేన తలపడనుంది. సఫారీలతో మ్యాచ్‌లో టాపార్డర్ బ్యాటర్లు మరోసారి విఫలం కాగా.. ఆరో బౌలర్ లేని లోటు కనిపించింది. దాన్ని పూడ్చడానికి హర్మన్ బంతిని అందుకోవాల్సి వచ్చింది. 40 ఓవర్ల తర్వాత సఫారీ బ్యాటర్లు.. పేసర్లను టార్గెట్ చేయడంతో కెప్టెన్ హర్మన్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. ఆరంభంలో మెరుగ్గా బౌలింగ్ చేసిన క్రాంతి గౌడ్, అమన్‌జోత్ డెత్ ఓవర్లలో బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. మన జట్టు ఫీల్డింగ్ వైఫల్యాలు కూడా ప్రత్యర్థులకు లాభించాయి. ఈ నేపథ్యంలో బలమైన ఆసీస్‌పై జట్టు కూర్పు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. కంగారూలపై పార్ట్‌టైమ్ బౌలర్లను దించితే ఆ జట్టు బ్యాటర్లు మరింత విరుచుకుపడే చాన్సుంది. దీంతో లోయర్డార్‌లో బ్యాటింగ్ కూడా చేయగల రాధా యాదవ్‌ను ఆరో బౌలర్‌గా తుది జట్టులోకి తీసుకోవచ్చు ఇదే జరిగితే వన్‌డౌన్‌లో ఇబ్బందిపడుతున్న హర్లీన్‌పై వేటుపడొచ్చు. ప్రధాన బ్యాటర్లు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్, జెమీమాలు తమ వైఫల్యాన్ని అధిగమించాలి. మరోవైపు ఆస్ట్రేలియా మరోసారి ఫేవరెట్‌గా కనిపిస్తోంది. గత మ్యాచ్‌ల్లో కీలక ప్లేయర్లు విఫలమైనా, గార్డ్‌నర్, బెత్ మూనీ శతకాలతో అదరగొట్టారు. అయితే, లోపాలను సరిదిద్దుకొని ఘన విజయం సాధించాలని అలిస్సా హీలీ సేన పట్టుదలతో ఉంది.

పిచ్/వాతావరణం

వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం. ఆరంభంలో బంతి స్వింగ్ అయినా.. మ్యాచ్ సాగేకొద్దీ పిచ్ స్పిన్నర్లకు సహకరించే చాన్సుంది. ఆకాశం మేఘావృతమై ఉన్నా వర్ష ఛాయలు తక్కువగా ఉన్నాయి. మంచు కురిసే అవకాశం ఉండడంతో టాస్ కీలకం కానుంది.

జట్లు (అంచనా)

భారత్: ప్రతీక రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్/రాధ యాదవ్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, అమన్‌జోత్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా, క్రాంతి, శ్రీచరణి.

ఆస్ట్రేలియా: అలిస్సా హీలీ (కెప్టెన్, వికెట్ కీపర్), లిచ్‌ఫీల్డ్, ఎలిస్ పెర్రీ, బెత్ మూనీ, సదర్లాండ్, గార్డ్‌నర్, తహిల మెక్‌గ్రాత్, జార్జియా వేర్హమ్/సోఫీ మోలినెక్స్, కిమ్‌గార్త్, అలెన్ కింగ్, మేగన్ షట్.

30 ఏళ్ల నాటి సీన్ మళ్లీ..



ఆనంద్‌పై కాస్పరోవ్ గెలుపు
క్లచ్ చెస్ టైటిల్ కైవసం

సెయింట్ లూయిస్ (అమెరికా): సరిగ్గా 30 ఏళ్ల నాటి చరిత్ర పునరావృతమైంది. 1995 అక్టోబరు 10న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌ను రష్యాకు చెందిన గ్యారీ కాస్పరోవ్ గెలుచుకున్నాడు. నాడు..చాలెంజర్, భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌పై విజయంతో కాస్పరోవ్ ప్రపంచ విజేతగా నిలిచాడు. సీన్ కట్ చేస్తే..ప్రస్తుతం అదే వేదికపై నెగ్గిన కాస్పరోవ్ లెజెండ్స్ క్లచ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను దక్కించుకోవడం గమనార్హం. 12 గేమ్‌ల క్లచ్ చెస్ టోర్నీలో కాస్పరోవ్ 13-11 స్కోరుతో విజేతగా నిలిచాడు. టైటిల్‌తోపాటు గ్యారీకి రూ. 69 లక్షలు లభించాయి. ఇక ఆనంద్ రూ. 59 లక్షలు అందుకున్నాడు.

ఇంగ్లండ్ హ్యాట్రిక్

బ్రంట్ సెంచరీ • శ్రీలంకపై విజయం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ వరుసగా మూడో విజయం సాధించింది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (117) రికార్డు శతకానికి తోడు స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ (4/17) సూపర్ బౌలింగ్‌తో సత్తా చాటడంతో.. ఇంగ్లండ్ 89 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. ముందుగా ఇంగ్లండ్ 50 ఓవర్లలో 253/9 స్కోరు చేసింది. బ్రంట్‌కు తోడు బ్యూమంట్ (32), హీథర్ నైట్ (29) రాణించారు. వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో సివర్‌కు ఇది రికార్డుస్థాయిలో ఐదో శతకం కావడం విశేషం. ఇనోకకు 3.. ఉదేశిక, సుగందికలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో శ్రీలంక 45.4 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ హాసిని (35), హర్షిత (33), నీలాక్షి (23) మాత్రమే ఆకట్టుకున్నారు. సివర్ బ్రంట్, డీన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లండ్: 50 ఓవర్లలో 253/9 (సివర్ 117, బ్యూమంట్ 32; ఉదేశిక 3/33); **శ్రీలంక:** 45.4 ఓవర్లలో 164 ఆలౌట్ (హాసిని 35, హర్షిత 33; ఎకెల్‌స్టోన్ 4/17, బ్రంట్ 2/25, డీన్ 2/47).

పుణెరి పల్టన్ జోరు
ప్రొ కబడ్డీ

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో పుణెరి పల్టన్ వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో పల్టన్ 36-23తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. పంకజ్ మోహిత్ 9 రైడ్ పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 47-26తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను చిత్తు చేసింది.

యువ భారత్ బోణీ
జొహోర్ కప్ జూ. హాకీ

జొహోర్ బహ్రూ (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో మన జూనియర్లు 3-2తో గ్రేట్ బ్రిటన్‌పై గెలిచారు. కెప్టెన్ రోహిత్ రెండు గోల్స్ (45+, 52ని.), రవ్‌నీత్ (23ని.) ఓ గోల్ చేశాడు. భారత్ తన రెండో మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో ఆదివారం ఆడనుంది.

నమీబియా సంచలనం

ఏకైక టీ20లో సౌతాఫ్రికాకు షాక్

విండ్‌హోక్ (నమీబియా): టీ20ల్లో పసికూన నమీబియా సంచలనం సృష్టించింది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో నమీబియా నాలుగు వికెట్లతో దక్షిణాఫ్రికాకు షాకిచ్చి అతిపెద్ద విజయాన్ని అందుకుంది. ఆఖరి ఓవర్‌లో నమీబియా విజయానికి 11 పరుగులు కావాల్సి ఉండగా.. జేన్ గ్రీన్ (30 నాటౌట్) సిక్స్, ఫోర్‌తో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. తొలుత సౌతాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 134 పరుగులు చేసింది. జాసన్ స్మిత్ 31, రూబిన్ హెర్మన్ 23 రన్స్ చేశారు. పేసర్ రూబెన్ ట్రంపెల్మన్ 3, హింగో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో నమీబియా ఓవర్లన్నీ ఆడి 138/6 స్కోరు చేసి గెలిచింది. గ్రీన్‌కు తోడు కెప్టెన్ ఎరాస్మస్ (21) రాణించాడు.

చైనాదే టైటిల్
ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో చైనా విజేతగా నిలిచింది. శనివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో చైనా 45-30, 45-44తో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియాను చిత్తుచేసి స్వర్ణం అందుకుంది. కాగా, చైనాకిది రికార్డుస్థాయిలో 15వ టైటిల్ కావడం విశేషం. ఇక, సెమీస్‌లో ఓడిన భారత్, జపాన్ జట్లు కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.

అన్మోల్ జోరుకు బ్రేక్

వాంటా (ఫిన్లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత వర్ధమాన షట్లర్ అన్మోల్ ఖరబ్ జోరుకు సెమీఫైనల్లో బ్రేక్ పడింది. మూడుసార్లు ప్రపంచ విజేత అకానె యమగూచి (జపాన్) 21-10, 21-13తో 18 ఏళ్ల అన్మోల్‌ను ఓడించింది.

పోస్ట్ సేల్ డిస్కౌంట్‌పై జీఎస్‌టీ ఎలా!

ఉత్పత్తిదారులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడంలో భాగంగా పలు ప్రోత్సాహకాలను డీలర్లకు ఇస్తుంటారు. వీటిలో చాలా వరకు క్రెడిట్ నోట్ ద్వారా ఇస్తుంటారు. ఇలా వివిధ సందర్భాల్లో డీలర్లు పొందే క్రెడిట్ నోట్స్‌ను జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఎలా చూడాలనే విషయంలో పలు సందేహాలు ఉన్నాయి. అంటే క్రెడిట్ నోట్‌కు సంబంధించి ఐటీసీ రివర్స్ చేయాల్సి ఉంటుందా? లేదా ఆ మొత్తం మీద పన్ను చెల్లించాలా? ఇలా పలు సందేహాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల వివరణ ఇచ్చింది. వివిధ సందర్భాల్లో ఇచ్చే క్రెడిట్ నోట్స్‌ను జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఎలా అర్థం చేసుకోవాలి. డీలర్లు పాటించాల్సిన నియమ నిబంధనలు ఏమిటో తెలుసుకుందాం.

మొదటిది, పోస్ట్ డిస్కౌంట్‌కు సంబంధించి ఇచ్చే క్రెడిట్ నోట్స్. కంపెనీలు, డీలర్లకు సరుకులు కొనుగోలు చేసే సమయానికే కొంత డిస్కౌంట్ ఇవ్వటం ఒక విధానం కాగా, వార్షిక, త్రైమాసిక, నెలవారీ లక్ష్యాలను చేరుకుంటే అదనంగా డిస్కౌంట్ ఇవ్వటం మరో విధానం. రెండోది పోస్ట్ సేల్ డిస్కౌంట్. ఉదాహరణకు ఒక డీలర్ ఒక త్రైమాసికంలో రూ.కోటి విలువైన సరుకు కొనుగోలు చేస్తే 5 శాతం అదనపు డిస్కౌంట్ ఇస్తామని ఒప్పందం ఉంటే, టార్గెట్ నెరవేరిన తర్వాత మాత్రమే ఆ డిస్కౌంట్ వర్తిస్తుంది. కాబట్టి, అది ఇన్వాయిస్‌లో ముందు చూపబడదు. తర్వాత కంపెనీ, ఆ డీలర్‌కు క్రెడిట్ నోట్ జారీ చేస్తుంది. ఈ క్రెడిట్ నోట్స్ రెండు రకాలు. మొదటిది, జీఎస్‌టీ చట్టం ప్రకారం పన్నుతో కలిపి ఇచ్చే క్రెడిట్ నోట్. రెండోది, కేవలం రెండు పార్టీల మధ్య లెక్క సర్దుబాటు కోసం ఇచ్చే క్రెడిట్ నోట్. దీన్ని కమర్షియల్ లేదా ఫైనాన్షియల్ క్రెడిట్ నోట్ అంటారు. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి క్రెడిట్ నోట్ తీసుకుంటే దానికి సరిపోను ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రివర్స్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడ చాలా మందికి వచ్చే సందేహం ఏమిటంటే కమర్షియల్ క్రెడిట్ నోట్ పొందినప్పుడు కూడా ఐటీసీ రివర్స్ చేయాల్సి ఉంటుందా అని? ప్రభుత్వ వివరణ ప్రకారం పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను కమర్షియల్ క్రెడిట్ నోట్ ద్వారా అందిస్తే ఐటీసీ రివర్స్ చేయాల్సిన అవసరం లేదు.

ఎందుకంటే జీఎస్‌టీ చట్టం ప్రకారం సాధారణ క్రెడిట్ నోట్ ద్వారా డిస్కౌంట్ ఇస్తే, సరఫరాదారు (కంపెనీ) తన అవుట్‌పుట్ ట్యాక్స్‌ను తగ్గించుకునే సౌలభ్యం ఉంది. అంటే, ముందుగా ప్రభుత్వానికి చెల్లించిన పన్ను నుంచి క్రెడిట్ నోట్ మేరకు పన్ను తగ్గించుకోవచ్చు. కాబట్టి, ఆ మేరకు డీలర్ ఐటీసీని రివర్స్ చేయాల్సి ఉంటుంది. అదే కమర్షియల్ క్రెడిట్ నోట్ ఇచ్చినప్పుడు ఈ విధంగా పన్ను సర్దుబాటు చేసుకునే సౌలభ్యం సరఫరాదారునికి లేదు. అంటే ప్రభుత్వానికి చెల్లించిన పన్నులో ఎలాంటి మార్పు ఉండదు. కాబట్టి డీలర్ ఐటీసీ రివర్స్ చేయనవసరం లేదు. దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక డీలర్ ఒక కంపెనీ నుంచి రూ.10 లక్షల విలువైన సరుకును కొన్నాడు. పన్ను 18 శాతంతో కలిపి మొత్తం రూ.11.80 లక్షలు చెల్లించాడు. టార్గెట్ పూర్తి చేసినందుకు గాను కంపెనీ 5 శాతం పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను క్రెడిట్ నోట్ ద్వారా అందించటం జరిగింది. ఒకవేళ కంపెనీ ఈ మొత్తాన్ని సాధారణ క్రెడిట్ ద్వారా అంటే రూ.50,000 ప్లస్ జీఎస్‌టీ (రూ.9,000)తో కలిపి రూ.59,000కు ఇస్తే జీఎస్‌టీ రూ.9,000ను కంపెనీ తదుపరి తగ్గించుకుంటుంది. కాబట్టి డీలర్ ఐటీసీ రివర్స్ చేయాలి. అలాకాకుండా కంపెనీ ఫైనాన్షియల్ క్రెడిట్ నోట్‌ను కేవలం రూ.50,000కు మాత్రమే ఇస్తే అప్పటికే చెల్లించిన పన్నులో ఎలాంటి మార్పు ఉండదు. కాబట్టి డీలర్ ఐటీసీ రివర్స్ చేయనవసరం లేదు.

అలాగే చాలా ఇండస్ట్రీల్లో ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగంలోని తయారీదారులు.. డీలర్లు తమ అమ్మకాలు పెంచుకోవటానికి వీలుగా అదనపు డిస్కౌంట్స్ ఇస్తాయి. ఇలా ఇచ్చే అదనపు డిస్కౌంట్స్‌ను డీలర్లు.. వినియోగదారులకు ఇస్తారు. దాంతో వినియోగదారులకు తక్కువ ధరలో వస్తువులు దొరుకుతాయి. అమ్మకాలు పెరుగుతాయి. ఈ సందర్భంలో వచ్చే సందేహం ఏమిటంటే.. తయారీదారు ఇచ్చిన డిస్కౌంట్‌ను కూడా ఆ వస్తువు అమ్మకానికి సంబంధించి పొందిన చెల్లింపుగా డీలర్ పరిగణించి దాని పైన కూడా పన్ను చెల్లించాలా అని? ఇక్కడ కూడా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఒకసారి సరుకు ఉత్పత్తిదారుని నుంచి డీలర్ పొందితే ఉత్పత్తిదారుడికి ఆ వస్తువు మీద ఎలాంటి హక్కులు ఉండవు. కాబట్టి ఆ డిస్కౌంట్‌ను డీలర్.. వినియోగదారునికి చేసిన అమ్మకంతాలుకు చెల్లింపు కింద భావించనవసరం లేదు. దీనికి సంబంధించి ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే తక్కువ ధరకే వస్తువును అందించటానికి గాను కొన్ని సందర్భాల్లో ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య నేరుగా అగ్రిమెంట్ ఉంటుంది. అలాంటప్పుడు కంపెనీ ఆ డిస్కౌంట్‌ను డీలర్ ద్వారా అందిస్తుంది. తద్వారా ఆ డిస్కౌంట్ వినియోగదారునికి చేరటానికి వీలుగా. అప్పుడు మాత్రమే డీలర్ ఆ డిస్కౌంట్ మొత్తాన్ని కన్సిడరేషన్ కింద భావించి తగు జీఎస్‌టీ చెల్లించాలి.

ఇకపోతే చాలా సందర్భాల్లో డీలర్ తన అమ్మకాలు పెంచుకునేందుకు కొన్ని సర్వీస్‌లు, సేవలు చేస్తుంటాడు. ఉదాహరణకు సేల్స్ మేళా, ప్రకటనలు, ఎగ్జిబిషన్స్ మొదలైనవి. ఇవన్నీ డీలర్ తన కోసం కాకుండా కంపెనీ కోసం చేస్తున్నాడు. కాబట్టి కంపెనీలు ఇచ్చే పోస్ట్ సేల్ డిస్కౌంట్స్‌ను డీలర్ చేసిన ఇలాంటి సర్వీస్‌కు సంబంధించిన చెల్లింపుగా భావించి జీఎస్‌టీ చెల్లించాలా? అనే సందేహం కూడా ఉండేది. ఇక్కడ కూడా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఎప్పుడైతే డీలర్‌కు కంపెనీ మధ్య ఒక సర్వీస్‌కు సంబంధించి చెల్లింపుతో కూడిన అగ్రిమెంట్ ఉంటుందో అప్పుడు మాత్రమే ఆ డీలర్ కంపెనీ నుంచి పొందిన మొత్తాన్ని ఆ సర్వీస్‌కు సంబంధించిన ప్రతిఫలంగా భావించాలి. అప్పుడు మాత్రమే తగిన జీఎస్‌టీ చెల్లించాలి.

ప్రభుత్వం ఇచ్చిన ఈ వివరణల ద్వారా ఏదేనీ ప్రత్యేక సందర్భాల్లో తప్ప, సాధారణ పరిస్థితుల్లో పొందే ఫైనాన్షియల్ లేదా కమర్షియల్ క్రెడిట్ నోట్స్ మీద ఐటీసీ రివర్స్ లేదా జీఎస్‌టీ చెల్లింపు అవసరం లేదు. కాకపోతే, డీలర్లు తాము పొందే క్రెడిట్ నోట్స్ మీద పూర్తి అవగాహన పొంది ఉండాలి.



రాంబాబు గొండాల

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



ఎంత అక్షరాస్యులైనా మన దేశంలో చాలా మందికి ఆర్థిక అక్షరాస్యత లేదు. దీంతో మంచి ఉద్యోగం, ఆర్థిక స్థోమత ఉన్నా జీవితం చివరి దశలో ఆర్థికంగా ఇబ్బందులు అనుభవిస్తుంటారు. నాలుగు రాళ్లు సంపాదించేటప్పుడే క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) పద్దతిలో రిటైర్మెంట్ ప్లాన్ చేసుకుంటే ఈ తిప్పలు ఉండవు. 25 ఏళ్ల వయసులో చక్కటి పెట్టుబడి ప్రణాళిక, ఓర్పు ఉంటే 50 ఏళ్ల వయసు వచ్చే సరికి సిప్ ద్వారా రూ.5 కోట్లు వెనకేసుకోవచ్చు. ఎలాగంటే?

@50 రూ.5 కోట్ల నిధి..!

సిప్ ద్వారా రిటైర్మెంట్ ప్లానింగ్‌తో సాధ్యమే..

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లో మదుపు చేసే వారికి సిప్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నెలనెలా మీ ఆదాయానికి తగ్గట్టు ఈ పద్ధతిలో కొంత నిర్ణీత మొత్తాన్ని ఆయా పథకాల్లో మదుపు చేస్తూ పోవాలి. పెరిగే ఆదాయానికి అనుగుణంగా సిప్ మొత్తాన్నీ పెంచుకోవచ్చు.

సిప్ పెట్టుబడులు

నెలనెలా రూ.10,000 పెట్టుబడితో 25 ఏళ్ల వ్యక్తి సిప్ పద్ధతిలో మంచి ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులు ప్రారంభించాలి. అప్పుడే చిరుద్యోగాల్లో చేరిన వారికి ఇది కొద్దిగా భారంగానే ఉంటుంది. దుబారా ఖర్చులు, జీవన శైలి మార్పుల ద్వారా ఈ మొత్తాన్ని నెలనెలా సిప్ పద్ధతిలో పెట్టుబడిగా పెట్టడం చాలా మందికి ముఖ్యంగా వృత్తి నిపుణులకు పెద్ద కష్టమేమీ కాక పోవచ్చు. జీతాలు పెరిగినపుడల్లా ఈ సిప్ పెట్టుబడులను 10 శాతం పెంచుకోవాలి. ఇలా పెరిగిన జీతం లేదా ఆదాయాలకు అనుగుణంగా సిప్ పెట్టుబడులు పెంచుకుంటూ పోతే దీర్ఘ కాలంలో ఆ మొత్తమే మీ పెట్టుబడులను మరింత పెంచుతాయి. వాల్యూ రీసెర్చ్ సంస్థ సర్వే ప్రకారం గత 20 ఏళ్లలో మంచి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని 36 పథకాలు ఏటా సగటున 15 శాతానికి పైగా రాబడులు ఇచ్చాయి.

రూ.5 కోట్లు ఎలా?

- నెలవారీ సిప్ రూ.10,000
- సగటు రాబడి అంచనా 10 శాతం
- పాతికేళ్లలో వార్షిక సగటు రాబడి 15 శాతం
- పెట్టుబడుల కాల పరిమితి 25 సంవత్సరాలు

25 ఏళ్లకు సమకూరే మొత్తం

- తొలి ఏడాది నెలకు రూ.10,000 చొప్పున ఏడాదికి రూ.1.2 లక్షలు
- రెండో ఏడాది నెలకు రూ.11,000 చొప్పున ఏడాదికి రూ.1.32 లక్షలు
- మూడో సంవత్సరం నెలకు రూ.12,100 చొప్పున ఏడాదికి రూ.1,45,200
- పాతికేళ్లలో మొత్తం పెట్టుబడి సుమారు రూ.1.18 కోట్లు
- పాతికేళ్లకు (50 ఏళ్ల వయసు వచ్చే సరికి) సమకూరే మొత్తం రూ.4.54 కోట్లు

వడ్డీ మీద వడ్డీ

సిప్ పద్దతిలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి మీద ఏటికేటికి వడ్డీ జమ అవుతుంది. ఇలా రూ.10,000తో ప్రారంభించి ఏటా క్రమం తప్పకుండా సిప్ పెంచుకుంటూ పోతే పాతికేళ్ల అయ్యే సరికి రూ.5 కోట్ల మూలనిధి సమకూర్చుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. ఈక్విటీ మార్కెట్ మధ్యలో ఎన్ని ఆటుపోట్లకు లోనైనా పాతికేళ్ల దీర్ఘకాలానికి చూస్తే మంచి రాబడులే ఇస్తుందని చరిత్ర చెబుతున్న సత్యం.

రిస్క్ వద్దనుకుంటే?

మార్కెట్ ఆటుపోట్లను ఏ మాత్రం తట్టుకోలేమనుకుంటే బులియన్ మార్కెట్‌ను ఎంచుకోవచ్చు. అసలు ఈ గోల అంతా ఎందుకనుకుంటే ఎంఎఫ్‌లు అందించే మల్టీ అసెట్ ఫండ్స్ సిప్‌ను ఎంచుకోవడం మంచిది. ఈ ఫండ్స్ మదుపరుల నుంచి సమీకరించిన నిధులను లోతైన పరిశోధన ద్వారా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈక్విటీ, బులియన్, రుణ పత్రాల మార్కెట్లలో మదుపు చేస్తాయి. గత రెండు మూడేళ్లుగా ఈ ఫండ్స్ కూడా పెద్దగా రిస్క్ లేకుండా మదుపరులకు మంచి రాబడులు పంచాయి. కొద్దిగా రిస్క్ తీసుకోగలిగితే సిప్ పద్దతిలో బ్లూచిప్ కంపెనీల షేర్లలోనూ మదుపు చేయవచ్చు. అయితే ఈ మదుపరులు ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితులను గమనిస్తుండాలి. లేకపోతే పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.



జోయాలుక్కాస్.. రాజస్థాన్, జైపూర్‌లోని వైశాలీ నగర్‌లో కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ షోరూమ్‌ను రాజస్థాన్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కృష్ణన్ కుమార్ విష్ణోయ్, మిస్ సుప్రానేషనల్ ఇండియా 2025 ఆయుశ్రీ మాలిక్, మిస్ యూనివర్స్ రాజస్థాన్ 2025 షీనా పరాశర్, జోయాలుక్కాస్ సీఈఓ బాబీ జార్జ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ జువెలరీ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ ప్రమోద్ అగర్వాల్, జోయాలుక్కాస్ రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్ పాల్గొన్నారు.

సెప్టెంబరుతో త్రైమాసికంలో డీమార్ట్ రూ.16,676.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.684.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 3.85%, ఆదాయం 15.45% పెరిగింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	127	అనంతపురం	100
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	515
వరంగల్	502	గోదావరి	505
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.	72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,260 ▲	1,13,900 ▲	1,75,000 ▲
విజయవాడ	1,27,000 ▲	1,20,500 ▲	1,71,000 ▲
విశాఖపట్నం	1,24,150 ▼	1,13,800 ▼	1,87,000 ▲
రాజమండ్రి	1,24,250 ▲	1,13,900 ▲	1,74,000 ▲
ప్రొద్దుటూరు	1,29,600 ▲	1,19,200 ▲	1,71,000 ▲
ముంబై	1,21,525 ▼	1,11,317 ▼	1,64,500 ▲



బిర్లా మ్యూజియంలో ఏర్పాటు చేసిన సింగరేణి పెవిలియన్‌లో స్టెగోడాన్ జాతి ఏనుగు దంతాలు

బిర్లా మ్యూజియంలో స్టెగోడాన్ జాతి ఏనుగు దంతాల ప్రదర్శన

- 4 ఏళ్ల క్రితం ఓపెన్‌కాస్టు తవ్వకాల్లో గుర్తింపు
- మ్యూజియంలో సింగరేణి పెవిలియన్ ప్రారంభం

హైదరాబాద్/గోదావరిఖని/గన్‌పార్క్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం రామగుండం-1 ఏరియాలోని మేడిపల్లి ఓపెన్‌కాస్టు తవ్వకాల్లో దొరికిన లక్షల ఏళ్ల నాటి స్టెగోడాన్ జాతి ఏనుగు దంతాల అవశేషాలు, డైనోసార్ కాలానికి చెందిన శిలాజ కలపను సింగరేణి సంస్థ బిర్లా సైన్స్ సెంటర్‌కు అందజేసింది. ఈ మేరకు మ్యూజియంలో ఏర్పాటు చేసిన సింగరేణి పెవిలియన్‌ను శనివారం సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, బిర్లా పురావస్తు, ఖగోళ, వైజ్ఞానిక సంస్థ చైర్‌పర్సన్ నిర్మల బిర్లా ప్రారంభించారు. స్టెగోడాన్ జాతి ఏనుగుల మనుగడ 110 లక్షల సంవత్సరాల కిందట ప్రారంభమై.. 6 వేల ఏళ్ల క్రితం ముగిసింది. నాలుగేళ్ల కిందట మేడిపల్లి ఓపెన్‌కాస్టులో తవ్వకాలు జరుపుతుండగా.. రెండు భారీ ఏనుగు దంతాలు, దవడ ఎముకలు లభ్యమయ్యాయి. ఇవి గోదావరి పరివాహక ప్రాంతంలో లక్షల ఏళ్ల క్రితం సంచరించిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగు అవశేషాలుగా శాస్త్రజ్ఞులు గుర్తించారు. స్టెగోడాన్ ఏనుగులు 13 అడుగుల ఎత్తు, 12.5 టన్నుల బరువుతో ఉండేవని, వీటి దంతాలు 12 అడుగుల పొడవు ఉండేవని విశ్లేషించారు.

పాపికొండల పర్యాటకం పునఃప్రారంభం

భద్రాచలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన పాపికొండల యాత్ర మూడు నెలల విరామం తరువాత అధికారికంగా పునఃప్రారంభమైంది. గోదావరిలో వరదల కారణంగా జూలై 11 నుంచి నిలిచిపోయిన పేరంటాలపల్లి-పాపికొండల బోటింగ్ సేవలకు ఏపీ ఉన్నతాధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఏపీలోని రాజమండ్రికి సమీపంలో ఉన్న గండిపోచమ్మ ఫెర్రీ పాయింట్ నుంచి బోటింగ్ సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. అయితే, తెలంగాణ నుంచి వచ్చే పర్యాటకుల కోసం ఏపీలోని అల్లూరి జిల్లా వరరామచంద్రాపురం మండలం పోచారం ఫెర్రీ పాయింట్ నుంచి కూడా బోటింగ్ సేవలు ఈ వారంలోనే పునఃప్రారంభం కానున్నట్లు బోటు యజమానులు తెలిపారు.

భీమన్న ఆలయంలో ఆర్జిత సేవలు ప్రారంభం

- వేములవాడ రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమన్న ఆలయంలో కోడె మొక్కులతో పాటు ఆర్జిత సేవలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో రమాదేవితో కలిసి శనివారం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా రాజన్న ఆలయంలో భక్తుల దర్శనాలను నిలిపివేసి భీమన్న ఆలయంలోకి మార్పినట్లు అధికారులు తెలిపారు. రాజన్న ఆలయంలో నిర్వహించే కోడె మొక్కులు, అభిషేకం, చండీహోమంతో పలు రకాల పూజలను భీమేశ్వర ఆలయంలో నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

నా కళ్లతో చూడు మిత్రమా!

- అంధుడైన స్నేహితుడిని తిరుమల కొండకు
- శ్రీవారి మెట్టు మార్గంలో తీసుకువచ్చిన వ్యక్తి



శ్రీవారి మెట్టు మార్గంలో నడిచివస్తున్న జగేంద్ర, శశికిరణ్

తిరుమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆ దేవదేవుడిమీద అఖండమైన భక్తి.. చెదరని ఆత్మవిశ్వాసం.. కంటి చూపులేని అతన్ని మెట్లెక్కి తిరుమల కొండకు చేరుకునేలా చేసింది. బెంగళూరుకు చెందిన జగేంద్ర చిన్నతనంలోనే చూపు కోల్పోయాడు. చేతికర్ర సాయంతో నడవడంలో ఇటీవల శిక్షణ తీసుకున్నాడు. ఈ సమయంలో 20% మాత్రమే చూపున్న శశికిరణ్ అతనికి స్నేహితుడయ్యాడు. తిరుమల కొండకు నడిచి చేరుకోవాలనే తన చిరకాల కోరికను స్నేహితుడికి తెలిపాడు. అంతే ఆ ఇద్దరూ కలిసి శనివారం ఉదయం శ్రీవారిమెట్టు దారిలో కర్రలు తాటించుకుంటూ 2,400 మెట్లు ఎక్కి తిరుమలకు చేరుకున్నారు. పూర్తి చూపులేని జగేంద్రకు స్నేహితుడు శశికిరణ్ భుజమే ఆసరాగా మారింది. తిరుమల కొండపై 'ఆంధ్రజ్యోతి' ఈ స్నేహితులను పలకరించగా 'ఇంత శ్రమపడి వచ్చినా గుడిలోని స్వామి రూపాన్ని చూసే అవకాశం మాకు లేదు. కానీ స్వామి సమక్షంలో ఉన్నామన్న అనుభూతి చాలు. ఆయన ముందు నిలబడి మేము వచ్చినామప్ప. మమల్ని ఆశీర్వదించండి. తర్వాత జన్మంటూ ఉంటే నిన్ను కంటి నిండుగా చూసే భాగ్యం మాకు ప్రసాదించు అని వేడుకుంటాం' అని చెప్పారు.

ఈ రేస్‌తో మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణను కేంద్రంగా నిలిపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ రేసుతో హైదరాబాద్ గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా మారిందని చెప్పారు. తమిళనాడులోని కోయంబత్తూరులో శుక్రవారం జరిగిన 10వ ఎఫ్ఎంఎఈ నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ రేసు దాదాపు రూ.700 కోట్ల ఆర్థిక కార్యకలాపాలను సృష్టించి, అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించిందని పేర్కొన్నారు. యువత అవకాశాలకోసం ఎదురుచూడకుండా, వాటిని సృష్టించుకోవాలని సూచించారు.

అబద్ధాల హరీశ్‌కు గల్ఫ్ కార్మికుల చేతిలో చెప్పు దెబ్బలే..: ఈరవత్రి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ సంక్షేమ కార్యక్రమాలపై అబద్ధాలాడుతున్న హరీశ్‌రావును గల్ఫ్ కార్మికులు చెప్పుతో కొట్టే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రానికి చెందిన సుమారు 2 వేల మంది గల్ఫ్ దేశాల్లో మృత్యువాతపడితే ఒక్క కుటుంబానికి రూపాయి ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదని విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ బీఎం వినోద్‌కుమార్‌తో కలిసి ఈరవత్రి మీడియాతో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల పాలిట కేసీఆర్ ఒక నరరూప రాక్షసుడైతే.. కేటీఆర్, కవిత, హరీశ్‌లు పిల్ల రాక్షసులని అభివర్ణించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఒక్క రూపాయి కేటాయించని నాటి ఆర్థిక మంత్రి హరీశ్.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వారి గురించి మాట్లాడుతున్నాడని వినోద్‌కుమార్ మండిపడ్డారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. కాగా, గాంధీ జయంతి రోజు మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐకానిక్ భవనంలా టీస్క్వేర్

- అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించాలి
- వచ్చే నెలాఖరు కల్లా పనుల ప్రారంభం
- అద్భుతమైన మాల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి; చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టీస్క్వేర్‌ను అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఆకర్షించేలా ఐకానిక్ బిల్డింగ్‌లా నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని ఐటీ ప్రాంతమైన రాయదుర్గంలో అత్యంత ఆకర్షణీయంగా దీని నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్‌కు కొత్త పబ్లిక్ డెస్టినేషన్‌గా నిలవాలన్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని డిజైన్‌లను అధికారులు సీఎంకు చూపించగా.. వాటికంటే మెరుగైనదిగా, రాబోయే డిజిటల్ యుగానికి అన్ని సౌకర్యాలు కలిగి ఉండేలా సృజనాత్మక డిజైన్‌తో తీర్చిదిద్దాలని సూచించారు. శనివారం ఐసీసీసీ (ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్)లో వి-హబ్, ఏఐ హబ్, టీ స్క్వేర్ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీస్క్వేర్‌ను ఎంటర్‌టైన్‌మెంట్, టూరిజం, ఫుడ్, బిజినెస్‌ల కలయికగా అద్భుతమైన మాల్ కాంప్లెక్స్‌గా రూపుదిద్దాలన్నారు. ఈ మాల్ 24 గంటలూ అందుబాటులో ఉండే ప్రదేశంగా మారాలన్నారు. పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ డిజిటల్ డిస్‌ప్లేలు, ప్రకాశవంతమైన లైటింగ్‌తో ఈ ప్రాంతాన్ని మిరుమిట్లు గొలిపే చైతన్యవంతమైన వేదికగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. నిర్మాణ పనులు నవంబరు నెలాఖరుకల్లా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దానికోసం అవసరమైన జైకా ఫండింగ్ త్వరగా పొందేలా సమన్వయం చేయాలని సూచించారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలైన ఆపిల్ వంటి కంపెనీలు కూడా టీస్క్వేర్ ప్రాజెక్టులో భాగమయ్యేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా పార్కింగ్ సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా డిజైన్‌లో పొందుపరచాలని సూచించారు.

ఏఐ హబ్‌తో ప్రాజెక్టులన్నీ ఒకే వేదిక పైకి..

రాష్ట్రంలోని అన్ని ఏఐ స్టార్టప్‌లు, సెంటర్లు, ప్రాజెక్టులను ఒకే వేదికపైకి తీసుకురావడమే 'ఏఐ ఇన్నోవేషన్ హబ్' లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నగరంలో ఏర్పాటు చేయబోయే ఏఐ హబ్ ప్రణాళికలను కూడా ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రపంచ స్థాయి కంపెనీలు, పరిశోధన సంస్థలు, అంతర్జాతీయ ఏఐ కేంద్రాలతో భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏఐలో నైపుణ్యం కలిగిన ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏఐ ఆధారిత ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ప్రత్యేక 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' ఏర్పాటు అవసరమన్నారు. 2024నుంచి తమ ప్రభుత్వం ఏఐ రంగంలో అనేక పథకాలు చేపట్టిందన్నారు. అందులో గ్లోబల్ ఏఐ సమ్మిట్, ఏఐ సిటీ ప్రాజెక్ట్ ప్లాన్, తెలంగాణ ఏఐ రైజింగ్ గ్రాండ్ చాలెంజ్, ఏఐ క్యాటలిస్ట్ ప్రోగ్రామ్ ముఖ్యమైనవని తెలిపారు.

నేడు తుంగతుర్తికి సీఎం రేవంత్

తుంగతుర్తి: సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి రానున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభ సభకు సీఎం హాజరు కానున్నారు. సీఎంతోపాటు మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా రానున్నారు.

రాష్ట్రాభివృద్ధికి 8 ప్రశ్నలు

ప్రజల నుంచి సమాధానాలు కోరుతున్న ప్రభుత్వం.. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో ఆన్‌లైన్ సర్వే

- తెలుగు, ఇంగ్లిష్ ఉర్దూ భాషల్లో సర్వే ప్రశ్నావళి
- సర్వేలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్



ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళి

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో ఎలా ఉండాలనుకుంటున్నారు? మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఎలా ముందుకెళ్లాలి? జిల్లాల అభివృద్ధితో పాటు ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందుకోసం ఎనిమిది ప్రశ్నలతో కూడిన ప్రత్యేక ప్రశ్నావళిని రూపొందించింది. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ఈ ప్రశ్నలు ఉంటాయి. ప్రజలు www.telangana.gov.in, www.telanganarising వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్ సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలిపే అవకాశం కల్పించింది. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో ఈ ఆన్‌లైన్ సర్వేను శుక్రవారం సాయంత్రం ప్రారంభించింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయాన్ని పెంచే మార్గాలతోపాటు పలు రంగాల్లో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కాగా, వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకి చేర్చుతూ ఆయా రంగాల వారీగా అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని భావిస్తోంది. ఇందుకోసమే 'తెలంగాణ రైజింగ్-2047' పేరుతో లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీనికి అనుసంధానంగా 'తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. ఇందులో ప్రజలనూ భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ సర్వేను ప్రారంభించింది. మొత్తం 8 ప్రశ్నలను రూపొందించి.. వాటికి సమాధానంగా ఎంచుకునేందుకు 3-4 ఆప్షన్లను ఇచ్చింది. సర్వేలో పాల్గొన్న వారికి ప్రభుత్వం తరఫున పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను కూడా ఆన్‌లైన్ ద్వారా జారీ చేస్తున్నారు.

డిసెంబరు 9న డాక్యుమెంట్ విడుదల..

తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్న ప్రభుత్వం ఇందులో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)ను కూడా భాగస్వామ్యం చేసింది. ఈ నెల 10 నుంచి 25 వరకు జరిపిన సర్వేలో వచ్చిన వివరాలన్నింటినీ ఐఎస్‌బీ బృందం ద్వారా క్రోడీకరించనున్నారు. ఆ వివరాలను తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ కోసం పలు రంగాల్లో నిపుణులైన వారితో ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీకి అందజేసారు. ఆ కమిటీ వాటన్నింటిని పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించి, ప్రభుత్వానికి అందించనుంది. ఆ తరువాత డాక్యుమెంట్‌కు సంబంధించిన అంశంపై రాష్ట్ర మంత్రివర్గ స మావేశంలో చర్చించనున్నారు. క్యాబినెట్‌లో ఆమోదం పొందాక.. దానిని డిసెంబరు 9న విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సర్వేలోని 8 ప్రశ్నలు, వాటికి ఆప్షన్లు ఇవే..

ప్రశ్న: మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం ఎలా?

ఆప్షన్లు: వ్యాపార పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి విధాన సంస్కరణలు, సులభ వ్యాపార పద్ధతులు

- యువత నేతృత్వంలో వ్యాపారాలకు మార్గదర్శనం. ప్రపంచ మార్కెట్లకు వెళ్లే అవకాశం కల్పించడం
- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆవిష్కరణలు
- పర్యాటకం, సంస్కృతి, స్థానిక ప్రోత్సాహం
- చిన్న వ్యాపారాలు, స్థానిక స్టార్టప్‌లకు మద్దతు
- ఏఐ, కమ్యూనికేషన్, డిజిటల్ సేల్స్, మేనేజ్‌మెంట్ తరహా ఉద్యోగాల కల్పన తదితరాలు

ప్రతి జిల్లా అభివృద్ధి ఎలా?

- సమీపంలో మంచి స్కూళ్లు, ఆస్పత్రుల ఏర్పాటు
- నగరాలలో మాత్రమే కాకుండా మీ ప్రాంతంలో ఉద్యోగాలు, వ్యాపారాలు
- మహిళలకు మరింత భద్రత, అవకాశాల కల్పన
- గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఆధునిక సేవలు
- నిజాయితీ, పారదర్శకమైన పాలన

వృద్ధి రంగాలు (ఉద్యోగ కల్పనకు ఏ రంగాలపై దృష్టి పెట్టాలి?)

- ఐటీ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ.
- ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ టెక్నాలజీ, కోల్డ్ స్టోరేజీ
- ఫార్మాస్యూటికల్, బయోటెక్, ఆరోగ్య ఆవిష్కరణలు
- సెమీ కండక్టర్ల తయారీ
- పర్యాటకం, సంస్కృతి, చలనచిత్రం సృజనాత్మక పరిశ్రమలు
- డ్రోన్లు, స్పేస్-టెక్‌తో పాటు శిక్షణ

మెరుగైన జీవన నాణ్యత?

- స్వచ్ఛమైన గాలి, నీరు
- మెరుగైన పారిశుధ్యం (వ్యర్థాల తొలగింపు).
- అన్ని పట్టణాలు/నగరాల్లో మంచి రోడ్లు
- అన్ని రోడ్లలో బస్సులు, రైళ్లు
- తక్కువ ధరలకే గృహాల అందుబాటు

ఆరోగ్యం, శ్రేయస్సు?

- ప్రతీ మండలంలో ఆస్పత్రులు, మొబైల్ హెల్త్ వాహనాలు
- తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు, మందులు, టెలి మెడిసిన్
- స్వచ్ఛమైన నీరు, పారిశుధ్య నియంత్రణ
- ఆరోగ్య కౌన్సెలర్లు
- మానసిక ఆరోగ్యం, పోషణపై అవగాహన.
- ఆరోగ్య బీమా

విద్య, నైపుణ్యాలు (భవిష్యత్ కోసం విద్యను ఎలా మెరుగుపరచాలి)?

- ఏఐ రోబోటిక్స్, వాతావరణం
- ఆధునిక బోధన, శిక్షణపొందిన ఉపాధ్యాయులు
- కాలేజీలు, ఐటీఐల్లో నైపుణ్య ఆధారిత కోర్సులు
- అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకులుపొందే ప్రపంచ స్థాయి వర్సిటీల స్థాపనను సులభతరం చేయడం.
- సాఫ్ట్ స్కిల్ అభివృద్ధి, మార్కెట్ సిద్ధతపై దృష్టి.

పాలన- పౌర సేవలు

- అన్ని సేవలకు వన్-స్టాప్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రోత్సహించడం
- మీ ప్రాంతంలో అభివృద్ధి పనులపై సమాచారం.
- తగిన బడ్జెట్లు, అధికారాలతో స్థానికతను శక్తిమంతంగా చేయడం.

మీ దృష్టి. (2047 నాటికి తెలంగాణను మీరు ఎలా చూస్తున్నారు)?

- దీనికి సమాధానంగా సర్వేలో పాల్గొన్న వ్యక్తి తన అభిప్రాయాలను నమోదుచేసేలా అవకాశం కల్పించారు.

ప్రజల ఆలోచనలు తెలుసుకోవాలనే..



ఇదొక మహత్తరమైన అంశం. రాష్ట్ర భవిష్యత్ ఎలా ఉండాలి? ప్రజల అవసరాలు ఏంటి? వారికి ఏం కావాలనే వివరాలు వారి ద్వారానే తెలుసుకోవాలనే ఆన్‌లైన్ సర్వేకు శ్రీకారం చుట్టాం. సర్వే ద్వారా అన్ని జిల్లాల ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రజాభిప్రాయం మేరకే తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఉంటుంది. మారుమూల ప్రజల అవసరాలు, సౌకర్యాలను తెలుసుకుని ఆ మేరకే డాక్యుమెంట్‌ను రూపొందిస్తాం. ప్రజలంతా ఈ సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలపాలి.

- జయేశ్ రంజన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఐపీఎస్‌కే ఇలా జరిగితే.. సామాన్యుల పరిస్థితేంటి?

- ఐపీఎస్ పూరన్ ఆత్మహత్యపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..
- దళితులు, బలహీనవర్గాలపై అన్యాయాలను సహించొద్దని వ్యాఖ్య
- పూరన్ ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హరియాణాలో సీనియర్ ఐపీఎస్ పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూరన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఒక ఏడీజీపీ స్థాయి అధికారి కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకున్నారంటే.. సాధారణ ప్రజలు ఎలాంటి బాధలు ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూరన్‌కు జరిగినది ఒక వ్యక్తిపై దాడి కాదని.. దేశం మొత్తంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇటువంటి ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల పట్ల ద్వేషం.. సమాజాన్ని విషపూరితం చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనల వల్ల రాజ్యాంగం, సమానత్వం, న్యాయంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. దళితులు, బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని వ్యాఖ్యానించారు. ఉన్నతాధికారుల కుల వివక్ష, మానసిక వేధింపులను భరించలేక ఐపీఎస్ పూరన్ ఆత్మహత్యకు పాల్పడటం విచారకరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్ సహా 8 మంది సీనియర్ అధికారుల కారణంగానే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పూరన్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని తెలిపారు. ఆ సూసైడ్ నోట్ ఆధారంగా బాధ్యులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా అత్యున్నత అఖిల భారత సర్వీసుల్లో ఇంకా కుల వివక్ష, ఆత్మహత్య వంటి సంఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలపై కుల వివక్ష, అణిచివేతలు, అక్రమ నిర్బంధం, ఆత్మహత్యలు వంటి సంఘటనలను బీజేపీ సర్కారు ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు.

భట్టిని కలిసిన నవీన్ యాదవ్..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. డిప్యూటీ సీఎం భట్టిని కలిశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని.. ఉప ఎన్నికలో గెలిచి కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని సూచించారు.

మద్దతు ధర పథకంలో 25% పరిమితిని రద్దు చేయండి

- జొన్న, మొక్కజొన్నలను మద్దతు ధర పథకంలో చేర్చండి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు తుమ్మల లేఖ



హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మద్దతు ధర పథకంలోకి కొన్ని పంటలను చేర్చడంతో పాటు, కొన్ని పంటలకు ఉన్న కొనుగోలు పరిమితులను తొలగించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శనివారం కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 'మద్దతు ధర పథకం (ప్రైస్ సపోర్ట్ స్కీమ్) కింద కొనుగోలు చేస్తున్న నువ్వులు, వేరుశెనగ, శనగలు, సోయాబీన్, పెసర వంటి పంటలపై కేంద్రం 25 శాతం సీలింగ్ విధించింది. దీనివలన రైతులు పండించిన పంటల్లో కేవలం 25% మాత్రమే మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంది. ఈ 25% పరిమితిని రద్దు చేయడం లేదా సడలించాలి' అని తుమ్మల కోరారు. రాష్ట్రంలో సాగయ్యే జొన్న, మొక్కజొన్న పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేంద్రం ద్వారా కొనుగోలు జరగకపోవడం వలన రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. ఈ రెండు పంటలను మద్దతు ధర పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కనీస మద్దతు ధర అమలు, మార్కెట్ జోక్యాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యయభారం పంచుకునే విధంగా ఆర్థిక విధానం రూపుదిద్దాలని సూచించారు. ఇక దేశంలో ఆయిల్ పామ్ పంటలో తెలంగాణ ముందంజలో ఉందని, దాదాపు 1.08 లక్ష హెక్టార్లలో 73,744 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారని, 2025-26 ఏడాదిలో మరో 50వేల హెక్టార్లలో సాగు లక్ష్యంగా పెట్టుకున్నామన్నాని వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం క్రూడ్ పామాయిల్‌పై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడంతో ధరలు తీవ్రంగా పడిపోయి, ఆయిల్‌పామ్ రైతులు పొందే తాజా ఫ్రూట్ బంచ్ ధర టన్నుకు రూ.20వేల కంటే తక్కువకు చేరుకుందని పేర్కొన్నారు. అలాగే పత్తి పంట విషయంలోనూ సీసీఐ కొనుగోళ్లు 50-60 శాతానికే పరిమితం అవుతున్నాయని, కొనుగోళ్లలో ఆలస్యంతో రైతులను కనీస మద్దతు ధర లభించడంలేదని తెలిపారు. పత్తి దిగుమతులపైనా సుంకం మినహాయింపు ఇవ్వడం వల్లనూ దేశీయంగా ధరలు మరింత పడిపోయాయని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్, పత్తి పంటలపై దిగుమతి సుంకం విధానాల్లో దేశీయ మార్కెట్ సీజన్‌లకు అనుగుణంగా ఉండేలా ఆర్థిక శాఖ సమన్వయం చేసుకుని, రైతులను మేలు జరిగేలా చూడాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే రైతుల రక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కాగా "పీఎం ధన్ ధాన్య కృషి యోజన", "నేషనల్ మిషన్ ఆన్ పల్సెస్" పథకాలను ప్రారంభించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ ద్వారా తుమ్మల అభినందనలు తెలిపారు.

జంబో జాబితాకు నో!

బీజేపీ రాష్ట్ర కమిటీలో పరిమిత సంఖ్యలోనే పదవులు

- ఎక్కువ మందికి చోటు కల్పించే ప్రతిపాదన పక్కకే..
- భారీ జాబితాకు కోతపెట్టిన జాతీయ నాయకత్వం
- ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు భేటీ
- జుబ్లీహిల్స్ ఉప ఎన్నిక సన్నద్ధతపై నివేదిక
- నేడు అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం

హైదరాబాద్/ న్యూఢిల్లీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీ పదవుల కోసం బీజేపీ నేతలు పెట్టుకున్న ఆశలపై జాతీయ నాయకత్వం నీళ్లు చల్లింది. రాష్ట్ర కమిటీలో మరికొందరు సీనియర్లకు చోటు కల్పించడంతోపాటు అనుబంధ విభాగాల్లో ఎక్కువ మందికి అవకాశం కల్పించేలా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు రూపొందించిన భారీ జాబితాకు కోతపెట్టింది. కమిటీలు, అనుబంధ విభాగాల్లో ఇంతకుముందు తరహాలోనే పరిమిత సంఖ్యలోనే పదవులు ఉంటాయని జాతీయ నాయకత్వం స్పష్టం చేసినట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. రాంచందర్‌రావు శనివారం ఢిల్లీలో పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్ తదితరులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, జుబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార వ్యూహాన్ని వారికి వివరించారు.

భారీ జాబితాతో వెళ్లినా..

రాంచందర్‌రావు గత నెల మొదటివారంలో 22 మంది సభ్యులతో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అందులో 8 మంది ఉపాధ్యక్షులు, 8 మంది కార్యదర్శులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, జాయింట్ కోశాధికారి, ముఖ్య అధికార ప్రతినిధి ఉన్నారు. అయితే పదవులు ఆశించిన కొందరు అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. రాంచందర్‌రావు రాష్ట్ర కమిటీలో, వివిధ విభాగాల్లో మరికొందరికి అవకాశం కల్పించేలా భారీ జాబితా సిద్ధం చేసుకుని ఢిల్లీ వెళ్లారు. ఆ నియామకాలకు జాతీయ నాయకత్వం అనుమతి కోరారు. మరో ఇద్దరు ఉపాధ్యక్షులు, ఇద్దరు కార్యదర్శులు, 20 మందికిపైగా అధికార ప్రతినిధులను నియమిస్తామని వివరించారు. కానీ, గతంలో ఉన్న పదవులకు మించివద్దని, జాబితాను కుదించాలని జాతీయ నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో 10-12 మందికి మాత్రమే అధికార ప్రతినిధులుగా అవకాశం రావొచ్చని సమాచారం. కాగా, ఢిల్లీ పర్యటన సందర్భంగా త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డితో రాంచందర్‌రావు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

నేడు జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఖరారు

రాష్ట్రంలో ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు బీజేపీ అభ్యర్థిని పార్టీ జాతీయ నాయకత్వం ఆదివారం ఖరారు చేయనుంది. సాయంత్రం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులతోపాటు దేశవ్యాప్తంగా ఉప ఎన్నికలు జరగనున్న 8 స్థానాల అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రేసులో ఉన్న ముగ్గురి నుంచి ఒకరిని ఎంపిక చేసి ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి రేసులో లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ పేర్లు ఉన్నట్టు తెలిసింది.

ఎన్.గౌతంరావు బాధ్యతల స్వీకరణ

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సీనియర్ నాయకులు ఎన్.గౌతంరావు, శనివారం బాధ్యతలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు

రాష్ట్రాన్ని ఐటీ, ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఆర్ఆర్ఆర్‌తో పారిశ్రామికవృద్ధి: మంత్రి కోమటిరెడ్డి
- వైద్యరంగంలో ఫార్మాసిస్టులది కీలక పాత్ర: శ్రీధర్ బాబు

హైదరాబాద్/అఫ్జల్‌గంజ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను భవిష్యత్‌లో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేలా ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రాన్ని ఐటీ, ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అల్యూమిని (1974-2025) గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు, కాకతీయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీ వృత్తి సమాజం పట్ల, పరిశోధన, నూతన ఆవిష్కరణలకు మధ్య వారధిగా పని చేస్తోందన్నారు. గతంలో నిర్మించిన ఓఆర్ఆర్ వలన ఎన్నో పరిశ్రమలు వచ్చాయని, మళ్లీ ఇప్పుడు రీజనల్ రింగు రోడ్డుతో పారిశ్రామిక వృద్ధికి మరింత బాటలు పడుతాయని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వైద్యరంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. ఫార్మాసిస్టులు నాణ్యమైన మందులను తయారు చేస్తూ రాబోయే కాలానికి దిక్సూచిగా మారాలని ఆకాంక్షించారు. తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే సంకల్పమని, వరంగల్, నల్లగొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించే బాధ్యత నాదే

- విద్యార్థులను పాఠశాలలకు రానివ్వండి
- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): "బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల పట్ల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ఆలోచించాలి. పెండింగ్ బకాయిలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా. ఈనెల 20 లోపు మొదటి దఫా, మిగిలిన బకాయిలను ఈనెల చివరిలోగా చెల్లిస్తాం. బకాయిలు ఇప్పించే బాధ్యత నాదే. పిల్లలను పాఠశాలలకు రానివ్వండి" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. సచివాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో విద్య, సంక్షేమం భ్రష్టుపట్టాయన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అప్పట్లో ఆహారం నాణ్యతలేమిపై జాగారం చేశారని, అప్పుడు ఒక్క మంత్రి కూడా అక్కడకు వెళ్లలేదని, ఇప్పుడు తమపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

జాతీయ ఆయుర్వేద సంస్థను మంజూరు చేయండి

- కేంద్ర ప్రభుత్వానికి వైద్య శాఖ మంత్రి దామోదర లేఖ

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు జాతీయ ఆయుర్వేద సంస్థను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆయుష్, ఆరోగ్యశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌కు మంత్రి దామోదర లేఖ రాశారు. ఇందుకు అవసరమైన భూమి, ఇతర వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌కు ఈ లేఖను హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు అందజేశారు.

రేపు సుప్రీంకు!



(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయానికి వచ్చారు. సుప్రీంకోర్టులో పిటిషన్ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు న్యాయ నిపుణులు, అడ్వొకేట్ జనరల్‌తో పాటు పలువురు నిపుణులతో చర్చిస్తున్నారు. శుక్రవారం రాత్రి హైకోర్టు తీర్పు కాపీ వచ్చిన తర్వాత 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి అనే అభిప్రాయం ధ్రువీకరణ కావడంతో సుప్రీంను ఆశ్రయించాలని నిర్ణయించారు. శనివారం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ జూమ్ మీటింగ్‌లో సుదీర్ఘంగా మాట్లాడారు. సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

16న మంత్రివర్గం

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 15, 10, 25 శాతం చొప్పున రిజర్వేషన్లు ఇస్తూ ఎన్నికలు జరపాలని హైకోర్టు చెబుతున్న నేపథ్యంలో బీసీలకు 42 శాతం సాధించుకోవాల్సిందేనని పట్టుదలతో ఉన్న రాష్ట్ర మంత్రివర్గం ఈ అంశంపై చర్చించేందుకు గురువారం(16వ తేదీ) సమావేశం అవుతోంది. సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ వేస్తున్న నేపథ్యంలో సుప్రీం స్పందన తర్వాత కార్యాచరణ చర్చించాలనే ఉద్దేశంతో మంత్రివర్గ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో పలు కేసుల విచారణల్లో భాగంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. బీసీలకు ఇప్పుడున్న వాటికన్నా రిజర్వేషన్లు పెంచాలన్నా అందుకు సంబంధించి సమగ్ర వివరాలు ఉండాలని (ఎంపిరికల్ డేటా) సూచించింది. 2022లో బీసీలకు రిజర్వేషన్లకు సంబంధించిన ఒక తీర్పులో ట్రిపుల్ టెస్ట్‌ను నిర్దేశించింది. 1) స్థానికంగా ఓబీసీల సమగ్ర వివరాలను సేకరించాలి. అందుకు ప్రత్యేకంగా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. 2) కమిషన్ అధ్యయనం తరువాత రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాలి. 3) మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ల విషయంలో మొదటి రెండు టెస్టులు పాసయింది. మూడో సూచనతోనే ఇప్పుడు చిక్కుముడి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే వివరాల ప్రకారం రాష్ట్రంలో 56 శాతానికి పైగా బీసీలు ఉన్నారని తేలింది. జనాభా నిష్పత్తి ప్రకారమే వారికి 42 శాతం కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. కానీ, 42 శాతం కలిపితే రాష్ట్రంలో రిజర్వేషన్లు 67 శాతం అయ్యాయి. సుప్రీం తీర్పు మేరకు రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు, రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించి, అమలు చేయాలంటే అందుకు రాజ్యాంగ సవరణ అవసరం. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో పెట్టాలి. అందుకోసమే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు 2018 పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు చేస్తూ ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపింది. దీనిపై కేంద్రం సమాధానం చెప్పడం లేదు. వెరసి ఇప్పుడు ఈ అంశం సుప్రీంకు చేరనుంది. ఇప్పటికే రాష్ట్రంలో గ్రామాల్లో పంచాయతీల గడువు ముగిసి ఏడాదిన్నరకు పైగా అవుతుంది. ఫలితంగా కేంద్రం నుంచి అందాల్సిన నిధులు అందడంలేదు. పాలక మండళ్లు లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని కూడా సుప్రీంలో ప్రస్తావించనున్నారు.

మమ్మల్ని ఏం చేయమంటారు?

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటి ప్రకారం ఎన్నికలను నిర్వహించాలంటూ గత నెలలో ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. దాని ఆధారంగానే సెప్టెంబరు చివర్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్లు విడుదల చేసింది. రిజర్వేషన్లకు ప్రాతిపదిక అయిన జీవో నంబర్ 9ను హైకోర్టు కొట్టేయడంతో ఎన్నికల ప్రక్రియను ఈసీ నిలిపేసింది. ఈ మేరకు గురువారమే ప్రకటన కూడా విడుదల చేసింది. తాజాగా అందుబాటులోకి వచ్చిన తీర్పు కాపీలో రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ ఎన్నికలు నిర్వహించాల్సిందేనని హైకోర్టు చెప్పడంతో, దానికి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రాతిపదికగా ప్రస్తావించడంతో ఈసీ సందిగ్ధంలో పడింది. గురువారం ఎన్నికల ప్రక్రియను నిలిపేసిన ఈసీ తీర్పు కాపీ అందిన తర్వాత ఏమీ చేయకుండా కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో 'మమ్మల్ని ఏం చేయమంటార'ంటూ ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం వ్యవహారంపై ఎన్నికల కమిషన్ కూడా న్యాయ నిపుణులతో చర్చిస్తోంది. ఎన్నికల సంఘం అడిగితే సుప్రీంకోర్టుకు వెళుతున్నట్లు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

తీర్పులో ఏముంది?

హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్‌ఈసీ) మీద గురుతర బాధ్యత పడింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లాలని, 50 శాతం సీట్లు ఓపెన్ క్యాటగిరీకి నోటిఫై చేసి, ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. తీర్పులో పలు కీలక విషయాలు ప్రస్తావించింది. చట్టబద్ధంగా అనుమతించిన కాలం కంటే ఎక్కువగా స్థానిక ఎన్నికలను ఆపడానికి వీల్లేదని, పంచాయతీల గడువు ముగియడానికి ముందే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని చట్టంలో స్పష్టంగా ఉందని హైకోర్టు గుర్తు చేసింది. గతంలో కూడా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా తీవ్ర ఆలస్యం చేయడంపై హైకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. సెప్టెంబరు 30 లోగా అంటే మూడు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాల్సిందే అని హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. పంచాయతీల పదవీకాలం ముగిసి హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చే నాటికి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక 15 నెలలైంది. ప్రస్తుతం 18 నెలలుగా పంచాయతీలు కార్యవర్గం లేకుండా ఖాళీగా ఉంటున్నాయి. ప్రస్తుతం హైకోర్టు డివిజన్ బెంచ్ ఇదే విషయాన్ని నొక్కి చెప్పింది. తాము ఎన్నికల ప్రక్రియను ఆపడం లేదని పదే పదే గుర్తుచేసింది. చట్టబద్ధమైన పరిమితి(స్టాట్యుటరీ పీరియడ్) కంటే ఎక్కువకాలం స్థానిక ఎన్నికలు వాయిదా వేయడం కుదరదని చెప్పింది. ఎన్నికల ప్రక్రియపై ముందుకు వెళ్లాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. తాము ఎన్నికల ప్రక్రియను నిలిపేయడం లేదని, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉన్న రిజర్వేషన్ల జీవోపై మాత్రమే స్టే ఇచ్చామని గుర్తు చేసింది. రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లో 50 శాతానికి మించరాదన్న సూత్రం ప్రకారం ఓపెన్ క్యాటగిరీకి 50 శాతం సీట్లను కేటాయిస్తూ నోటిఫై చేయాలని, ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లిపోవాలని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో 50 శాతం సీట్లు ఓపెన్ క్యాటగిరీకి కేటాయిస్తూ నోటిఫై చేసి ఎన్నికల ప్రక్రియ కొనసాగించాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘం మీద పడింది. ఈ లెక్కన ఎప్పట్లాగే ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం 15, 10 శాతం పోగా బీసీలకు 25 శాతం మిగులుతాయి. ఓపెన్ క్యాటగిరీలో కచ్చితంగా 50 శాతం సీట్లు కొనసాగించాల్సి ఉంటుంది. ఏవైనా రాష్ట్రాలు ట్రిపుల్ టెస్ట్ అమలు చేయలేకపోతే ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘాలు దామాషా సీట్లను ఓపెన్ క్యాటగిరీగా నోటిఫై చేసి ఎన్నికలు కొనసాగించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని హైకోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎన్నికల ప్రక్రియపై ముందుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

హైకోర్టు స్టేపై 'సుప్రీం'కు వెళతాం

- బీసీ రిజర్వేషన్లపై రాజీ లేదు
- 42శాతం కోటా ఇచ్చాకే స్థానిక ఎన్నికలు
- అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్/నిజామాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాజీ పడే ప్రసక్తే లేదని, హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని, ప్రధాన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. శనివారం మహేశ్ గౌడ్ నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మాకు దమ్ము ధైర్యం ఉన్నందునే బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామ'ని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో చేసిన ధర్నాకు బీజేపీ నేతలు ఎందుకు ముఖం చాటేశారో జవాబు చెప్పాలన్నారు. 'బీసీల నోటి కాడ ముద్దను బీజేపీ, బీఆర్ఎస్ లాగేసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ముంబై రైల్వే లైన్ విషయమై సీఎంతో చర్చించినట్టు తెలిపారు. కామారెడ్డి బీసీ సభ తప్పకుండా నిర్వహిస్తామన్నారు. బనకచర్ల విషయంలో ఒక చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే బనకచర్ల జీవోలు విడుదల అయ్యాయని, మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పులు కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

బిల్లులపై సుప్రీంకోర్టుకు వెళ్లాలి: కవిత

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు అసెంబ్లీ, మండలి ఆమోదం తెలిపి 6నెలలు గడిచిందని, అయినప్పటికీ రాష్ట్రపతి ఇంకా వాటిని ఆమోదించలేదని కల్వకుంట్ల కవిత ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిన్న ప్రయత్నం కూడా చేయలేదని విమర్శించారు. బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం 2018 పంచాయతీరాజ్ చట్టానికి చేసిన సవరణ బిల్లు కూడా గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. అసెంబ్లీ, మండలి ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున కేంద్రం, రాష్ట్రపతి, గవర్నర్‌పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీకోర్టును ఆశ్రయించాలని డిమాండ్ చేశారు.

జీసీసీలకు కేరాఫ్ హైదరాబాద్

గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల ఏర్పాటుకు అంతర్జాతీయ సంస్థల క్యూ.. దేశంలో గత 30 నెలల్లో ఏర్పాటైన వాటిల్లో 40% ఇక్కడే

ఎక్స్‌ఫీనోస్ వర్క్ ఫోర్స్ నివేదిక

హైదరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భారత దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ ప్రత్యేక కేంద్రంగా అవతరిస్తోంది. వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలు వ్యాపార విస్తరణ, పరిశోధన, అభివృద్ధి కోసం ఇతర దేశాల్లో జీసీసీలను ఏర్పాటు చేస్తుంటాయి. ఇందుకోసం తక్కువ ఖర్చులో అత్యుత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్న నగరాలను ఎంపిక చేసుకుంటాయి. అయితే, ఈ జీసీసీల ఏర్పాటుకు అంతర్జాతీయ సంస్థలు ఇటీవల కాలంలో హైదరాబాద్‌కు క్యూ కడుతున్నాయి. ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి పొందడం, అనేక అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు కొలువై ఉండడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండడం, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం ఇందుకు ప్రధాన కారణాలు.

30 నెలల్లో 64 జీసీసీలు

ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3800 జీసీసీలు ఉండగా వాటిల్లో 1900 (50%) భారత్‌లోనే ఉన్నాయి. నగరాల వారీగా చూస్తే 890 జీసీసీలతో బెంగళూరు దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. 475 జీసీసీలతో ఢిల్లీ తర్వాతి స్థానంలో ఉండగా, ముంబైలో 375, పుణేలో 370, హైదరాబాద్‌లో 360, చెన్నైలో 310 ఉన్నాయి. అయితే, గత 30 నెలల్లో దేశంలో ఏర్పాటైన జీసీసీల్లో అత్యధికం హైదరాబాద్‌లోనే ఉండడం విశేషం. 2022 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 160 జీసీసీలు ఏర్పాటవ్వగా అందులో 40 శాతం అనగా 64 జీసీసీలు హైదరాబాద్‌లోనే ఏర్పాటయ్యాయి. బెంగళూరు, ఢిల్లీ, ముంబై, పుణే నగరాలను వెనక్కినెట్టి మరీ హైదరాబాద్ ఈ ఘనత సాధించడం గమనార్హం. హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటైన జీసీసీల్లో అమెరికా కేంద్రంగా ఉన్న హెల్త్‌కేర్, ఆటోమోటివ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్నాలజీ రంగాలకు చెందిన కంపెనీలు ఉన్నాయి. ఎక్స్‌ఫీనోస్ వర్క్‌ఫోర్స్ రీసెర్చ్ నివేదిక ప్రకారం జీసీసీల ఏర్పాటులో రాబోయే మూడేళ్లలో హైదరాబాద్ జీసీసీల పవర్ హౌస్‌గా అవతరించనుంది. కాగా, గత 30నెలల్లో హైదరాబాద్‌లో ఏర్పాటైన జీసీసీలతో రాష్ట్రంలో కొత్తగా 20వేల మందికి ఉద్యోగాలు లభించాయని రాష్ట్ర ఐటీ శాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

బెంగళూరును అధిగమిస్తాం

రాష్ట్ర ప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాల వల్ల హైదరాబాద్‌లో జీసీసీల ఏర్పాటుకు కంపెనీలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాయి. అత్యధిక జీసీసీలతో బెంగళూరు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. రాబోయే మూడేళ్లలో బెంగళూరును వెనక్కినెట్టి హైదరాబాద్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంది.

- శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

కొండా X పొంగులేటి!

దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యం!

అధిష్ఠానానికి కొండా దంపతుల ఫిర్యాదు?

ఎవరిపైనా మేం ఫిర్యాదు చేయలేదు: మురళి



హైదరాబాద్/వరంగల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖ మధ్య విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. తాను నిర్వహిస్తున్న దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యం చేసుకుంటున్నారంటూ కొండా సురేఖ అసంతృప్తితో ఉన్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతుండగా.. మేడారం జాతర అభివృద్ధి పనుల విషయంలో ఇది మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రూ.71 కోట్లతో చేపట్టిన పనుల టెండర్‌లను తన మనుషులకు ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయత్నిస్తున్నారంటూ కొండా సురేఖ సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మరోవైపు మంత్రి సురేఖ భర్త కొండా మురళి నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఈ పరిణామం అధికార కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. అయితే జాతర పనులపై తాము ఎవరిపైనా, ఎవరికీ ఫిర్యాదు చేయలేదని కొండా మురళి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఏ మంత్రితోనూ తమకు విభేదాలు లేవన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు.

ప్రజల నమ్మకాన్ని అనుసరిస్తూ సేవలందించాలి

- వ్యవస్థలు ఎంత పటిష్ఠంగా ఉంటే దేశం అంతగా పురోగమిస్తుంది
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్ వ్యాఖ్యలు



భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు సీజే అపరేశ్‌కుమార్ సింగ్, న్యాయమూర్తులు

యాదాద్రి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని అనుసరిస్తూ సేవలు అందించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్ చెప్పారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరిలో జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థలు ఎంత పటిష్ఠంగా ఉంటే దేశం అంతగా పురోగమిస్తుందన్నారు. జిల్లా ప్రజలకు ఒకేచోట అన్ని రకాల న్యాయ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పోక్సో, ఫ్యామిలీ కోర్టులను కలిపి 10ప్లస్2 కోర్టులతో నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన, జస్టిస్ వి.రామకృష్ణారెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

ప్రజలకు ఒకే చోట అన్ని రకాల న్యాయసేవలు

నస్పూర్: ప్రజలకు న్యాయసేవలను ఒకే చోట అందించాలన్న లక్ష్యంతో భవన సముదాయాలను నిర్మిస్తున్నామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో రూ.81 కోట్ల వ్యయంతో నిర్మించే జిల్లా కోర్టుల భవన సముదాయ నిర్మాణ పనులను శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు పూర్తయితే అన్ని రకాల న్యాయ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నగేష్ భీమపాక ముఖ్య అతిథిగా నస్పూర్‌కు హాజరై భూమి పూజ చేశారు.

బీసీలకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్లే కావాలి

- కేంద్రంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్లే కావాలని.. పార్టీల పరమైన రిజర్వేషన్లు వద్దని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తి వేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. హైకోర్టు స్టేను కారణంగా చూపుతూ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కట్టబెడతామని మభ్యపెట్టే మాటలు వద్దని అన్నారు. బీసీలను రాజకీయ బానిసత్వం నుంచి విముక్తం చేసే దిశగా ఇకపై మరింత బలమైన అడుగులు వేస్తామని తెలిపారు. ఐక్య కూటమి పోరాటంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. బీసీ రాజకీయ ఆకాంక్షల కోసం ప్రజా ఐక్య కూటమి సమర శంఖం పూరించినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ వీరేందర్ గౌడ్, యువజన వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్, రిటైర్డ్ ప్రభుత్వ అధికారి ప్రసన్న, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి, రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, వంగ రవి యాదవ్, లక్ష్మణ్, మదన్ యాదవ్, లక్ష్మి, జ్యోతి మాదేవి, భాగ్యలక్ష్మి, వరుణ్, సాయి పాల్గొన్నారు.

వారంలోగా చేప పిల్లల విడుదల

- ప్రణాళికలు సిద్ధం చేయండి: మంత్రి వాకిటి

హైదరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెరువుల్లో చేప పిల్లల విడుదల చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. రాష్ట్రంలోని చెరువుల్లో చేప పిల్లల విడుదలపై శనివారం సచివాలయంలో ఆయన సమీక్షిస్తూ.. తెలంగాణలో రెండు జీవ నదులు కృష్ణ, గోదావరిలతోపాటు పుష్కలంగా గొలుసుకట్టు చెరువులు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో చేప పిల్లల పంపిణీకి రూ.122 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ నుంచి పంపిణీ జరిగేలా చేప పిల్లలను ఉత్పత్తి చేయాలని, అందుకనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అధికారులకు వాకిటి చెప్పారు. గత ప్రభుత్వంలో మాదిరిగా చేప పిల్లలను వదలడంలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తాను 32 జిల్లాల్లోని చెరువులను సందర్శించడానికి సిద్ధంగా ఉన్నానన్న వాకిటి.. అందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తితే తన వ్యక్తిగత ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చునని చెప్పారు.

సుప్రీం' తీర్పుకు విరుద్ధంగా హైకోర్టు స్టే

- త్వరలో బీసీ మిలియన్ మార్చ్ : ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఆ ప్రక్రియపై ఎలా స్టే విధిస్తారని ప్రశ్నించారు. హైకోర్టు స్టేకు వ్యతిరేకంగా ఈ నెల 14న నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు 22 ప్రజాసంఘాలు మద్దతునిచ్చాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలూ ఈ బంద్‌లో భాగస్వామ్యం కావాలని ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో కాచిగూడలోని ఓ హోటల్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుకు రాజ్యాంగంలో 243డి6 అధికరణం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉన్నా.. హైకోర్టు స్టే ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఈ నెల 14న రాష్ట్ర బంద్ విజయవంతమైన తర్వాత బీసీల మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని కృష్ణయ్య చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లో లక్ష మందితో భారీ బహిరంగ సభలు జరపనున్నట్లు తెలిపారు.

బంద్‌కు మద్దతు కోసం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా ఈ నెల 14న జరిగే రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆర్.కృష్ణయ్య వినతి పత్రం సమర్పించారు. బర్కత్‌పురాలోని కేంద్ర మంత్రి నివాసానికెళ్లి వినతి పత్రం అంద చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ పార్టీ సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారన్నారు.

అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలి

- న్యాయ పోరాటం చేస్తూనే ప్రధానిని కలవాలి
- జాజుల, కోదండరాం, వీహెచ్

హైదరాబాద్, బంజారాహిల్స్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన స్టేపై తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంఘాలు, అఖిలపక్ష పార్టీల నేతలు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని కోరారు. బంజారాహిల్స్‌లోని శనివారం కళింగ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 'బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే- పరిష్కార మార్గాలు, భవిష్యత్ కార్యాచరణపై అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలు సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఈరవత్రి అనిల్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బీజేపీ నేత ఆనంద్ కుమార్ గౌడ్, సీపీఎం నాయకుడు బండారు రవికుమార్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు స్టేపై ఒక వైపు న్యాయ పోరాటం చేస్తూనే, మరోవైపు ప్రధాని వద్దకు అఖిలపక్ష నాయకులను తీసుకువెళ్లాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. రిజర్వేషన్ల రక్షణకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. అఖిలపక్ష బృందంతో ప్రధాని నరేంద్రమోదీని కలిసి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సమాజం రోడ్డుపైకి వస్తే పరిస్థితి వేరుగా ఉంటుందని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి కలవారు ఏకం కావాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం తరహాలో జేఏసీతో ఐక్య పోరాటం చేయాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదని, అవసరమైన పక్షంలో 50 శాతం దాటవచ్చని కోర్టులు గతంలో స్పష్టం చేసిన విషయాన్ని సమావేశంలో బీసీ ప్రతినిధులు గుర్తుచేశారు. ఢిల్లీలో కార్యాచరణకు అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. హైకోర్టు స్టేపై సోమవారం సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పిటిషన్ దాఖలు చేస్తామని, రిజర్వేషన్ల పెంపునకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ సమావేశంలో 30కి పైగా బీసీ కుల సంఘాలు, 80 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, నాయకులు, యూనివర్సిటీల ఆచార్యులు పాల్గొన్నారు.

అఫ్ఘాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో మహిళా జర్నలిస్టులకు
నో ఎంట్రీపై విపక్షాల మండిపాటు

న్యూఢిల్లీ, అక్టోబరు 11: భారత పర్యటనకు వచ్చిన అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. ఇలాంటి వివక్షపై ప్రధాని మోదీ మౌనం వహించడం ద్వారా నారీ శక్తిని ఒట్టి నినాదంగా మార్చేశారని విమర్శించాయి. మన భూభాగంపై మహిళలను ఎవరైనా ఎలా అవమానిస్తారని కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో నిలదీసింది. ప్రధాని మోదీ, విదేశాంగమంత్రి జైశంకర్ భారత మహిళల ప్రాథమిక గౌరవాన్ని కూడా కాపాడలేకపోయారని విమర్శించింది. 'మిస్టర్ మోదీ.. ఒక బహిరంగ కార్యక్రమానికి మహిళా జర్నలిస్టులను మినహాయించడాన్ని మీరు అనుమతించారు. తద్వారా వారి హక్కుల కోసం నిలబడలేని బలహీనుడినని దేశంలోని ప్రతి మహిళకూ మీరు స్పష్టం చేశారు' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'ఎక్స్'లో విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరిని ప్రధాని మోదీ స్పష్టం చేయాలని లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. 'మహిళా జర్నలిస్టులను ఆహ్వానించలేదని తెలిసినప్పుడు పురుష జర్నలిస్టులు ఆ సమావేశం నుంచి వాకౌట్ చేయాల్సింది' అని చిదంబరం వ్యాఖ్యానించారు. ఈ ఘటనను అనుమతించడం ద్వారా మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రతి మహిళనూ అవమానించిందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా మండిపడ్డారు. ఈ వివాదంపై విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. 'నిన్న ఢిల్లీలో అఫ్ఘాన్ విదేశాంగమంత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత విదేశాంగశాఖ పాత్ర ఏమీ లేదు' అంటూ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

పాక్ పోలీసు శిక్షణ కేంద్రంపై తాలిబన్ల దాడి

» ఏడుగురు పోలీసుల మృతి.. మసీదు ఇమాం కూడా..

పెషావర్, అక్టోబరు 11: పాకిస్థాన్‌లోని పోలీసు శిక్షణ కేంద్రంపై తాలిబన్లు జరిపిన దాడిలో ఏడుగురు పోలీసులు మరణించగా, మరో 13 గాయపడ్డట్టు శనివారం ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఖైబర్ పంఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌పై శుక్రవారం అర్ధరాత్రి నిషేధిత తెహరీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చెందిన సభ్యులు దాడి చేశారు. 7-8 మంది ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో వచ్చి కాల్పులు జరిపినట్టు సైనిక వర్గాలు తెలిపాయి. పేలుడు పదార్థాలు నింపిన ట్రక్‌లో వచ్చి మెయిన్ గేటు ద్వారా శిక్షణ కేంద్రంలోకి ప్రవేశించినట్టు పేర్కొన్నాయి. అనంతరం ఆ ట్రక్కును పేల్చివేశారని తెలిపాయి. ఈ పేలుడు కారణంగా ఒక పోలీసు మరణించగా, అనంతరం జరిగిన కాల్పుల్లో మరో ఆరుగురు చనిపోయినట్టు వివరించాయి. ఆ కేంద్రంలోని మసీదుపై ఉగ్రవాదులు గ్రెనేడ్లు విసరడంతో అక్కడ పనిచేసే ఇమాం ప్రాణాలు కోల్పోయారు. దాదాపు అయిదు గంటల పాటు సాగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇదిలా ఉండగా, పాలస్తీనాకు అనుకూలంగా పాకిస్థాన్‌లో తెహరీక్ ఐ లబ్బాయిక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) శనివారం నిర్వహించిన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో 11 మంది మరణించగా, 50మందికిపైగా గాయపడ్డారు.

బిహార్‌లో 100సీట్లలో పోటీకి ఎంఐఎం రెడీ

పట్నా, అక్టోబరు 11: వచ్చేనెలలో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లలో పోటీ చేస్తామని ఎంఐఎం ప్రకటించింది. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహా ఘట్‌బంధన్ (ఇండీ కూటమి) తిరస్కరణతో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంఐఎం బిహార్ రాష్ట్ర అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్ శనివారం పీటీఐకి చెప్పారు. 2020 ఎన్నికల్లో పోటీ చేసిన సీట్ల కంటే ఐదు రెట్లు ఎక్కువ. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే, ఆర్జేడీ- కాంగ్రెస్‌లతో కూడిన మహాఘట్‌బంధన్ కూటములకు ప్రత్యామ్నాయంగా భావ సారూప్య పార్టీలతో కలిసి తృతీయ కూటమి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. 2020 ఎన్నికల్లో లౌకిక ఓట్లను చీల్చిందని తమ పార్టీపై ఆరోపణలు చేసిన మహాఘట్‌బంధన్‌కు ఇక ఆ అవకాశం లేదన్నారు.

ఎయిరిండియా డ్రీమ్‌లైనర్లను తనిఖీ చేయండి

» మంత్రి రామ్మోహన్ నాయుడుకు పైలెట్ల సంఘం లేఖ

న్యూఢిల్లీ, అక్టోబరు 11: బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్స్‌లో ఇటీవల కాలంలో తలెత్తిన రెండు సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఎయిర్ ఇండియా నడుపుతున్న ఆ శ్రేణి విమానాలన్నింటినీ నిలిపివేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలెట్స్(ఫిప్) కోరింది. ఈమేరకు పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడుకు లేఖ రాసింది. దీనిపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. జరిగిన సంఘటనలకు ఎలక్ట్రికల్ వ్యవస్థలో లోపాలు కారణం కాదని స్పష్టం చేసింది. ఫిప్... 5,000 మంది పైలెట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ. డ్రీమ్ లైనర్ విమానాలను వెంటనే నిలిపివేసి తక్షణమే క్షుణ్ణంగా ఎలక్ట్రికల్, ఆటోమేషన్ వ్యవస్థలపై ఆడిటింగ్ నిర్వహించాలని ఈ సంస్థ కోరింది. అలాగే ఎయిర్ ఇండియా ఆపరేషన్స్‌పై డీజీసీఏ ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

టీసీఎస్‌లో 19,755 ఉద్యోగాలకు కోత!

న్యూఢిల్లీ, అక్టోబరు 11: దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టీసీఎస్ గతంలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగాల్లో కోతలు చేపట్టింది. సెప్టెంబరు 30తో ముగిసిన త్రైమాసికంలో 19,755 మంది ఉద్యోగులను టీసీఎస్ తగ్గించుకుంది. వీరిలో స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదిలేసిన వారితో పాటు తొలగింపులకు గురైనవారు ఉన్నారు. దీంతో 2022 తర్వాత తొలిసారిగా ఈ సంస్థలో ఉద్యోగుల సంఖ్య 6 లక్షల కంటే దిగువకు పడిపోయింది. తొలగించిన ఉద్యోగులకు పరిహారం చెల్లింపుల కోసం కంపెనీ రూ.1,135 కోట్లను కేటాయించింది. భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలటిక్స్ వంటి నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల నియామకాలను కొనసాగిస్తామని సంస్థ పేర్కొంది.

కోల్డ్‌రిఫ్ దగ్గు మందు మరణాలు..
తమిళనాడు ఎఫ్‌డీఏ అధికారుల నిర్లక్ష్యం వల్లే!

చెన్నై, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మధ్యప్రదేశ్‌లో చిన్నారుల మృతికి కారణమైన కాంచీపురం కేంద్రంగా పనిచేసే కోల్డ్‌రిఫ్ దగ్గుమందు తయారీ సంస్థపై జరిపిన విచారణలో తమిళనాడు ఎఫ్‌డీఏ లోపాలు బయటపడినట్లు సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ)వర్గాలు పేర్కొన్నాయి. సదరు కంపెనీపై నిఘా పెట్టడంలో, మందుల తయారీకి అవసరమైన విధివిధానాలు పాటిస్తున్నారా అని తనిఖీ చేయడంలో టీఎన్‌ఎఫ్‌డీఏ ఘోరంగా విఫలమైనట్లు విచారణలో వెల్లడైంది. పదేళ్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎఫ్‌డీఏ అధికారులు ఆ కంపెనీ ఛాయలకు కూడా వెళ్లలేదని, ఎలాంటి తనిఖీలు చేపట్టలేదని సీడీఎస్‌సీఓ వర్గాలు పేర్కొన్నాయి.

అమెరికాలో బడిలో కాల్పులు..నలుగురి మృతి

మిస్సిసిపీ, అక్టోబరు 11: అమెరికాలోని పాఠశాలలో శనివారం వేకువజామున జరిగిన కాల్పుల్లో నలుగురు మరణించగా, 12 మంది గాయపడ్డారు. మిస్సిసిపీలోని లేలాండ్ హైస్కూలు పూర్వ విద్యార్థులు హోం కమింగ్ వీకెండ్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించుకునే సమయంలో ఈ విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం సాయంత్రమే వారంతా పాఠశాల ఆవరణకు చేరుకున్నారు. మెయిన్ రోడ్డులోనే ఉన్న ఆ పాఠశాలకు అర్ధరాత్రి దాటిన తరువాత వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అనంతరం కాల్పులు జరిపాడు.

రైతన్నకు ధనధాన్యం

ఢిల్లీలోని పూసా క్యాంపస్‌లో రైతులు, శాస్త్రవేత్తలతో ప్రధాని మోదీ



(మొదటి పేజీ తరువాయి)

యోజన' (పీఎం-డీడీకేవై)ను రూ.24వేల కోట్లతో, పప్పు ధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్‌ను రూ.11,440 కోట్లతో ప్రధాని ప్రారంభించారు. అలాగే వ్యవసాయం, పశుసంవర్ధక, చేపల పెంపకం, ఆహార ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించిన రూ.5,450 కోట్ల ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించారు. దాదాపు రూ.815 కోట్ల విలువైన అదనపు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అరగంట పాటు మోదీ ప్రసంగించారు. దేశం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతోపాటు ఎగుమతులను పెంచేందుకు రైతులు కృషి చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వాలపై అయన విరుచుకుపడ్డారు. వ్యవసాయం, అనుబంధ రంగాల వృద్ధికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఎలాంటి విజన్, వ్యూహం లేదని, ఫలితంగా వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ (ఏకోసిస్టమ్) బలహీనపడిందన్నారు. కొత్తగా ప్రారంభించిన పథకాల గురించి మాట్లాడుతూ.. పీఎం-డీడీకేవై, పప్పుధాన్యాల మిషన్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.35వేల కోట్లకు పైగా పెట్టుబడి పెడుతుందని, ఇది కోట్లాది మంది రైతుల తలరాతను మార్చుతుందన్నారు. ఈ పథకాలను వచ్చే రబీ (శీతాకాలం) సీజన్ నుంచి 2030-31 వరకు అమలు చేస్తారు. ప్రపంచమార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల ఉత్పత్తిపై రైతులు దృష్టి పెట్టాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. మన దిగుమతులను తగ్గించుకోవాలని, ఎగుమతులను పెంచడంలో వెనుకబడవద్దన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పప్పు ధాన్యాల ఉత్పత్తిదారు, వినియోగదారుగా ఉన్నప్పటికీ భారత్ ఇప్పటికీ దిగుమతులపై ఆధారపడుతోందని ప్రధాని గుర్తు చేశారు. పప్పుధాన్యాల మిషన్‌లో భాగంగా వీటి ఉత్పత్తిని పెంచి స్వయం సమృద్ధిని సాధించడానికి 2030 నాటికి పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని 35 లక్షల హెక్టార్లు పెంచడం లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం 252.38 లక్షల టన్నులుగా ఉన్న పప్పు ధాన్యాల దిగుబడిని 2030-31 నాటికి 350 లక్షల టన్నులకు పెంచడం మిషన్ లక్ష్యమన్నారు. ఆశావహ జిల్లాల కార్యక్రమాన్ని అనుసరించి రూపొందించిన పీఎం-డీడీకేవై.. వ్యవసాయ రంగంలో వెనుకబడిన 100 జిల్లాలను లక్ష్యంగా చేసుకుంటుందని, వివిధ మంత్రిత్వ శాఖల్లోని 36 పథకాలను సమ్మిళితం చేసి అమలు చేయనున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి..

గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశాయని ప్రధాని మండిపడ్డారు. ఆ నిర్లక్ష్య విధానాన్ని తాను మార్చానని, విత్తనాల నుంచి మార్కెట్ వరకు వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తెచ్చినట్టు తెలిపారు. గత 11 ఏళ్లలో ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచిందని గుర్తు చేశారు. గత పదేళ్లలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఫెర్టిలైజర్‌పై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని, ఇందులో రూ.3.75 లక్షల కోట్లు పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు అందించినట్టు చెప్పారు. కానీ పదేళ్ల యూపీఏ హయాంలో రూ.5 లక్షల కోట్ల సబ్సిడీ మాత్రమే ఇచ్చిందన్నారు. ఇటీవలే వ్యవసాయ యంత్రాలు, విడిభాగాలపై జీఎస్టీ రేట్లను తగ్గించామని, దీంతో రైతులకు రెండింతల ఆదాకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. గత 11 ఏళ్లలో దేశ వ్యవసాయ ఎగుమతులు దాదాపు రెండింతలయ్యాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తి దాదాపు 9 కోట్ల టన్నులు, పండ్లు, కూరగాయల ఉత్పత్తి 6.4 కోట్ల టన్నులకు పైగా పెరిగిందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రూ.2 లక్షల కోట్లకు పైగా బీమా క్లెయిమ్‌లను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు.

మోదీని ట్రంప్ అత్యంత సన్నిహితుడిగా భావిస్తారు

అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 11: భారత్‌తో బంధాన్ని అమెరికా ఎంతో విలువైనదిగా భావిస్తుందని, ప్రధాని మోదీని అధ్యక్షుడు ట్రంప్ అత్యంత సన్నిహితుడిగా భావిస్తారని ఆ దేశ రాయబారి సెర్గియో గోర్ చెప్పారు. భారత్‌లో ఆరు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రంప్-మోదీ ఉన్న చిత్రపటాన్ని ఆయన ప్రధానికి బహూకరించారు. రక్షణ, వాణిజ్యం, అరుదైన ఖనిజాల గురించి మోదీతో చర్చించినట్లు తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్, విదేశాంగ కార్యదర్శి మిస్రీతోనూ తాను సమావేశమైనట్లు గోర్ తెలిపారు. గోర్‌తో సమావేశం తర్వాత ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. గోర్ హయాంలో భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలతో భారత్-అమెరికా మధ్య సంబంధాల్లో ఘర్షణ నెలకొన్న తరుణంలో గోర్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

కోల్‌కతా, అక్టోబరు 11 : పశ్చిమ బెంగాల్‌లో మరో ఘోరం జరిగింది. ఒడిశాకు చెందిన ఒక వైద్య విద్యార్థినిని పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో గుర్తుతెలియని వ్యక్తులు గ్యాంగ్ రేప్ చేసినట్లు పశ్చిమ బెంగాల్ పోలీసులు శనివారం తెలిపారు. దుర్గాపూర్‌లోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో రెండో సంవత్సరం వైద్య విద్య చదువుతోన్న విద్యార్థిని శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి భోజనానికి క్యాంపస్ బయటకు రాగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన ఆమె అదే కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని పోలీసులు పేర్కొన్నారు. వైద్య విద్యార్థిని శుక్రవారం రాత్రి 8-8.30 గంటల మధ్య తన స్నేహితుడితో కలిసి వైద్య కళాశాల బయటకు వచ్చినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఆ సమయంలో ముగ్గురు గుర్తుతెలియని యువకులు వారి వద్దకు వచ్చారు. దీంతో ఆమె స్నేహితుడు ఆమెను ఒంటరిగా వదిలి వెళ్లిపోయాడు. అనంతరం ఆ ముగ్గురు ఆమె ఫోన్ లాక్కుని క్యాంపస్ బయట ఉన్న అడవిలోకి లాక్కు వెళ్లి గ్యాంగ్‌రేప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోనే గత ఏడాది ఆగస్టులో ప్రభుత్వ ఆర్జీకార్ మెడికల్ కళాశాలలోనే వైద్యురాలిని రేప్ చేసి హత్య చేశారు. ఈ ఏడాది జూన్‌లో దక్షిణ కోల్‌కతాలోని లా కళాశాలలో న్యాయ విద్యార్థినిని ముగ్గురు గ్యాంగ్ రేప్ చేశారు. రెండు నెలల క్రితం జోకాలోని ప్రతిష్టాత్మక ఐఐఎం మెన్స్ హాస్టల్‌లో మేనేజ్‌మెంట్ విద్యార్థినిని రేప్ చేశారు.

వాట్సప్ లేకుంటే అరట్టై ఉందిగా!

» సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 11: వాట్సప్ బదులుగా స్వదేశీ యాప్ అయిన అరట్టైను ఉపయోగించుకోవచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్య చేసింది. ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్న ఆ వ్యక్తి గత 10-12 ఏళ్లుగా వాట్సప్ ద్వారా తన ఖాతాదార్లకు సమాచారం పంపిస్తున్నాడు. ఉన్నట్టుండి వాట్సప్ తన ఖాతాను బ్లాక్ చేయడంతో ఇబ్బంది కలుగుతోందని పేర్కొంటూ 32వ అధికరణం కింద సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం.. సమాచారం అందజేయడానికి స్వదేశీ యాప్ అరట్టై ఉంది కదా, దాన్ని ఉపయోగించుకోవచ్చని సూచించింది.

దేశంలో తగ్గుతున్న జననాలు!

» 2023లో 2లక్షలకు పైగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 11: దేశంలో జననాల నమోదు సంఖ్య తగ్గుముఖం పట్టింది. 2023లో నమోదైన జననాల సంఖ్య 2022తో పోలిస్తే రెండు లక్షలకుపైగా తగ్గింది. గత ఐదేళ్లలో ఇలా జననాల నమోదు తగ్గడం ఇది మూడోసారి. అదే సమయంలో మరణాల రిజిస్ట్రేషన్ స్వల్పంగా పెరిగింది. కేంద్ర హోం వ్యవహారాల శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) నివేదిక 2023లో ఈ వివరాలను వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం.. 2023లో దేశవ్యాప్తంగా 25.2 మిలియన్ (దాదాపు 2 కోట్ల 52 లక్షలు) జననాలు నమోదయ్యాయి. ఇది అంతకుముందు సంవత్సరం (2022) కంటే 0.9% (2,32,094) తక్కువ. దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుముఖం పడుతున్నదనడానికి ఇది సంకేతమని భావిస్తున్నారు. మరోవైపు, కొవిడ్-19 మహమ్మారి ముగిసిన తర్వాత కూడా మరణాల సంఖ్య స్వల్పంగా పెరిగింది. 2023లో మొత్తం 8.7 మిలియన్ (దాదాపు 87 లక్షలు) మరణాలు రిజిస్టర్ కాగా, ఇది 2022లో కంటే 9,749 (0.1%) ఎక్కువ. మరణాల సంఖ్య దాదాపు స్థిరంగా ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో జరిగే ప్రసవాల శాతం తగ్గింది. ఇది 2022లో 75.5% ఉండగా, 2023లో 74.7%కి పడిపోయింది. కొవిడ్‌కు ముందు ఇది 80 శాతం కంటే ఎక్కువగా ఉండేది. మరోవైపు, అత్యవసర సమయంలో సరైన వైద్య సహాయం అందక మరణించే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లో 50.7% ఉన్న మరణాల శాతం 2023లో ఏకంగా 53.4 శాతానికి పెరిగింది. కొవిడ్‌కు ముందు ఇది 40 శాతం లోపే ఉండేది.

చైనాపై మరో 100% సుంకాలు

» ఇప్పటికే ఉన్న 30 శాతానికి అదనం

» వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి..

» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



వాషింగ్టన్, అక్టోబరు 11: రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సుంకాలు, ఆంక్షలు అంటూ కలకలం రేపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోసారి చైనాపై విరుచుకుపడ్డారు. పలు వాణిజ్య అంశాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందంటూ.. చైనాపై 100శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. "నవంబర్ 1 నుంచి చైనాపై 100శాతం సుంకాలు విధిస్తాం. ఇప్పటికే ఉన్న సుంకాలకు ఇది అదనం. చైనా ప్రతిస్పందించే తీరును బట్టి ఈ సుంకాల్లో మార్పు ఉండొచ్చు. అంతేకాదు.. నవంబర్ 1 నుంచి అమెరికా నుంచి చైనాకు జరిపే అన్ని రకాల కీలక సాఫ్ట్‌వేర్ల ఎగుమతులపై నియంత్రణలు విధిస్తాం. చైనా నుంచి వచ్చే అన్ని రకాల ఉత్పత్తులతోపాటు విదేశాల నుంచి అమెరికాకు వచ్చే చైనా ఉత్పత్తులకూ ఈ సుంకాలు, ఆంక్షలు వర్తిస్తాయి. చైనా నుంచి జరిగే కీలకమైన ఉత్పత్తుల సరఫరాపై నియంత్రణలు విధించేందుకు ఆ దేశం సిద్ధమైనట్టు తెలిసింది. అది నైతికంగా అవమానకర ప్రవర్తన" అని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ చైనా ప్రతీకార చర్యలకు దిగితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

అరుదైన ఖనిజాలేంటి?

అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా టెక్, రక్షణ, ఎలక్ట్రానిక్ కంపెనీలకు అత్యవసరమైన అరుదైన ఖనిజాలు, వాటితో రూపొందించే సహజ అయస్కాంతాలు చాలా వరకు చైనా నుంచే సరఫరా అవుతాయి. ఎల్‌ఈడీ లైట్లు, టీవీలు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి యుద్ధ విమానాలు, జలంతర్గాములు, లేజర్లు, ఉపగ్రహాలు, క్షిపణుల తయారీ వరకు ఆ ఖనిజాలు కావాలి. అంటే అమెరికా ఆయుధ, టెక్ కంపెనీలకు ఇవి తప్పనిసరి. ఇంత కీలకమైన అరుదైన ఖనిజాల ఉత్పత్తి, ప్రాసెసింగ్‌లో 90శాతం వరకు చైనాలోనే జరుగుతుంది. ఈ రంగంలో ఉన్న పట్టుతోనే అమెరికాను కూడా చైనా ఆటాడిస్తోంది. మరోవైపు చైనా టెక్ కంపెనీలకు కీలకమైన కంప్యూటర్ చిప్స్ చాలా వరకు అమెరికా నుంచే అందుతాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా, అమెరికా ఏడో వేలం వేసినట్టుగా పరస్పరం 200శాతం దాకా టారిఫ్‌ల ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అమెరికా చిప్స్ కోసం చైనా, చైనా ఖనిజాల కోసం అమెరికా దిగివచ్చాయి. కానీ చైనా ఇటీవల మళ్లీ అరుదైన ఖనిజాల ఎగుమతులపై నియంత్రణలు విధించింది. ఇది ట్రంప్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ క్రమంలో దక్షిణ కొరియాలో జరగనున్న ఏపీఈసీ సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకునే అవకాశం ఉందంటూ ట్రంప్ ముందుగానే సంకేతాలు ఇచ్చారు. తర్వాత టారిఫ్‌లపైనా ప్రకటన చేశారు. ప్రస్తుతం చైనాపై అమెరికా 30శాతం సుంకాలు అమలు చేస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటన అమల్లోకి వస్తే సుంకాలు 130శాతానికి చేరుతాయి. తొలుత భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ తర్వాత.. రష్యా నుంచి చమురు కొంటోందంటూ మరో 25శాతం పెంచి 50శాతం చేశారు. ఇలా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలపై అడ్డగోలు సుంకాలు విధించడం ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరంగా గందరగోళానికి తెరలేపింది.

రోహ్‌తక్ ఎస్పీపై బదిలీ వేటు

» బిజార్ణియాపై హరియాణా ప్రభుత్వం చర్యలు

» ఐపీఎస్ పూరన్ కుమార్ భార్యకు సోనియా లేఖ

» న్యాయ పోరాటంలో అండగా ఉంటానని భరోసా



బిజార్ణియా

న్యూఢిల్లీ/చండీగఢ్, అక్టోబరు 11: తన భర్త సూసైడ్ నోట్‌లో పేర్లు ప్రస్తావించిన అధికారులందరినీ విధుల నుంచి తప్పించాలని, అరెస్టు చేయాలని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ భార్య అమనీత్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాపై హరియాణా ప్రభుత్వం శనివారం బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో సురిందర్ సింగ్‌ను నియమిస్తున్నట్లు అధికారిక ఉత్తర్వు పేర్కొంది. బిజార్ణియా పోస్టింగ్ ఆర్డర్‌ను విడిగా జారీచేయనున్నట్లు తెలిపింది. అయితే పూరన్ కుమార్ మృతి కేసును ఇందులో ప్రస్తావించలేదు. మరోవైపు డీజీపీ శత్రుజీత్‌ను కూడా దీర్ఘకాల సెలవుపై పంపాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. కాగా, పంచకులలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం నాయబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ ఈ కేసులో దర్యాప్తు జరుగుతోందని, దోషులుగా తేలిన వారిపై స్థాయితో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటనను రాజకీయం చేయొద్దని ప్రతిపక్షాలను కోరారు. మానసిక వేధింపులు, కులవివక్ష కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పూరన్ కుమార్ రాసిన తన సూసైడ్ నోట్‌లో డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాతో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను పేర్కొన్నారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా..: సోనియా

పూరన్ కుమార్ భార్య అమనీత్‌కు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ లేఖ రాశారు. పూరన్ ఆత్మహత్య విషయం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, తీవ్ర బాధ కలిగించిందన్నారు. "న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటంలో కోట్లాది మంది భారతీయులతో పాటు నేను కూడా అండగా ఉంటాను" అని లేఖలో తెలిపారు. మరోవైపు, పూరన్ కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఇంకా సమ్మతి తెలపలేదు. కొన్ని ఫిర్యాదుల కారణంగా ఆయన కుటుంబసభ్యులు పోస్టుమార్టానికి అనుమతి ఇచ్చేందుకు నిరాకరించారని, వాటిని పరిష్కరించేందుకు చర్చలు జరుగుతున్నాయని చండీగఢ్ డీజీపీ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.